

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 5

మంగళవారం 28-3-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సంస్క'రణం'

ఇజ్రాయెల్ జ్యుడీషియరీలో భారీ మార్పులకు ప్రతిపాదన.. నిరసనలు - 6లో



ఫస్ట్ సిటిజన్స్ చేతికి ఎస్‌వీబీ

ఎస్‌వీబీ సింహభాగం కార్యకలాపాలను ఫస్ట్ సిటిజన్స్ బ్యాంక్ దక్కించుకుంది. - 13లో



రాహుల్‌కు బీఆర్ఎస్ బాసట

రాహుల్‌ను అనర్హుడిగా ప్రకటిస్తూ తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ చేపట్టిన ఆందోళనలో బీఆర్ఎస్ ఎంపీలు కీలకంగా వ్యవహరించారు. - వివరాలు 3లో



కరోనా కొత్త కేసులు 1,805

దేశంలో కోవిడ్ మళ్లీ విజృంభిస్తోంది. 24 గంటల వ్యవధిలో కొత్తగా 1,805 కరోనా కేసులు నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది. - వివరాలు 6లో



అమెరికా గురుద్వారాలో కాల్పులు

అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం శాక్రమెంటోలో సిక్కుల గురుద్వారాలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. - వివరాలు 6లో



జీ20 సదస్సుకు చైనా గైర్హాజరు

ఈటానగర్‌లో ఆదివారం నిర్వహించిన జీ20 సన్నాహక సదస్సుకు చైనా గైర్హాజరైందని కేంద్ర ప్రభుత్వ అధికార వర్గాలు వెల్లడించాయి. - వివరాలు 6లో

రీజాయిన్.. రిజైన్!

కాంగ్రెస్‌లో చేరిన మర్నాడే రాజీనామా చేసిన డీఎస్

క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటానంటూ ఖర్గేకు లేఖ

డీఎస్ దగ్గరికి రావద్దని కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి మరోలేఖ రాసిన భార్య విజయలక్ష్మి

ఆరోగ్యరీత్యా రాజకీయాలు, ప్రయాణాలకు డీఎస్ దూరంగా ఉండాలంటూ వైద్యుల బులెటిన్

- డీఎస్‌కు తలనొప్పిగా మారిన ఇద్దరు కుమారుల రాజకీయ పంతం
- బీజేపీ ఎంపీగా ఉన్న చిన్న కుమారుడు అర్వింద్.. కాంగ్రెస్‌లో చేరిన పెద్ద కుమారుడు సంజయ్
- తండ్రిని తీసుకుని గాంధీభవన్‌కు వచ్చిన సంజయ్.. కాంగ్రెస్ జెండా కప్పుకున్న డీఎస్
- దీనిపై ఇద్దరు కుమారుల మధ్య విభేదాలు..
- రాజీనామాకు డీఎస్ నిర్ణయం..దీనికి అర్వింద్ బ్లాక్‌మెయిలే కారణమంటూ సంజయ్ ఆరోపణలు



రాజీనామా లేఖపై సంతకం చేస్తున్న డి. శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్) కాంగ్రెస్ పార్టీకి తిరిగి రాజీనామా చేశారు. తన పెద్ద కుమారుడు సంజయ్‌తో కలసి కాంగ్రెస్ కండువా కప్పుకొన్న మరుసటి రోజే రాజీనామా చేస్తున్నట్టు డీఎస్ ప్రకటించడం రాజకీయంగా కలకలం రేపింది. సంజయ్ చేరిక నేపథ్యంలో ఆశీస్సులు అందజేయడానికి గాంధీభవన్‌కు వెళ్లానని.. కానీ తనకు కండువా కప్పి పార్టీలో చేరినట్టు ప్రచారం చేశారని రాజీనామా లేఖలో పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. అయితే తాను ఎప్పటికీ కాంగ్రెస్ వాదినేనని.. ఆరోగ్య పరిస్థితుల రీత్యా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నానని డీఎస్ పేర్కొన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు డీఎస్ రాసిన లేఖతో పాటు తన భర్తను రాజకీయాల్లోకి లాగవద్దని ఆయన భార్య విజయలక్ష్మి కాంగ్రెస్ నేతలను ఉద్దేశిస్తూ రాసిన లేఖ, ఆమె మాట్లాడుతున్న వీడియో, రాజీనామా

మిగతా 5వ పేజీలో ▶



అమెరికా కలకు డాలర్ బరువు

అటు భారీగా పెరుగుతున్న ఫీజులు.. ఇటు రూపాయి మారకం పతనం

- ప్రతీ విద్యార్థిపై లక్షన్నరకుపైగా ట్యూషన్ ఫీజు భారం.. ఇతర ఖర్చులపైనా ప్రభావం
- భారత్ నుంచి ఏటా 6 లక్షల మంది విదేశాలకు..
- ఇందులో తెలంగాణ నుంచి 30వేల మంది అమెరికాకు
- పెరిగిన ఖర్చుతో విద్యార్థులకు ఇబ్బంది.. బ్యాంకు రుణాలకు సవాలక్ష ఆంక్షలు

సాక్షి, హైదరాబాద్: విద్యార్థుల అమెరికా కలను డాలర్ దెబ్బకొడుతోంది. అక్కడి పరిస్థితులతో ఫీజులు పెరగడం ఓ వైపు.. డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడం వల్ల ఎక్కువ చెల్లించాల్సి రావడం మరోవైపు ఇబ్బందిగా మారుతోంది. ముందుగా అనుకున్న ఖర్చు కంటే ఎక్కువ అవుతుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మరిన్ని అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. కొన్ని ఏజెన్సీలు వివిధ మార్గాల్లో బ్యాంకు బ్యాలెన్స్ చూపించి విద్యార్థులను విదేశాలకు పంపుతుంటాయి. ఇప్పుడా ఏజెన్సీలు కూడా ఎక్కువ కమీషన్ తీసుకుంటున్నాయని.. విదేశీ విద్యకు నిధులిచ్చే విషయంలో బ్యాంకులు కూడా మరిన్ని షరతులు

మిగతా 5వ పేజీలో ▶

న్యూస్‌రీల్

భార్యకు తెలియకుండా మరో ఇద్దరికి పేపర్ లీక్



టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితురాలైన రేణుక భర్త డాక్యా ఆమెకు తెలియకుండా మరో ఇద్దరికి ఏఈ ప్రశ్నపత్రాలను విక్రయించినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైంది. తిరుపతయ్య అనే మధ్యవర్తి ద్వారా ప్రశాంత్ రెడ్డి, రాజేంద్రకుమార్ అనే మరో ఇద్దరు అభ్యర్థులకు ఏఈ ప్రశ్నపత్రాలు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకొని అడ్వాన్సులు సైతం తీసుకున్నాడు. - 5లో

రాఘవులే రైట్...



సీపీఎం పొలిట్‌బ్యూరో నుంచి తనను తప్పించాలని, క్షేత్రస్థాయిలో పని చేస్తానని బీవీ రాఘవులు ఇటీవల పార్టీకి లేఖ రాయడంతో వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధిష్టానం రాఘవులును బుజ్జగించింది. పార్టీ పొలిట్‌బ్యూరోలో కొనసాగాలని ఆయనను కోరింది. రాఘవులు కూడా మెత్తబడ్డారని సమాచారం. దీంతో రాఘవులు రాసిన లేఖపై రెండు మూడు రోజులుగా నెలకొన్న వివాదం సద్దుమణిగినట్లయింది. - 2లో

సాయం చేస్తా... సరదా తీర్చండి!

బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై రాసలీలల ఆరోపణలు

ప్రైవేటు డెయిరీ విస్తరణకు సాయం చేస్తానంటూ హామీ?

- సంస్థలో ఎమ్మెల్యే బంధువు పేరిట వాటా తీసుకున్నారన్న డెయిరీ ప్రతినిధి
- ఉద్యోగి అయిన అమ్మాయిని తన వద్దకు పంపాలంటూ ఒత్తిడి చేశారని ఆరోపణ
- బ్రోకర్ ద్వారా వేరే యువతితో ఆ సరదా తీర్చామని వెల్లడి
- దీనికి సంబంధించిన వాట్సాప్ స్క్రీన్ షాట్లు విడుదల
- అయినా అక్రమ కేసులు పెట్టించి వేధిస్తున్నాడంటూ ఆడియో
- కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు: దుర్గం చిన్నయ్య



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రైవేటు డెయిరీ విస్తరణకు సాయం చేస్తానంటూ యాజమాన్యాన్ని వేధించారని, ఉద్యోగి అయిన ఓ అమ్మాయిని పంపాలంటూ ఇబ్బందిపెట్టారని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై వచ్చిన ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఎమ్మెల్యే చెప్పినట్టుగా ఆయన బంధువుకు కొంత వాటా ఇచ్చామని.. ఆయన కోరినట్టు కాకున్నా బ్రోకర్ ద్వారా వేరే యువతిని పంపామని డెయిరీ భాగస్వామి పేరిట ఓ ఆడియో విడుదలైంది. డబ్బులతో పాటు అన్ని రకాలుగా తమను వాడుకుని కూడా.. తమపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని, ఆధారాలతో సహా ఈ విషయాన్ని

మిగతా 2వ పేజీలో ▶



100 సీట్లతో హ్యాట్రిక్ సాధిద్దాం

ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలి: మంత్రి కేటీఆర్ 2లో

- ప్రధాని మోదీ తెలంగాణ పుట్టుకనే అవమానించారు
- గ్రూప్–1 లీకేజీలో నాపై, నా పీఏపై చేసిన ఆరోపణలు నిరూపించాలి
- రాజన్న సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగం



కవిత కేసు విచారణ 3 వారాలు వాయిదా

- నళినీ చిదంబరం కేసుతో జత చేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం
- ఏప్రిల్ 24 తర్వాత విచారణ జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీకి ఆదేశం

వివరాలు 2లో



ఓటర్ల నమోదుకు కొత్త వెబ్‌సైట్

- 'ఓటర్స్' పేరుతో ప్రారంభించిన ఎన్నికల సంఘం
- ఎన్వీపీఎస్ వెబ్‌సైట్ ఇకపై పనిచేయదు
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ వెల్లడి

3లో

గవర్నర్‌ను మీరెందుకు గట్టిగా అడగరు?

- పెండింగ్ బిల్లులపై సుప్రీంకోర్టులో తెలంగాణ
- ఏప్రిల్ 10కి విచారణ వాయిదా

3లో

క్లుప్తంగా...

హోంమంత్రి హోదాలో అమిత్ షా అబద్ధాలు

ట్విట్టర్ వేదికగా ధ్వజమెత్తిన కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'హైదరాబాద్ స్టేట్ 1948, సెప్టెంబర్ 17న భారతదేశంలో చేరిన సందర్భాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా 'తెలంగాణ జాతీయ సమైక్యతాదినం'పేరిట ఉత్సవాలు నిర్వహిస్తోంది. కేంద్ర హోంమంత్రి హోదాలో అమిత్ షా పచ్చి అబద్ధాలు చెప్పడం సరికాదు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ధ్వజమెత్తారు. భారత్‌లో హైదరాబాద్ స్టేట్ చేరికకు సంబంధించి అమిత్ షా ఇటీవల కర్ణాటకలో చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ ఖండించారు. 'విమోచన దినంగా ఎందుకు పిలవకూడదంటూ ప్రశ్నిస్తున్నవారికి ఒకటే చెప్తున్నా. ఆగస్టు 15ను విమోచన దినం అనకుండా స్వాతంత్ర్యదినం అని ఎందుకు అంటున్నారు. నిజాం కావచ్చు. బ్రిటిషర్లు కావచ్చు. అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు, త్యాగాలను గౌరవప్రదంగా ఎలా గుర్తు చేసుకుంటున్నామన్నదే ముఖ్యం'అని పేర్కొన్నారు. 'గతానికి బందీ కాకుండా మీ భవిష్యత్తుకు నిర్మాతగా ఎదగండి'అనే సూక్తిని కేటీఆర్ ఈ సందర్భంగా ఉటంకించారు.

రైతు నేస్తమంటూ మొసలికన్నీరు

కేసీఆర్‌పై షర్మిల విమర్శలు



సాక్షి, హైదరాబాద్: వరి వేస్తే ఉరే.. కౌలు రైతు అసలు రైతే కాదన్న సీఎం కేసీఆర్ ఇప్పుడు రైతు నేస్తమంటూ మొసలికన్నీరు కారుస్తున్నారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. కేసీఆర్ మహారాష్ట్రలోని కాంధార్ లోహలో నిర్వహించిన సభపై సోమవారం ఆమె ట్విట్టర్ వేదికగా స్పందించారు. తెలంగాణలో రైతులు తుపాన్‌లో, నిరుద్యోగులు ఉప్పెనలో, ఉద్యోగులు సుడిగాలిలో, విద్యార్థులు వరదల్లో కొట్టుకుపోయినా ఆయనకు సోయి లేదన్నారు. కానీ పక్క రాష్ట్రంలో మాత్రం రైతుల తుపాన్ రాబోతుందని నమ్మబలుకుతున్నారని మండిపడ్డారు. 'నేను ఈ దేశ పౌరుడిని, ఎక్కడికైనా వెళ్తా'.. అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందిస్తూ నిన్న మొన్నటి వరకు ఆంధ్రోళ్లు అంతా తెలంగాణ ద్రోహులేనని ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకున్న కేసీఆర్, ఇప్పుడు ఏం సమాధానం చెప్తారని నిలదీశారు. తాను తెలంగాణ కోడలినైనప్పటికీ బీఆర్ఎస్ పార్టీ వాళ్లు అవహేళన చేసినప్పుడు ఏమైంది ఈ ఇంగితమన్నారు.

అన్ని ఆరోపణలపై అధ్యయనం!

బీజేపీ టాస్క్‌ఫోర్స్ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ హయాంలో జరిగిన ఉద్యోగ నియామకాలకు సంబంధించి వచ్చిన అన్ని ఆరోపణలపై లోతైన అధ్యయనం నిర్వహించాలని బీజేపీ టాస్క్‌ఫోర్స్ కమిటీ నిర్ణయించినట్టు పార్టీవర్గాల సమాచారం. సింగరేణి కొలువుల్లో అక్రమాల ఆరోపణలపై సమాచార సేకరణకు సిద్ధమౌతున్నట్టు తెలుస్తోంది. సోమవారం పార్టీ కార్యాలయంలో టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు సీహెచ్ విఠల్ అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశమైంది. త్వరలో రాష్ట్రంలోని అన్ని వర్సిటీల విద్యార్థులు, టీఎస్‌పీఎస్సీ పరీక్షల అభ్యర్థుల అభిప్రాయాలను సేకరించాలని నిర్ణయించింది. పేపర్ లీకేజీపై పూర్తి సమాచారం సేకరించి నివేదిక రూపొందించాలని నిర్ణయించింది. ఆయా అంశాలపై న్యాయ పోరాటం చేయాలని నిర్ణయించింది.

రేపు హైదరాబాద్‌లో టీడీపీ ప్రతినిధుల సభ

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత హైదరాబాద్‌లో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం, పార్టీ ప్రతినిధుల సభను ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈనెల 29న నిర్వహించనుంది. సభకు ఏపీ నుంచి పలువురు నేతలతో పాటు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు కూడా హాజరుకానున్నారు. తెలంగాణలో ఆ పార్టీకి ఒకరిద్దరు మాజీ ఎమ్మెల్యేలు తప్ప చెప్పుకోదగ్గ నాయకులు ఎవరూ లేరు. తెలంగాణలో నెరవేరని ప్రభుత్వ హామీలు, ఇంటింటికీ టీడీపీ, సభ్యత్వ నమోదు కార్యక్రమాల సమీక్ష వంటి అంశాలపై మంగళవారం జరగనున్న పొలిట్ బ్యూరోలో చర్చించనున్నట్లు టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తెలిపారు.

ఇదంజగత్



సార్ తలుచుకుంటే...
ఇట్టే ఈజీగా చేసేస్తారు!!

కృత్రిమ మేధ కబ్జాపర్వం!

అన్ని రంగాల్లోకి చొరబడుతూ ఉద్యోగాలకు ఎసరుపెడుతున్న ఏఐ సాంకేతికత

సమీప భవిష్యత్తులో సర్వాంతర్యామిగా అవతరిస్తుందని ఆందోళనలు

మనిషి మేధస్సును చేరేందుకు ఎక్కువ సమయం పట్టకపోవచ్చంటున్న నిపుణులు

ఏఐని నియంత్రించే పద్ధతులపై వివిధ కంపెనీలు, ప్రభుత్వాల కసరత్తు

దొడ్డ శ్రీనివాస రెడ్డి

కృత్రిమ మేధ (ఏఐ) క్రమంగా మన జీవితాల్ని కబ్జా చేస్తోంది. కంప్యూటర్ నిపుణుడు క్రిస్టఫర్ స్ట్రాచె 1951లో మాంచెస్టర్ యూనివర్సిటీలో కృత్రిమ మేధ ఆధారంగా రూపొందించిన కంప్యూటర్ ప్రోగ్రాంతో మొదలైన ఏఐ శకం నేడు అన్ని రంగాల్లోకి శరవేగంగా చొరబడుతోంది. వివిధ రంగాల్లో ఉద్యోగాలకు కోతపెడుతూ రోజురోజుకూ మరింతగా విస్తరిస్తోంది. 'కృత్రిమ మేధ మనిషి మేదస్సును చేరుకోవడానికి ఇంకా అనేక పరిశోధనలు, లక్ష్యాలను సాధించాల్సి ఉంది. ఈ లక్ష్యసాధనకు ఎంత సమయం పడుతుందన్నది ఇదమిత్థంగా చెప్పలేం'అని అంతర్జాతీయంగా ఖ్యాతి పొందిన ఏఐ నిపుణుడు స్టువర్ట్ రసెల్ నాలుగేళ్ల క్రితం అన్న మాటలివి. అయితే మనిషి మేదస్సును అందుకోవడంలో కృత్రిమ మేధకు ఇంకా ఎక్కువ సమయం పట్టకపోవచ్చని పిస్తోంది.



మనిషి రోజువారీ పనులన్నింటినీ అతి త్వరలో కృత్రిమ మేధ హస్తగతం చేసుకోబోతోందని ఏఐ నిపుణుడు కామ్ ఫులీ హెచ్చరిస్తున్నారు. ఆదాయం, చదువు విషయంలో సమాజంలో చివరన ఉన్న అత్యధిక జనాభాను ఏఐ తీవ్రంగా ప్రభావితం చేయబోతోందని ఆయన అంటున్నారు. 'ఒకప్పుడు కంపెనీలు ఆదాయం కోసం ఉద్యోగుల సంఖ్యను 5–10 శాతం తగ్గించుకొనేందుకు ప్రయత్నాలు చేసేవి, కానీ ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన ఏఐతో ఒక శాతం ఉద్యోగులతో మొత్తం పని ఎలా చేయించవచ్చో ఆలోచిస్తున్నా

మనిషి అవసరం లేదు..

యి'అని ఇన్ఫోసిస్ అధ్యక్షుడు మోహన్ జోషి ఇటీవల న్యూయార్క్ టైమ్స్ ఇంటర్వ్యూలో చెప్పారు. ఏఐ ఆధారిత చాట్ జీపీటీ సమాజంపై తీవ్ర ప్రభావం చూపబోతోందని దాని స్థాపిత సంస్థ ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ హెచ్చరిస్తున్నారు. మనిషి మాదిరి అనేక లక్ష్యాలను పూర్తిచేయగల ఏఐ చాట్‌బోట్ వల్ల మనుషులు నిర్వహించే అనేక ఉద్యోగాలకు ఎసరుపెట్టబోతోందని, అయితే మనిషికున్న సృజనాత్మకశక్తి కారణంగా కొత్త ఉద్యోగాల సృష్టి జరుగుతుందని ఆల్ట్‌మన్ అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగ సమాచారం అందించే రెస్యూమ్‌బిల్డర్.కామ్ సంస్థ నిర్వహించిన సర్వేలో అమెరికాకు చెందిన వెయ్యి కంపెనీల్లో సగానికిపైగా ఉద్యోగుల స్థానంలో ఇప్పటికే చాట్‌జీపీటీ లేదా ఇతర చాట్‌బోట్‌లను వినియోగిస్తున్నట్లు వెల్లడైంది. మరో సర్వేలో 44 శాతం కంపెనీలు కృత్రిమ మేధను తమ కంపెనీ వ్యవహారాల్లో ఉపయోగించుకొనేందుకు వీలుగా పెట్టుబడులు పెడుతున్నట్లు తెలిసింది. గతేడాది ఐబీఎం సంస్థ సంపాదించుకున్న మొత్తం 9,130 పేటెంట్లలో 2,300 కృత్రిమ మేధతో సంబంధం ఉన్నవే కావడం రానున్న కాలంలో ఏఐ విస్తృతిని చెప్పకనే చెబుతోంది.

చాట్‌జీపీటీ ప్రాథమిక స్థాయిలో కంప్యూటర్ ప్రోగ్రాం కోడ్ రాయగలుగుతుంది. అయితే కృత్రిమ మేధపై పెరుగుతున్న పరిశోధనలను పరిశీలిస్తే ఈ ఏడాదిలోనే సంక్లిష్టమైన కోడింగ్‌లను రాయగల సత్తా ఏఐ సమకూర్చుకోగలుగుతుందని అర్థమవుతోంది. మనిషి రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను పరీక్షించడానికి రెండేళ్ల క్రితమే ఏఐ ఆధారిత 'టురింగ్ బోట్స్'అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు టురింగ్ బోట్స్ స్వయంగా సాఫ్ట్‌వేర్‌లను రూపొందించే దిశగా అవతరిస్తున్నాయి. మార్కెట్ రీసెర్చ్ సంస్థ ఫోరెస్టర్ అంచనా ప్రకారం ఈ ఏడాది చివరికల్లా ప్రపంచవ్యాప్తంగా సాఫ్ట్‌వేర్లలో 10 శాతానికిపైగా టురింగ్ బోట్స్ కోడ్‌లను, టెస్ట్‌లను రాయగలుగుతాయి. సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఉద్యోగాలను ఇవి ఆక్రమించబోతున్నాయని, ఆ ఉద్యోగులు ఇక పర్యవేక్షణ, నిర్వహణ ఉద్యోగులుగా మారబోతున్నారనేది ఫోరెస్టర్ అభిప్రాయం. వచ్చే ఏడాదికల్లా చాలావరకు వ్యాపార సంస్థలు కోడింగ్‌కు సంబంధించి 30 శాతం వరకు కృత్రిమ మేధపై ఆధారపడబోతున్నాయని ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ (ఐడీసీ) ఒక నిర్ధారణకు వచ్చింది. ఈ ఏడాది ఫార్చ్యూన్-500 కంపెనీల ద్వారా వెళ్లే అన్ని రకాల సమాచారాల్లో 10 శాతానికిపైగా ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌లే సృష్టించబోతున్నాయని ఫోరెస్టర్ చెబుతోంది. అదే 2025 నాటికి అన్ని వ్యాపార సంస్థల నుండి

కోడ్ రాస్తుంది...

వెలువడే సమాచారంలో 30 శాతానికిపైగా కృత్రిమ మేధ ఆధారిత కంప్యూటర్లే సృష్టించబోతున్నాయని వ్యాపార పరిశోధనా సంస్థ గార్ట్‌నర్ అంచనా. అలాగే 2026 నాటికి వ్యాపార సంస్థల మధ్య లావాదేవీల్లో సగానికి పైగా ఏఐ ద్వారానే సాగబోతున్నాయని, 2030 నాటికి మొత్తంగా కృత్రిమ మేధ ఆధారంగా ఐదో వంతు వ్యాపార లావాదేవీలు సాగబోతున్నాయని కూడా గార్ట్‌నర్ అభిప్రాయం. 2026 నాటికి 75 శాతం బడా కంపెనీల ఉత్పత్తుల నాణ్యత, సామర్థ్యం, సప్లయ్ చెయిన్, అభివృద్ధి కార్యక్రమాలను కృత్రిమ మేధే నిర్వహించబోతోందని డేటా కార్పొరేషన్ ఐడీసీ చెబుతోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం 1.7 కోట్ల మంది కాంటాక్ట్ సెంటర్ ఏజెంట్లు పనిచేస్తుండగా 2026 నాటికి వాళ్ల మధ్య జరిగే లావాదేవీల్లో 10 శాతం ఏఐ ద్వారా ఆటోమేట్ కాబోతున్నాయని గార్ట్‌నర్ చెబుతోంది. దీనివల్ల మొత్తంగా 8,000 కోట్ల డాలర్లు ఆదా అవుతుందని కూడా ఈ సంస్థ వెల్లడించింది.



నియంత్రణ ఎలా?

ఇందుకలడందుగలడు అన్నట్లుగా అన్ని రంగాల్లోకి, అన్ని విభాగాల్లోకి చొచ్చుకుపోతున్న కృత్రిమ మేధ నియంత్రణ సాధ్యమా? దాన్ని కట్టడి చేయాలంటే అనుసరించాల్సిన పద్ధతులేమిటన్నది ఇప్పుడు కంపెనీ అధిపతుల నుంచి ప్రభుత్వాధినేతల వరకు వేధిస్తున్న ప్రశ్న. కృత్రిమ మేధ నిర్వహించే కార్యకలాపాలను, తప్పొప్పులను న్యాయపరంగా ఎలా ఎదురుకోవాలి, సైబర్ సెక్యూరిటీని ఎలా సాధించాలన్న చర్చ ముమ్మరంగా జరుగుతోంది. ఇప్పటికే ఏఐ ద్వారా ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసేందుకు ప్రతి కంపెనీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (సీఐఓ) లేదా చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీఓ)ను నియమించుకుంటోంది. రానున్న రోజుల్లో కృత్రిమ మేధ ద్వారా జరిగే కార్యకలాపాల నియంత్రణ అన్నది ప్రతి వ్యాపార సంస్థకు పెద్ద బాధ్యత కాబోతోందని ఫోరెస్టర్ చెబుతోంది. ఇటీవల జరిగిన డేటా రోబో సర్వేలో ఏఐపై ప్రభుత్వ నియంత్రణలకు 81 శాతం మంది టెక్ కంపెనీల అధిపతులు సానుకూలంగా స్పందించారు. కృత్రిమ మేధ విస్తరిస్తున్న వేళ ప్రజల సంరక్షణార్థం అమెరికా ఇటీవల ఏఐ బిల్ ఆఫ్ రైట్స్ పేరిట ఒక ముసాయిదా బిల్లును రూపొందించింది. సైబర్ సెక్యూరిటీ కోసం కంపెనీలు పాటిస్తున్న మార్గదర్శక సూత్రాలను ప్రభుత్వ నిబంధనలుగా మార్చడంపై చాలా వరకు వ్యాపార సంస్థలు సుముఖంగా ఉన్నాయి.

సాయం చేస్తా... సరదా తీర్చండి!

▶ మొదటి పేజీ తరువాయి

బయటపెడుతున్నామని పేర్కొన్నారు. దీనికి సంబంధించి కొన్ని వాట్సాప్ స్క్రీన్ షాట్లను కూడా విడుదల చేశారు.

అసైన్డ్ భూమి.. ఐదు శాతం వాటా!

ఆర్గిన్ డెయిరీ సంస్థ మంచిర్యాల జిల్లాలో తమ బ్రాంచ్ ఏర్పాటు కోసం కొంతకాలం నుంచి ప్రయత్నిస్తోంది. అది తెలిసిన ఎమ్మెల్యే తన నియోజకవర్గంలోనే ఆ డెయిరీ ఏర్పాటు చేయాలని, అవసరమైన సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆ కంపెనీ కోసం జాతీయ రహదారి పక్కనే ఉన్న రెండెకరాల అసైన్డ్ భూమిని అప్పగించారు. అది లావణి పట్టా భూమి అయినా విక్రయించినట్టుగా పేర్కొని బేరం కుదుర్చుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆ స్థలంలో డెయిరీ ప్లాంటు, పాల నిల్వ కోసం శీతల గిడ్డంగి, ప్యాకింగ్ కేంద్రం నిర్మించాలని ప్రణాళిక వేశారు. నిర్మాణం మొదలయ్యే ముందే ఆ ప్రజాప్రతినిధి తన సమీప బంధువు పేరుతో ఐదు శాతం వాటా సైతం తీసుకున్నారని.. తర్వాత డబ్బులు, ఇతర 'సాయం' కూడా తీసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. అయితే డబ్బుల విషయంలో గొడవ తలెత్తినట్టు తెలిసింది. గత జనవరిలో ఏకకాలంలో పదిచోట్ల ఈ డెయిరీ నిర్వాహకులపై మోసం కేసులు నమోదయ్యాయి. పోలీసులు పలుమార్లు కంపెనీ ప్రతినిధులను పిలిపించి విచారించినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే కంపెనీలో భాగస్వామి అయిన యువతి పేరిట ఆడియో, వీడియో, పలు వాట్సాప్ స్క్రీన్‌షాట్లు విడుదల అయ్యాయి.

'ట్యాబ్లెట్లు' అంటూ అమ్మాయి కోసం చాటింగ్!

డెయిరీ పనుల నిమిత్తం పలుమార్లు హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిశామని, ఆయన కోరిన పనులు చేసిపెట్టామని సంస్థలో భాగస్వామి అయిన యువతి ఆడియోలో ఆరోపించారు. ''ఎమ్మెల్యేను కలిసేందుకు వెళ్లినప్పుడు నా వెంట సంస్థలో పనిచేసే ఓ అమ్మాయి వచ్చేది. ఆమెపై ఎమ్మెల్యే కన్నేశారు. ఓ రోజు ఫోన్ చేసి.. ఆ అమ్మాయిని రాత్రికి తన వద్దకు పంపించాలన్నారు. ఆమె అలాంటిది కాదని చెప్పినా వినలేదు. అమ్మాయిని పంపకుంటే ఏం చేయాలో అది చేస్తానని బెదిరించారు. చివరికి ఎవరి ద్వారానో ఓ బ్రోకర్‌ను సంప్రదించి ఎమ్మెల్యే వద్దకు వేరే ఓ యువతిని పంపాల్సి వచ్చింది. నేరుగా హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌కే ఆ యువతిని పిలిపించుకున్నారు. తర్వాత దళిత బంధు పథకం కోసం మాట్లాడుదామని మమ్మల్ని ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు, మంచిర్యాలకు పిలిపించుకున్నారు. అన్నింటిలో ఇన్వాల్వ్ చేయవద్దని, చెప్పినవన్నీ చేయలేమని మేం అనడంతో.. మాపై తప్పులు కేసులు పెట్టించారు. మేం తప్పు చేయలేదని చెప్పినా పోలీసులు పీఎస్‌కు తీసుకెళ్లి ఇబ్బందిపెట్టారు. మా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి. ఈ విషయంలో మాకు అండగా నిలవాలి..'' అని పేర్కొన్నారు. తర్వాత మరో వీడియో విడుదలైంది. ''ఎమ్మెల్యే మనుషులు మాకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారు. ఎమ్మెల్యే నుంచి మాకు ప్రాణహాని ఉంది. మాకు ఏం జరిగినా పూర్తి బాధ్యత ఎమ్మెల్యే, పోలీసులదే..'' అని ఆ వీడియోలో పేర్కొన్నారు.

సీఎంవో నజర్?

మంచిర్యాల జిల్లాలో ప్రలోభాల వ్యవహారంపై ఈ నెల 26న 'సాక్షి'లో 'పాల కోసం ప్రలోభాలు' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రాష్ట్ర, జిల్లా స్థాయి నిఘా వర్గాలు పలు వివరాలు సేకరించినట్టు తెలిసింది. ఇందులో అధికార పార్టీ నేతలపై తీవ్ర స్థాయి ఆరోపణలు రావడంతో సీఎం ఆఫీసు కూడా దృష్టి పెట్టినట్టు సమాచారం.

- ఇక యువతిని పంపే అంశంలో ఎమ్మెల్యే, డెయిరీ నిర్వాహకుడి మధ్య జరిగినవిగా చెప్తున్న వాట్సాప్ చాటింగ్‌లలో.. 'ట్యాబ్లెట్లు కావాలి. రిలాక్సేషన్ పొందాలి. ఆ అమ్మాయి వస్తుందా?' అంటూ సాగిన సంభాషణలు, హైదరాబాద్‌లో చేసిన 'ఎంజాయ్'పైనా మెస్సేజ్‌లు ఉండటం గమనార్హం.

దళితబంధులో కోట్లు కొట్టేసేలా?

దళితబంధులో 200 పాడి యూనిట్లు ఇప్పిస్తే రూ.2 కోట్లు ఇస్తామని మంచిర్యాల జిల్లాలోని ఓ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తన నియోజకవర్గ ప్రజాప్రతినిధికి ఆఫర్ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. మరో నియోజకవర్గంలోని ఓ యువ నాయకుడితో కూడా యూనిట్లు ఇప్పించేలా చర్చలు జరిగినట్టు తెలిసింది. మరో ప్రజాప్రతినిధి గేదెలకు బదులు ట్రాక్టర్లు ఇవ్వాలని కోరగా.. ఆ మేరకు సంప్రదింపులు జరిగినట్టు తెలుస్తోంది. అయితే ప్రభుత్వం నుంచి రెండో విడత యూనిట్లు మంజూరు కాక ప్రణాళిక ముందుకు కదల్లేదని తెలిసింది. సదరు మార్కెట్ చైర్మన్ మాత్రం డబ్బులు తీసుకుని గేదెలు ఇవ్వలేదని, ఆయన ఇచ్చిన చెక్కులు బౌన్స్‌కావడంతో వివాదం మరింత ముదిరిందని తెలుస్తోంది. ఈ వ్యవహారంలోనే డెయిరీ వారిని కూడా ఇన్వాల్వ్ చేసేందుకు ప్రజాప్రతినిధి ప్రయత్నించినట్టు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌తోపాటు వరంగల్ ప్రాంతంలో ఈ డెయిరీ నిర్వాహకులపై పలు కేసులు ఉన్నాయని.. రైతులకు పశువుల బీమా కింద ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయిన వివాదాలు, ఇతర కేసులు నమోదయ్యాయని సమాచారం.

నాపై దుష్ప్రచారం చేస్తున్నారు



నాపై కావాలనే ప్రైవేటు డైయిరీ నిర్వాహకులు దుష్ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ జరిగిన మోసాలపై కేసులు నమోదు చేస్తే.. కోర్టు హాజరు నుంచి తప్పించుకునేందుకు ఇలా చేస్తున్నారు. నిర్వాహకులు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదు. డెయిరీ సంస్థ రైతులను మోసం చేసింది. ఈ విషయాన్ని అన్ని ఆధారాలతో సహా బయట పెడతాను.

– దుర్గం చిన్నయ్య, బెల్లంపల్లి ఎమ్మెల్యే

29న విద్యుత్ పీఆర్సీపై మళ్లీ చర్చలు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణ, ఇతర సమస్యలపై ఈ నెల 29న సాయంత్రం 4 గంటలకు మరో దఫా చర్చలకు రావాలని విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీలను విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ఆహ్వానించాయి. ఇప్పటికే రెండు దఫాలుగా జరిగిన చర్చల్లో పీఆర్సీ ఫిట్‌మెంట్ శాతం, ఈపీఎఫ్‌కి బదులు జీపీఎఫ్ అమలు, తదితర అంశాలపై చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో జేఏసీల మధ్య ఏకాభిప్రాయం సాధ్యం కాలేదు.

కవిత కేసు విచారణ మూడు వారాలు వాయిదా

- నళినీ చిదంబరం కేసుతో జత చేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం
- ఏప్రిల్ 24 తర్వాత విచారణ జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీకి ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంపై విచారణ కోసం ఢిల్లీలోని తమ కార్యాలయానికి రావాలన్న ఈడీ సమన్లను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారణకు స్వీకరించింది. సీఆర్పీసీ సెక్షన్ 160 కింద మహిళలను ఇంటి వద్దే విచారించేలా ఈడీని ఆదేశించాలన్న ఆమె అభ్యర్థనపై జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ బేలా ఎం. త్రివేదీలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇదే తరహాలో పెండింగ్‌లో ఉన్న కేంద్ర మాజీ మంత్రి చిదంబరం సతీమణి నళినీ చిదంబరం పిటిషన్‌తో దీనిని జత చేసింది. కేసు తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేసింది. ఏప్రిల్ 24తో ప్రారంభమయ్యే వారంలో విచారణ జాబితాలో కేసును చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

ఆ సెక్షన్ ఈడీకి వర్తించదు: అదనపు సొలిసిటర్ జనరల్

కవిత తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ పిటిషనర్‌ను సీఆర్పీసీ సెక్షన్ 160 కింద ఇంటి వద్ద విచారించాలా లేక ఈడీ కార్యాలయంలోనా అనేది ప్రశ్న అని తెలిపారు. ఈ తరహా కేసులో మద్రాస్ హైకోర్టు అభిప్రాయం స్పష్టంగా ఉందిగా అని ధర్మాసనం పేర్కొనగా సుప్రీంకోర్టు తదుపరి తీర్పుల ప్రకారం మద్రాస్ హైకోర్టు తీర్పు మనుగడలోకి రావని ఈడీ తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదించారు. మనీలాండరింగ్ చట్టం సెక్షన్ 50 అంటే దర్యాప్తు కాదని కేవలం విచారణ మాత్రమేనని స్పష్టం చేశారు. సీఆర్పీసీ సెక్షన్ 160 ఈడీకి వర్తించదన్నారు. అయితే పీఎంఎల్ఏ కేసుల్లో సమన్ల ప్రక్రియ లేదని సిబల్ పేర్కొన్నారు. పీఎంఎల్ఏ సెక్షన్ 50 (2)లో స్పష్టంగా ఉందిగా అని జస్టిస్ రస్తోగి ప్రశ్నించగా.. అది కేవలం విచారణ కోసమేనని... ఆ దిశలోనే నోటీసులు అందాయని సిబల్ తెలిపారు. అయితే దీనిపై సంక్షిప్తంగా ఓ నోట్ ఇవ్వాలని సిబల్‌ను ధర్మాసనం ఆదేశించింది. పీఎంఎల్ఏ చాప్టర్ 8 (సమన్లు, సాక్ష్యాలకు సంబంధించి అధికారులకు ఉన్న అధికారం) పరిశీలించాలని కోరిన సిబల్... దీని తర్వాత సమన్ల గురించి మాట్లాడే చాప్టర్ లేదని.. పీఎంఎల్ఏ ప్రకారం సమన్ల ప్రక్రియ లేదని తెలిపారు. 'ఫిర్యాదులో పిటిషనర్‌ను నిందితురాలుగా పేర్కొన్నారు. దర్యాప్తు చేస్తున్నారు. నిందితురాలిగా అభివర్ణించారు. అయితే జారీ చేసిన సమన్లు కేవలం విచారణ కోసమే. ఏ విధమైన ప్రక్రియ లేనప్పుడు కోడ్ అమలు అవుతుందని పీఎంఎల్ఏ చెబుతోంది'అని కపిల్ సిబల్ పేర్కొన్నారు. దీంతో ఈ కేసును నళినీ చిదంబరం, అభిషేక్ బెనర్జీల కేసులతో జత చేస్తామని జస్టిస్ రస్తోగి పేర్కొన్నారు. అయితే అభిషేక్ బెనర్జీ కేసు దీనికి సంబంధించినది కాదని.. అందువల్ల దాంతో జత చేయొద్దని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనాన్ని కోరారు. అందుకు అంగీకరించిన ధర్మాసనం ఈ కేసును నళినీ చిదంబరం కేసుతో జత చేస్తామని. ఆ విధంగా చేసి వాదనలు వినడమే శ్రేయస్కరమని పేర్కొంది.



వంద సీట్లతో హ్యాట్రిక్ సాధిద్దాం

ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలి: మంత్రి కేటీఆర్

- ప్రధాని మోదీ తెలంగాణ పుట్టుకనే అవమానించారు
- గ్రూప్–1 లీకేజీలో నాపై, నా పీఏపై చేసిన ఆరోపణలు నిరూపించాలి
- నెలాఖరులోగా పంచాయతీలకు రూ.1,300 కోట్లు ఇస్తాం

సిరిసిల్ల: రాష్ట్రంలో అక్టోబర్, నవంబర్ లేదా డిసెంబర్‌లో ఎప్పుడైనా ఎన్నికలు జరగవచ్చని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వందసీట్లు సాధించి హ్యాట్రిక్ సాధిద్దామని కార్యకర్తలకు ఉద్బోధించారు. ఇప్పటి వరకు దక్షిణ భారతదేశంలో హ్యాట్రిక్ సాధించిన సీఎంలేరని, ఆ ఘనత కేసీఆర్‌కు దక్కేలా ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. సోమవారం రాజన్న సిరిసిల్లలో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ ప్రసంగించారు. తొమ్మిదేళ్లుగా రాష్ట్రాన్ని శత్రుదేశాన్ని చూసినట్లుగా కేంద్రం చూస్తున్నారన్నారు. గుజరాతోళ్ల చెప్పులు మోసే సన్నాసులు తెలంగాణలో పుట్టడం దౌర్భాగ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని ఉద్దేశించి ఘాటుగా విమర్శించారు.

గుజరాత్‌లో 13సార్లు పేపర్లు లీకయ్యాయి

గ్రూప్–1 పేపర్ లీక్ విషయంలో తనపై, తన పీఏపై ఆరోపణలు చేస్తున్నారని, గుజరాత్‌లో 13సార్లు పేపర్లు లీకైతే.. అక్కడ బీజేపీ ప్రభుత్వం ఏం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. తన పీఏ తిరుపతి సొంతూరు జగిత్యాల జిల్లా మల్యాల మండలం పోతారంలో ముగ్గురు పరీక్ష రాస్తే ఒక్కరు కూడా క్వాలిఫై కాలేదని, మల్యాల మండలంలో 477 మంది పరీక్షలు రాస్తే 35 మంది మాత్రమే క్వాలిఫై అయ్యారని, జగిత్యాల జిల్లాలో ఒక్కరికి మాత్రమే గ్రూప్–1లో వందకు పైగా మార్కులు వచ్చాయని కేటీఆర్ స్పష్టంచేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 4,205 మంది రాస్తే.. 255 మంది మాత్రమే క్వాలిఫై అయ్యారన్నారు. మరి తనపై ఆరోపణలు చేస్తున్న రేవంత్‌రెడ్డి, బండి సంజయ్‌లు ఇప్పుడు తలకాయ ఎక్కడ పెట్టుకుంటారని దుయ్యబట్టారు. వారిద్దరు ఏం చదువుకున్నారన్నారు.

నియత్ ఉంటే మనకే ఓటు వేయాలి

మన సంక్షేమ పథకాలను పొందుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు కూడా నియత్ ఉంటే మనకే ఓటేయాలని కేటీఆర్ చెప్పారు. ఉపాధి పథకం పనులకు సంబంధించి రూ.1,200 కోట్ల నిధులను కేంద్రం పెండింగ్‌లో పెట్టిందన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీలకు గత డిసెంబర్ వరకు పెండింగ్‌లో ఉన్న రూ.1,300 కోట్ల నిధులను ఈ నెలాఖరులోగా విడుదల చేస్తామని స్పష్టంచేశారు.

60 లక్షల గులాబీ దండుంది

రాష్ట్రంలో బీఆర్ఎస్ కార్యకర్తలు 60 లక్షల మంది ఉన్నారని, వారితో క్షేత్రస్థాయిలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని కేటీఆర్ చెప్పారు. ఏప్రిల్ 20లోగా మున్సిపాలిటీలు, గ్రామాల్లో నిర్వహించి కార్యకర్తలను ఎన్నికలకు సంసిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. గృహలక్ష్మి పథకాన్ని అమలు చేసి, నియోజకవర్గానికి 3 వేల ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అర్హతలున్న పార్టీ కార్యకర్తలకూ ఇల్లు మంజూరు చేయాలని, పెన్షన్లు ఇప్పించాలన్నారు. సమావేశంలో ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, చెన్నమనేని రమేశ్‌బాబు, సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీలు ఎల్.రమణ, బస్వరాజు సారయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో ఉద్యోగినుల పిల్లల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన క్రెచ్‌ను మంత్రి కేటీఆర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడున్న చిన్నారులతో కాసేపు సరదాగా గడిపారు. పిల్లల్ని ఎత్తుకుని ముద్దుచేశారు. తనూ ఓ పిల్లాడిలా మారిపోయారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల జిల్లా

రాఘవులే రైట్...

- అసమ్మతితో అలిగిన నేతకు సీపీఎం అధిష్టానం బుజ్జగింపు
- పొలిట్‌బ్యూరోలో కొనసాగనున్న సీనియర్ నేత

సాక్షి, హైదరాబాద్: సీపీఎం అధిష్టానం బీవీ రాఘవులును బుజ్జగించింది. పార్టీ పొలిట్‌బ్యూరోలో కొనసాగాలని ఆయన్ను కోరింది. దీంతో రాఘవులు రాసిన లేఖపై రెండు మూడు రోజులుగా నెలకొన్న వివాదం సద్దుమణిగినట్లయింది. పార్టీ పొలిట్‌బ్యూరో నుంచి తనను తప్పించాలని, క్షేత్రస్థాయిలో పనిచేస్తానని బీవీఆర్ ఇటీవల పార్టీకి లేఖ రాసిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ పార్టీ రాష్ట్ర కమిటీలో తలెత్తిన వివాదాల నేపథ్యంలో రాఘవులుపై ఒక వర్గం పొలిట్‌బ్యూరోకు ఫిర్యాదులు చేయడంతో పరిస్థితి వేడెక్కింది. ఈ వివాదంపై పార్టీ పొలిట్‌బ్యూరో ఒక విచారణ కమిటీని నియమించింది. ఆ కమిటీ నివేదిక కూడా పార్టీకి చేరింది. రెండ్రోజుల పాటు జరిగిన పొలిట్‌బ్యూరో సమావేశాల్లో రాఘవులు అంశం చర్చకు వచ్చింది. ఆయన్ను పార్టీ బుజ్జగించినట్లు తెలిసింది. దీంతో రాఘవులు కూడా మెత్తబడ్డారని అంటున్నారు.

బయటకొస్తే క్యాడర్‌లో నైరాశ్యం...

మతోన్మాదంపై వామపక్షాలు పెద్ద ఎత్తున పోరాటమే చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాలకు ఇన్‌చార్జిగా ఉన్న రాఘవులు పార్టీ కీలక బాధ్యతల నుంచి బయటకు వస్తే ఆ ప్రభావం క్యాడర్‌పై ప్రభావం చూపుతుంది. పార్టీ ఐక్యతకు నష్టం వాటిల్లుతుంది. ఈ తరుణంలో పార్టీలో లుకలుకలు కనిపించడం మంచిది కాదని పార్టీ పొలిట్‌బ్యూరో అభిప్రాయపడినట్లు తెలిసింది. 'ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీ సంస్థాగత అంశాలపై చర్చించాం. రాఘవులు



వివాదం ముగిసిపోయింది. రాఘవులు పొలిట్‌బ్యూరో సభ్యునిగా కొనసాగుతారు. ఏపీలో పార్టీ నిర్మాణాత్మక అంశాలపై సమస్యలున్నాయి. వాటి కోసం కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. వాటిని ఏపీలో అమలు చేస్తాం' అని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. రాఘవులు కూడా పార్టీ విజ్ఞప్తికి ఒప్పుకోక తప్పలేదు. ఏపీలో అంతర్గత వివాదాల వల్ల తాను తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నానని చెప్పినట్టు తెలిసింది. ఇక నుంచి అటువంటి పరిస్థితి రాకుండా చూసుకుంటామని పార్టీ అధిష్టానం ఆయనకు నచ్చజెప్పినట్లు సమాచారం.

ఒక వెలుగు వెలిగిన రాఘవులు...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాఘవులు కార్యదర్శిగా ఉండి అనేక పోరాటాలు చేశారు. విద్యుత్ ఉద్యమం ఆయన హయాంలోనే జరిగింది. పోరాట పటిమగల నేతగా ఉన్నత స్థాయి పదవి పొలిట్‌బ్యూరో వరకు వెళ్లారు. ఆయన సింప్లిసిటీ కూడా క్యాడర్‌ను ఉత్తేజపరిచేది. అయితే తర్వాత తర్వాత ఆయన హయాంలోనే పార్టీ వెనుకపట్టు పట్టిందన్న విమర్శలున్నాయి. 10 టీవీ అమ్మకం వంటి విషయాల్లోనూ విమర్శలను మూటగట్టుకోవాల్సి వచ్చింది. మొత్తంగా కొద్దిరోజులుగా నలుగుతున్న రాఘవులుపై అసమ్మతి వ్యవహారం ఎట్టకేలకు సద్దుమణగడంతో సీపీఎం శ్రేణులు ఊపిరిపీల్చుకున్నాయి.

ఓటర్ల నమోదుకు కొత్త వెబ్‌సైట్

- ‘ఓటర్స్’ పేరుతో ప్రారంభించిన ఎన్నికల సంఘం
- ఎన్వీపీఎస్ వెబ్‌సైట్ ఇకపై పనిచేయదు
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కొత్త ఓటర్ల నమోదు, వివరాల మార్పు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ప్రస్తుతం వినియోగిస్తున్న నేషనల్ ఓటర్ పోర్టల్ సర్వీస్(ఎన్వీపీఎస్) వెబ్‌సైట్‌కి బదులు ‘ఓటర్స్’పేరుతో కొత్త వెబ్‌సైట్ (https://www.voters.eci.gov.in)ను అందుబాటులోకి తెచ్చినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ ప్రకటించారు. కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ, జాబితా నుంచి పేరు తొలగింపు, చిరునామా మార్పు వంటి అవసరాలకు 6, 6ఏ, 7, 8 వంటి ఫారాలను వినియోగిస్తూ ఇకపై కొత్త వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పాత వెబ్‌సైట్ ఇక పనిచేయదని సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత విశిష్ట రిఫరెన్స్ నంబర్‌ను ఎస్ఎంఎస్, మెయిల్ ద్వారా దరఖాస్తుదారులకు పంపిస్తామన్నారు. ఈ నంబర్ ద్వారా దరఖాస్తు స్థితిగతులను తెలుసుకోవచ్చు అన్నారు. కొత్త పోర్టల్ ద్వారా ఓటర్ల జాబితాను పరిశీలించవచ్చని, ఓటరుగుర్తింపు కార్డుకోసం, ఓటరు కార్డులో మార్పులకోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు ఏ పోలింగ్ బూత్, శాసనసభ, పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వస్తాడు అన్న వివరాలు సైతం తెలుసుకోవచ్చు అని వెల్లడించారు. పోలింగ్ బూత్ స్థాయి అధికారులు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్వో)ల వివరాలను సైతం తెలుసుకోవచ్చని తెలిపారు.

లిక్కర్ స్కాంతో తెలంగాణకు తలవంపులు

- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- మంచిర్యాల జిల్లాకు చేరిన పాదయాత్ర



విలేకరులతో మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి

రెబ్బెన (ఆసిఫాబాద్): లిక్కర్ స్కాంతో ఎమ్మెల్సీ కవిత తెలంగాణ సమాజానికి తలవంపులు తెచ్చిందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సోమవారం కుమురంభీం జిల్లా రెబ్బెన మండలం మీదుగా మంచిర్యాల జిల్లాకు చేరింది. రెబ్బెనలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అవినీతిని ఊడ్చివేస్తానని చెప్పిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ లిక్కర్ కుంభకోణంలో కూరుకుపోయారని ఆరోపించారు. రాహుల్ గాంధీని శిక్షించడం భారత ప్రజాస్వామ్యాన్ని శిక్షించడమే అవుతుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా పేదలకు తొమ్మిది రకాల సరుకులు అందిస్తే వాటన్నింటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం మంగళం పాడి, కేవలం బియ్యం పంపిణీకే పరిమితమైందన్నారు. హౌసింగ్ కార్పొరేషన్‌ను ఎత్తివేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం, డబుల్‌బెడ్రూం ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వకుండా ప్రజలను మాటలతోనే మాయ చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇల్లు లేని వారు ఇంటిని నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చారు.

రాహుల్‌కు బీఆర్ఎస్ బాసట

కేంద్రం తీరుపై తీవ్రస్థాయిలో నిరసన

- నల్లచొక్కాలు ధరించి పార్లమెంటుకు ఎంపీలు
- విపక్ష సభ్యులతో కలిసి గాంధీ విగ్రహం వద్ద దీక్ష



పార్లమెంట్ బయట రాహుల్‌కు మద్దతుగా నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని ఎంపీ పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ తీసుకున్న నిర్ణయానికి నిరసనగా కాంగ్రెస్ చేపట్టిన ఆందోళనలో బీఆర్ఎస్ ఎంపీలు కీలకంగా వ్యవహరించారు. రాహుల్‌కు మద్దతుగా పార్లమెంట్ లోపలా, బయటా కాంగ్రెస్ నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో ముందు వరుసలో ఉన్న ఎంపీలు, కేంద్రం తీరును తప్పుపట్టారు. రాహుల్‌పై తీసుకున్న చర్యను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాహుల్‌పై అనర్హత వేటు, అదానీ వ్యవహారంలో ప్రభుత్వ తీరుకు నిరసనగా బీఆర్ఎస్ ఎంపీలు సోమవారం నల్ల చొక్కాలతో పార్లమెంటుకు వచ్చారు.

విపక్షాల భేటీకి కేకే

ఉభయ సభలు ప్రారంభం కావడానికి ముందే.. ప్రధాన ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే నిర్వహించిన విపక్షాల భేటీకి బీఆర్ఎస్ తరఫున పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్‌పై అనర్హత వేటుతో పాటు ఇతర అంశాలపై నిరసన కొనసాగించాలని నిర్ణయించగా, దీనికి బీఆర్ఎస్ సహా మిగతా విపక్ష పార్టీలన్నీ అంగీకరించాయి. ఈ మేరకు ఉభయ సభలు ఆరంభం కాగానే విపక్షాలన్నీ కలిసి ఆందోళనకు దిగాయి. ఈ నేపథ్యంలో ఉభయ సభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. అనంతరం గాంధీ విగ్రహం ముందు కాంగ్రెస్ నేతృత్వంలో చేపట్టిన నిరసనలో బీఆర్ఎస్ ఎంపీలు కేకే, నామా నాగేశ్వరారవు, జోగినపల్లి సంతోష్‌కుమార్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేశ్‌రెడ్డి, బడుగు లింగయ్యయాదవ్, దామోదరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గేతో పాటు మీడియాతో మాట్లాడిన కేకే.. రాహుల్ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడంపై మండిపడ్డారు. అనంతరం ‘సత్యమేవ జయతే’ అనే భారీ పోస్టర్‌ను ప్రదర్శిస్తూ పార్లమెంటు నుంచి విజయ్‌చౌక్ వరకు విపక్షాలు నిర్వహించిన మార్చ్‌లోనూ బీఆర్ఎస్ ఎంపీలు పాల్గొన్నారు.

ఇదో ఫాసిస్టు ప్రభుత్వం: ఎంపీలు కేకే, నామా

రాహుల్ అనర్హత అంశాన్ని బీజేపీ వర్సెస్ రాహుల్‌గా చూడొద్దని, ఇది దేశం వర్సెస్ న్యాయంగా చూడాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేకే అన్నారు. ప్రజల గొంతును అణిచివేసేలా బీజేపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. ‘ఇది ఫాసిస్టు ప్రభుత్వం. చట్ట స్ఫూర్తిని పూర్తిగా దెబ్బతీస్తోంది. రాహుల్ సహా అనేక అంశాల్లో ఇష్టారీతిగా వ్యవహరిస్తోంది..’ అని ధ్వజమెత్తారు. రాహుల్ ఓబీసీలను అవమాన పరిచారన్న వ్యాఖ్యలపై కేకే ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘మోదీ అనేది ఇంటిపేరు. దాన్ని కులం పేరుగా ఎలా చూస్తారు. నా పేరుతో పాటు పీవీ నరసింహారావు, చంద్రశేఖర్‌రావు, జీవీఎల్ నరసింహారావుల్లో.. రావు అనేది కామన్. అదేమైనా కులమా? అది కేవలం ఇంటి పేరు మాత్రమే..’ అని పేర్కొన్నారు. రాహుల్ విషయంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయం శోచనీయమని నామా అన్నారు.

గవర్నర్‌ను మీరెందుకు గట్టిగా అడగరు?

పెండింగ్ బిల్లులపై సుప్రీంకోర్టులో తెలంగాణ

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను నెలల తరబడి పెండింగ్‌లో పెట్టుకోరాదని గవర్నర్‌ను మీరెందుకు గట్టిగా అడగరని సుప్రీంకోర్టును తెలంగాణ ప్రభుత్వం కోరింది. గవర్నర్ బిల్లులపై అభిప్రాయం పెండింగ్‌లో పెట్టడం వల్ల రాజ్యాంగ ప్రతిష్టంభన ఏర్పడుతోందంటూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ సోమవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ జేబీ పార్దీవాలా ధర్మాసనం ముందుకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే వాదనలు వినిపిస్తూ మధ్యప్రదేశ్‌లో బిల్లుకు వారంలో ఆమోదం వస్తుందని, గుజరాత్‌లో నెల రోజులు దాటదని, కానీ తెలంగాణలో ఎందుకు ఆలస్యం అవుతోందో అర్థం కావడంలేదని పేర్కొన్నారు. దీనిపై సొలిసిటర్ జనరల్ జోక్యం చేసుకొని గవర్నర్ ఇలా చేయడానికి కారణాలేంటో తెలుసుకొని తగిన సూచనలు చేయాలని కోరారు. ఈ పిటిషన్‌ను ఏప్రిల్ 10న విచారిస్తామని కోర్టు పేర్కొంది.

కనీస వేతనాలపై మీ వైఖరి ఏమిటి?

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కనీస వేతనాలకు సంబంధించి జీవోలు ఇచ్చి.. గెజిట్ ప్రింట్ చేయకపోవడంపై వైఖరిని తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను జూన్ 19కి వాయిదా వేసింది. ఐదేళ్లకు ఒకసారి కనీస వేతనాలను సవరిస్తూ గెజిట్ విడుదల చేయాల్సి ఉండగా 2007 తర్వాత ఇప్పటివరకు మళ్లీ ఇవ్వలేదని పేర్కొంటూ తెలంగాణ రీజినల్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేసింది. ప్రభుత్వం వెంటనే గెజిట్‌ను విడుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది. ప్రతివాదులుగా సీఎస్, కార్మిక శాఖ కమిషనర్ తదితరులను పేర్కొంది. వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వ వైఖరిని తెలియజేస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

ఆగస్టు 23న ‘రాజకీయ రణరంగ మహాసభ’

సీపీఎస్‌ఈయూ కార్యవర్గ సమావేశంలో తీర్మానాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఏడాది ఆగస్టు 23న హైదరాబాద్‌లో ‘పాత పింఛను రాజకీయ రణరంగ మహాసభ’నిర్వహించాలని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (సీపీఎస్‌ఈయూ) నిర్ణయించింది. నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంవోపీఎస్) సెక్రటరీ జనరల్ గంగాపురం స్థితప్రజ్ఞ అధ్యక్షతన సోమవారం సీపీఎస్‌ఈయూ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్16న 33 జిల్లా కేంద్రాల్లో ‘పెన్షన్ కాన్‌స్టిట్యూషనల్ మార్చ్’పేరిట ర్యాలీలు నిర్వహించాలని, చలివేంద్రాలు ఏర్పాటు, జూన్ రెండో వారంలో డివిజన్ల వారీగా సదస్సులు, జూలై తొలి వారంలో బస్సుయాత్ర నిర్వహించి ఆగస్టు 23న హైదరాబాద్‌లో రాజకీయ రణరంగ మహాసభ నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని రాష్ట్రాల సీపీఎస్ ఉద్యోగులతో కలిసి అక్టోబర్1న ఢిల్లీలో ‘పెన్షన్ శంఖ్‌నాథ్’సభను నిర్వహించాలని కూడా సమావేశంలో తీర్మానించారు.



న్యాయస్థానాల కంటే ఒక ఉన్నత న్యాయస్థానం ఉంది. అది అంతరాత్మ. దానిముందు ఏ న్యాయస్థానమూ పనికిరాదు.

– మహాత్మా గాంధీ

సాక్షి

మంగళవారం, మార్చి, 28

మనవాళ్ళు బంగారం

ఇది మన అమ్మాయిలు రాసిన కొత్త చరిత్ర. ఒకటీ రెండు కాదు... ఏకంగా నాలుగు స్వర్ణాలు. అదీ అంతర్జాతీయ పోటీల్లో! ఇంటర్నేషనల్ బాక్సింగ్ అసోసియేషన్ (ఐబీఏ) నిర్వహించిన మహిళల వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో మన దేశ మహిళా బాక్సింగ్ జట్టు నాలుగు పసిడి పతకాలతో ప్రపంచమంతా తలతిప్పి చూసేలా చేసింది. ఢిల్లీలో జరిగిన ఈ పోటీల్లో శనివారం నీతూ ఘంఘాస్ (48 కిలోల విభాగం), స్వీటీ బూరా (81 కిలోలు) బంగారు పతకాలు సాధిస్తే, ఆదివారం మన తెలుగమ్మాయి నిఖత్ జరీన్ (50 కిలోలు), లవ్లీనా బొర్గొహైన్ (75 కిలోలు) పసిడి కాంతులు పూయించారు. మొత్తం నలుగురూ తమ బాక్సింగ్ పంచ్‌లతో బలమైన ప్రత్యర్థులను మట్టికరిపించి, దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. నిన్నటి మేరీ కోమ్ వారసులుగా బాక్సింగ్‌లో మరింత మంది యువతులు ముందుకొచ్చిన చరిత్రాత్మక సందర్భం పతకాల సాక్షిగా వెల్లడైంది.

హర్యానా ఆడపిల్ల నీతూ, తెలంగాణ యువతి నిఖత్, అస్సామ్ అమ్మాయి లవ్లీనా, హర్యానాకే చెందిన సీనియర్ క్రీడాకారిణి స్వీటీ... నలుగురూ దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. స్వర్ణపతకం సాధించి తల్లి మెడలో దాన్ని అలంకరించాలని ఓ అమ్మాయి, బహుమతిగా వచ్చే పారితోషికంతో కొత్త మెర్సిడెస్ కారు కొని తల్లితండ్రులను తమ సొంతవూరు నిజామాబాద్‌కు తీసుకెళ్ళాలని మరో యువతి, సరైన ఫామ్‌లో లేవంటూ కొట్టిపారేసిన విమర్శకుల నోళ్ళు మూయించాలని ఇంకో వనిత, ఇష్టదైవతారాధన, ఆశీస్సులతోనే విశ్వవేదికపై విజయం సాధ్యమని భావించే వేరొక హర్యానా యువతి – ఇలా ఈ నలుగురిలో ఒక్కొక్కరికీ ఒక్కో రకమైన ప్రేరణ. మొత్తం 13 దేశాల నుంచి వచ్చి, ప్రపంచపోరులో ఫైనల్స్‌కు చేరిన మహిళలు 24 మంది. వారిలో భారత మహిళా బాక్సింగ్ చతుష్టయం సత్తా చాటింది. భారత్‌తో పాటు ఒక్క చైనా నుంచే నలుగురు ఫైనల్స్‌కు చేరుకొని, స్వర్ణాల కోసం పోటీపడ్డారు. గత ప్రపంచ మహిళా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో 3 పతకాలు సాధించిన భారత్ ఈసారి 4 పతకాలు గెలిచి, మునుపటి రికార్డును మెరుగుపరచుకోవడం విశేషం.

గత ఏడాది 52 కిలోల విభాగంలో వరల్డ్ టైటిల్ సాధించిన 26 ఏళ్ళ నిఖత్ ఈసారి కొత్తగా 50 కిలోల విభాగం ఎంచుకొని, అందులో తన సత్తా చాటారు. గతంలో రెండుసార్లు ఏషియన్ ఛాంపియన్ అయిన వియత్నామ్‌కు చెందిన ప్రత్యర్థి నూయెన్ తీ తామ్‌పై ఫైనల్‌లో 5–0 తేడాతో విజయం సాధించారు. కీలకమైన ఆఖరి మూడు నిమిషాల ఆటలో, ప్రత్యర్థి చాలా దూకుడు మీద ఉన్నప్పుడు, శరీర దార్ఢ్యం, మానసిక బలం తోడుగా నిఖత్ ప్రతిష్ఠాత్మక ప్రపంచ పోటీల్లో వరుసగా రెండుసార్లు స్వర్ణాలు సాధించి, చరిత్రకెక్కారు. మేరీ లానే ఈశాన్య ప్రాంతం నుంచి వచ్చిన లవ్లీనా సైతం ఫైనల్‌లో రెండుసార్లు కామన్‌వెల్త్ గేమ్స్ పతక విజేత అయిన ఆస్ట్రేలియాకు చెందిన గెయిట్లిన్ పార్కర్‌పై హోరాహోరీ పోరాడి, 5–2 తేడాతో గెలుపు కైవసం చేసుకున్నారు. ఎప్పుడూ ఎదురుదాడి అనే ఏకైక వ్యూహంతో సాగే నీతూ ఆటలో పరిస్థితి, ప్రత్యర్థిని బట్టి వ్యూహాన్ని మార్చుకొనే కళను అలవరచుకున్నారు. బాక్సింగ్ మెలకువల్లో ఆరితేరిన నిఖత్ సైతం తాను పోటీపడ్డ ఒలింపిక్ వెయిట్ వర్గంలోని ప్రపంచ అగ్రశ్రేణి బాక్సర్లతో తలపడి, మెరుగైన ఆటతీరుతో దుమ్మురేపడం గమనార్హం.

రానున్న ఆసియా క్రీడోత్సవాలకు సిద్ధం కావడానికీ, తప్పులు సరిదిద్దుకోవడానికీ ఈ ప్రపంచ బాక్సింగ్ పోటీలు మన అమ్మాయిలకు మంచి అవకాశమయ్యాయి. మరో 16 నెలల్లో ప్యారిస్‌లో జరిగే ఒలింపిక్స్‌లో స్వర్ణమే ధ్యేయంగా ముందుకు సాగే ఊపు తెచ్చింది. నిజానికి, క్రీడల్లో మన దగ్గర ప్రతిభాపాటవాల కొరత లేదు. యువతరంలో బోలెడంత ఉత్సాహం, ఉత్తేజం ఉన్నాయి. అయితే, ఆ యువ క్రీడాప్రతిభను సరైన పద్ధతిలో తీర్చిదిద్ది, దోవలో పెట్టే వేదికలే ఎప్పుడూ కరవు. 2018లో క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ క్షేత్రస్థాయిలో క్రీడా సంస్కృతినీ, ప్రాథమిక వసతి సౌకర్యాలనూ పెంపొందించడానికి హిమాచల్‌ప్రదేశ్‌లో 'ఖేల్ మహాకుంభ్'ను ప్రారంభించారు. క్రమంగా అది బిహార్, ఉత్తరప్రదేశ్, లద్దాఖ్, కశ్మీర్‌లలోని గ్రామాలకు విస్తరించింది. దేశంలో కనీసం 200 మంది దాకా ఎంపీలు తమ తమ నియోజకవర్గాల్లో ఈ ఖేల్ మహాకుంభ్‌ను నిర్వహిస్తూ వచ్చారు. ఇవన్నీ దిగువ, మధ్యాదాయ కుటుంబాల యువతుల కలలకు కొత్త రెక్కలు తొడిగాయి. సాంప్రదాయిక పురుషాధిక్య రంగంలోనూ మహిళలు పైకి రావడానికి దోహదపడ్డాయి.

'బేటీ బచావో, బేటీ పఢావో' తర్వాత పాలకుల 'ఖేలో ఇండియా' పథకం నవతరం ఆశలకు కొత్త ఊపిరి. మెరుగైన శిక్షణకు క్రీడా సామగ్రి అందుబాటులో ఉండే ఖేలో ఇండియా కేంద్రాలు గ్రామీణ యువతరానికి, ముఖ్యంగా యువతులకు వరం. మీడియా దృష్టిపెట్టని అనేక భారతీయ ఆటలు ఈ పథకంతో జనం ముందుకు వస్తున్నాయి. గ్రామీణ స్థాయిలోనే అథ్లెట్లకు ప్రోత్సాహం అందుతోంది. మగవారివే అనుకొనే క్రీడల్లోనూ మన వనితల జైత్రయాత్రకు ఇలాంటి ప్రయత్నాలు ఓ ఉత్ప్రేరకం. లింగభేదాల గోడలను బద్దలుకొట్టి, అందరికీ అభిమాన బాక్సర్‌గా నిఖత్ అవతరించడం అవిస్మరణీయం. గమనిస్తే, మన దేశపు ఒలింపిక్ పతకాల పట్టికలోనూ మహిళలే మహారాణులు. ఇంటా బయటా ఎన్నో సవాళ్ళను అధిగమించి, ఆరుసార్లు ప్రపంచ టైటిళ్ళు సాధించిన బాక్సర్ మేరీ కోమ్ ఆదర్శంగా మరిన్ని జాతి రత్నాలు వెలుగులోకి వచ్చాయి. 2008 ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన విజేందర్ సింగ్ విజయ గాథ తర్వాత మన పురుషుల బాక్సింగ్ కొంత స్తబ్ధుగా మారినవేళ బాక్సింగ్‌ను భారత్‌కు పతకాల అడ్డాగా మార్చిన మహిళలూ మీకు జోహార్లు!

గొంతెత్తడం ప్రజల రాజకీయ కర్తవ్యం



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

అభిప్రాయ ప్రకటనకు వీలులేని స్వాతంత్య్రం నిరర్థకం. పౌరుల సమావేశ స్వేచ్ఛకు, చర్చలకు అవకాశం కల్పించని వ్యవస్థ దేనికి? అలా లేనప్పుడు దేశ సామాజిక వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి అంతకన్నా పెద్ద ప్రమాదం మరొకటి లేదు. బహిరంగ చర్చలు, నిర్ణయాలు ప్రజల రాజకీయ కర్తవ్యమని మరచిపోరాదని శతాబ్దం క్రితమే సుప్రసిద్ధ అమెరికన్ న్యాయమూర్తి జస్టిస్ లూయీ బ్రాండీస్ అన్నారు. పౌరులకు భారత రాజ్యాంగం హామీపడిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అక్షరసత్యంగా అమలు జరగకుండా పాలక పక్షాలు అడ్డుకుంటూనే వస్తున్నాయి. పౌర స్వేచ్ఛకు 'శ్రీరామరక్ష'గా నిలబడగలిగిన పాలకులే ప్రజల మన్నన పొందగలరు. పౌరుల సుఖ సంతోషాలే తమ సుఖసంతోషాలని విశ్వసించగలిగినవారే పౌరస్వేచ్ఛకు హామీ ఇవ్వగలరు.

"స్వాతంత్య్రం పొందిన దేశంలో రాజ్య పాలనా వ్యవస్థ అంతిమ లక్ష్యం– దేశ పౌరులు స్వేచ్ఛగా తమ శక్తియుక్తుల్ని వృద్ధి చేసుకునేటట్లు వారికి అండదండలుగా నిలవగల్గడం. ప్రభుత్వంలో నిరంకుశ ధోరణులు ప్రబలినప్పుడు బుద్ధిగల పాలకులు వాటిని అణచివేయాలి. అలాంటి పాలకులు మాత్రమే ప్రజల మన్ననలు పొందగల్గుతారు. అలాంటి పాలకులు మాత్రమే పౌర స్వేచ్ఛకు 'శ్రీరామరక్ష'గా నిలబడగలరు. అలాంటి వారు మాత్రమే పౌరుల సుఖ సంతోషాలే తమ సుఖసంతోషాలని విశ్వసించగలరు. పౌరులు స్వేచ్ఛగా ఆలోచించగల్గి, స్వేచ్ఛగా మాట్లాడగల్గడం అనే లక్షణం– రాజకీయ సత్యాల్ని స్వేచ్ఛగా అన్వేషించి కనుగొనడానికి అనివార్యమైన లక్షణమని గుర్తించాలి. స్వేచ్ఛగా అభిప్రాయ ప్రకటనకు, పౌరుల సమావేశ స్వేచ్ఛకు, చర్చలకు అవకాశం కల్పించని వ్యవస్థ నిరర్థకం. ఒక దేశ పౌరులు తమ సమస్యలపై స్పందించడానికి స్వేచ్ఛ లేని దేశ స్వాతంత్య్రం అనర్థం, ప్రమాదకరం. బహిరంగ చర్చలు, నిర్ణయాలు ప్రజల రాజకీయ కర్తవ్యమని మరచిపోరాదు."

– సుప్రసిద్ధ అమెరికన్ న్యాయమూర్తి జస్టిస్ లూయీ బ్రాండీస్

"వచ్చే సాధారణ ఎన్నికలను బలంగా ఎదుర్కోవాలంటే, 2024 పోరాటం ఎవరో ఇద్దరు రాజకీయ నాయకుల మధ్య జరిగే పోరుగా కాకుండా దేశంలో ప్రజాస్వామ్యానికీ, నియంతృత్వానికీ మధ్య జరగవలసిన సంకుల సమరంగా అన్ని ప్రతిపక్షాలూ భావించి ఉమ్మడిగా రంగంలోకి దిగేందుకు నడుం కట్టాలి."

– ప్రొఫెసర్ హర్బన్స్ ముఖియా, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం చరిత్రాధ్యాపకులు (27 మార్చ్ 2023)

జస్టిస్ బ్రాండీస్ శతాబ్దం క్రితం చేసిన చరిత్రాత్మక హెచ్చరిక పౌర సమాజాలకు అరమరికలు లేని బహిరంగ చర్చలు నిరంతర రాజకీయ కర్తవ్యంగా కొనసాగవలసిన అవసరాన్ని నొక్కి చెబుతోంది. దేశ రాజకీయ పాలనా వ్యవస్థను ఒక వైపు నుంచి స్వాతంత్ర్యానంతరం గాడి

రెండో మాట



తప్పిన కాంగ్రెస్ (ఐక్య సంఘటన పాలన మినహా) పాలకులు, మరొకవైపు నుంచి బీజేపీ నడిపిస్తూ వచ్చాయి. రాజ్యాంగ మౌలిక సూత్రాలను తమ ఇష్టానుసారం తారుమారు చేసి, భారత పౌరులకు రాజ్యాంగం హామీపడిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అక్షరసత్యంగా అమలు జరగకుండా ఇవి అడ్డుకుంటూనే వచ్చాయి. వ్యక్తిగత ఎజెండాలతో పాలనా పద్ధతుల్ని భ్రష్టు పట్టిస్తూనే వచ్చాయి.

ఇక నేటి బీజేపీ పాలకవర్గం ప్రేమించే ఇజ్రాయెల్‌లో ఒక సరికొత్త పరిణామం తలెత్తింది. ఆ దేశ ప్రధానమంత్రిని ఏ పరిస్థితుల్లోనూ పాలనకు తగడని పదవి నుంచి తొలగించడానికి వీలు లేకుండా ఇజ్రాయెల్ తాజాగా చట్టం చేసింది. దీన్ని 'ఇజ్రాయెలీ రాజ్యాంగ నిర్మాణ వ్యవస్థలోనే సరికొత్త విపత్కర పరిణామం'గా బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూట్‌లో మధ్యప్రాచ్య విధాన నిర్ణయ కేంద్రం డైరెక్టర్ నతన్ సాక్స్ అభివర్ణించాడు. ఇజ్రాయెల్ కొత్త శాసనం ప్రకారం ఆ దేశపు సుప్రీం కోర్టుకు ఇజ్రాయెల్ పాలకవర్గంపైగానీ, దేశ శాసనాలపైగానీ అవసరమైన అదుపాజ్ఞలను జారీ చేసే హక్కు ఉండదు. ఈ తాజా పరిణామం ప్రభావం భారత పాలనా వ్యవస్థకు విస్తరించకుండా ఉండాలని మాత్రమే మనం కోరుకోగలం.

విచ్చలవిడిగా దేశ ఏకైక కుబేర వర్గంగా బలిసినవారి గురించి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తన పాదయాత్రలో ప్రస్తావించి, విమర్శిస్తే పాలకులకు అంత 'గుర్రెందు'కు? ఏ మాటకామాటే చెప్పుకోవాలి. కాంగ్రెస్ హయాంలోనూ, వారు ఈ వర్గంతో అంటకాగుతూ వారి దోపిడీ యథేచ్ఛగా సాగడానికి అనుమతించిన వారేనని మరచిపోరాదు! దీనికి భిన్నంగా తన సుదీర్ఘ పాదయాత్రలో కళ్లారా చూసిన ప్రజల కడగండ్ల దృష్ట్యా రూపొందించిన 'నవరత్న' ప్రణాళికను ఆ ప్రజలకు జీవశక్తిగా మలిచారు ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. కోవిడ్ ఒడుదొడుకుల ఫలితంగా రాష్ట్రం తలపెట్టిన సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించడానికి ఇబ్బందులు ఎదురైనా జగన్ తట్టుకోగల్గడం ప్రశంసనీయ పరిణామంగా భావించాలి. అందుకే వేమన అన్నాడేమో:

"భూమిలోన పుణ్యపురుషులు లేకున్న
జగములేల నిల్చు పొగులు లేక (కుమిలిపోక)"

రాహుల్ ఇవాళ ఇన్ని కబుర్లు చెబుతున్నారుగానీ, జగన్‌కన్నా ముందు ఉన్నత స్థాయికి ఎందుకు దూసుకురాలేక పోయారు? 'అసూయ' అనలేంగానీ, తనపై బనాయించిన అక్రమ కేసుల్ని జగన్ ఎదుర్కొంటూ పదహారు మాసాలకు పైగా జైళ్లలో మగ్గుతున్న ఘడియలలో ఒక్కసారైనా రాహుల్ సానుభూతిని ప్రకటించగలిగాడా? ఇవాళ సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్లను సుప్రీంకోర్టు హెచ్చరికలను సహితం లెక్క చేయకుండా స్వార్థ రాజకీయాలకు బీజేపీ పాలకవర్గం వినియోగిస్తున్న తీరు అభ్యంతరకరమే కాదు, పరమ హాస్యాస్పదం! 'ఉపా' చట్టాన్ని తమ మనుగడకు బీజేపీ పాలకులు 'ఉపాహారం'గా మలుచుకోవడం దారుణ పరిణామం! ప్రస్తుత సుప్రీంకోర్టు చైతన్యంతో నిర్ణయాలు చేస్తూండటం ఒక్కటే జస్టిస్ బ్రాండీస్ సంప్రదాయానికి నేడూ, రేపూ 'శ్రీరామరక్ష'గా భావించాలి! ఇంతకూ మనం కనీసం కోరుకోదగిందల్లా – సుప్రీంకోర్టు అధికారాలను ఇజ్రాయెల్ పార్లమెంట్ తగ్గించినట్టుగా 2024 ఎన్నికలకు ముందే అలాంటి పరిణామం భారత్‌లో రాకూడదనే!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇదేనా వేధింపు?



స్వాతంత్య్ర కాలం నుంచీ అనునిత్యం ముస్లింలను వేధించే భారత్ లాంటి దేశంలో– ఇండియన్ ఆర్మీ, రైల్వేల తర్వాత అత్యధిక భూములు కలిగిన మూడో యజమానిగా వక్ఫ్ బోర్డు ఎందుకుంది?

– ఒమర్ ఘూజీ, రచయిత

కుదరదంటే కుదరదు



ఈ లింగ (జెండర్) చెత్తను ఆపేయాలి. అబ్బాయిలకు, అమ్మాయిలకు పుట్టుకతో ఉన్న లింగాన్ని మార్చలేం. ఇప్పుడు ఇదొక పెద్ద వ్యాపారం అయిపోయింది. ఇంతే నేను చెప్పాల్సింది!

– అనస్తాసియా మారియా లూపిస్, వైద్యురాలు (ఎండీ)

న్యాయం జరగాలి



శిఖర్ ధవన్ విడాకుల పోరాటం గురించిన చాలా అంతరంగికమైన సమాచారం నా దగ్గర ఉంది. కానీ ఇప్పటికైతే నేను చెప్పగలిగేదల్లా ధవన్ దీనిగురించి బహిరంగంగా మాట్లాడటం మంచి విషయం. ఆయన కెరియర్‌ను పూర్తిగా నాశనం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. కానీ నేను అనుకోవడం క్రికెట్ యాజమాన్యం ఈ గందరగోళాన్ని ఇప్పుడు అర్థం చేసుకుంటోంది.

– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ మేకర్

మనమే పరిష్కరించుకోవాలి



అమృత్‌పాల్ సింగ్ బ్రిటన్ సమస్య కాదు. అతడు కెనడా సమస్య, అమెరికా సమస్య కూడా కాదు. అతడు ఇండియా సమస్య. అతడి విజయం భారత ప్రభుత్వ వైఫల్యానికి కొలమానం. ఇతరులను నిందించడం మాని, ఆత్మపరిశీలన చేసుకోండి.

– కపిల్ కొమిరెడ్డి, రచయిత

ఉద్వేగ శుభ్రత



మనుషులు సాంఘిక జంతువులు. కోపం మనల్ని వేరు చేస్తుంది. మనల్ని దగ్గరికి తెచ్చేవి ప్రేమ, ఆత్మీయత. ఎలాగైతే మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి భౌతిక శుభ్రతను పాటిస్తామో, అలాగే విధ్వంసకర ఉద్వేగాలను ఎదుర్కోవడానికీ, మనశ్శాంతిని సాధించడానికీ 'ఉద్వేగ శుభ్రత'ను పాటించాలి.

– దలై లామా, బౌద్ధ గురువు

విద్యావంతుల పాలన



దేశాన్ని ఇప్పుడు అత్యున్నత విద్యావంతులు పాలిస్తున్నారు. ప్రధానమంత్రికి 'మొత్తం రాజనీతి శాస్త్రం'లో డిగ్రీ ఉంది. గాంధీజీకి లా డిగ్రీ లేదని కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ చెబుతున్నారు. హోంమంత్రి తన సొంత చరిత్ర రాస్తున్నారు. ఇక మిగిలిన అందరికీ ఏకస్వరంలో అరవడం ఒక్కటే తెలుసు.

– యశ్వంత్ సిన్హా, కేంద్ర మాజీ మంత్రి

ఇది పనికొస్తుంది



అకెడమిక్ పరిశోధన కోసం చాట్‌జీపీటీ వాడకండి. అది అసలు ఉనికిలో కూడా లేని పేపర్లకు తప్పుడు ఉటంకింపులను సృష్టిస్తుంది. దానికి బదులుగా అకెడమిక్స్ కోసం డిజైన్ చేసిన కృత్రిమ మేధ ఆధారిత సెర్చ్ ఇంజిన్ కన్సెన్సస్ వాడండి. దాన్నో ప్రశ్న అడగండి. అది (వాస్తవంగా) ప్రచురితమైన టాప్ 5–10 పేపర్ల సమ్మరీని ఇస్తుంది.

– ముస్తాక్ బిలాల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్


సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

ఆదర్శ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

నల్లమల అడవుల్లో చెంచులతో 7 రోజులు గడిపి, వారు 30–35 ఏళ్ల వయసులోనే తనువు చాలించడానికి గల కారణాలను శాసన మండలిలో ప్రస్తావించారు విఠపు బాల సుబ్రహ్మణ్యం. చెంచులకు సరైన పోషకాహారం అందడం లేదనీ, వారి జీవితాలు దుర్భరంగా ఉన్నాయనీ, ప్రభుత్వం ఆదుకోవాలనీ ఆయన శాసనమండలిలో కోరినపుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వెంటనే స్పందించారు. చెంచులకు 'ఫుడ్ బ్యాగ్ కిట్' అందించే కార్యక్రమం చేపట్టారు. ఈ కిట్ 'బాలసుబ్రహ్మణ్యం కిట్' అని వైఎస్ స్వయంగా ప్రశంసించడం విశేషం.

'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' ఎందరికో ప్రాణం పోస్తున్న తరుణంలో దాని కింద స్త్రీలకు విపరీతంగా గర్భసంచీ తీసివేసే ఆపరేషన్లు జరగడాన్ని గమనించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆరోగ్యశ్రీ నుండి 'హిస్టరెక్టమీ'ని ప్రభుత్వం తొలగించింది. ఆ రోజుల్లో 72,000 సర్క్యులేషన్ కలిగిన 'చదువు' పత్రికకు సంపాదకునిగా పనిచేస్తూ ఉపాధ్యాయుల కోసం, విద్యార్థుల కోసం 64 పుస్తకాలు రాశారు. ఈ పత్రిక సంపాదకునిగానే అందరికీ సుపరిచితులై గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేసి గెలుపొందిన చరిత్ర ఆయనది. 'ఆల్ ఇండియా సైన్స్ ఆర్గనైజేషన్'కు దక్షిణ భారతదేశపు అధ్యక్షునిగా ఉన్న ఐఏఎస్ ఆఫీసర్ ఎస్ఆర్ శంకరన్‌తో కలసి కార్యదర్శిగా విఠపు బాలసుబ్రహ్మణ్యం పనిచేశారు.



విఠపు బాల సుబ్రహ్మణ్యం

1950 జూన్ 30న నెల్లూరు జిల్లా, చేజెర్ల మండలం, మాముడూరు గ్రామంలో అత్యంత నిరుపేద కుటుంబంలో బాల సుబ్రహ్మణ్యం జన్మించారు. తెలుగు భాషపై మక్కువతో డిగ్రీ తెలుగులో చేశారు. '2ఏ విద్వాన్' (1971), ఎంఏ తెలుగు (1979) లను తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలో అభ్యసించారు. ప్రొద్దుటూరులో చదువుకుంటున్నప్పుడు వీరి క్లాస్‌మేట్ అయిన పద్మినిని ప్రేమ వివాహం చేసుకున్నారు. 1977లో 'ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్' (యూటీఎఫ్)లో చేరారు. ఉపాధ్యాయులకు బదిలీల్లో రాజకీయ జోక్యం విపరీతంగా ఉన్న కాలంలో బదిలీలకు కౌన్సిలింగ్ కావాలని పోరాటం చేశారు. ఇటువంటి పోరాటాలే ఉపాధ్యాయులకు వీరిని దగ్గర చేశాయి. 5 ఏళ్ల సర్వీసు వదులుకుని వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొని... 2007లో పట్టభద్రుల స్థానం 'ప్రకాశం– నెల్లూరు' నుండి పోటీ చేసి ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఆ తర్వాత 2011, 2017ల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించడం వీరి పనితనానికి నిదర్శనం.

నెల్లూరు జిల్లాలో దూబగుంటలో ప్రారంభమైన మద్యనిషేధ ఉద్యమంలో పాల్గొన్నారు. 1991–93 మధ్యకాలంలో 'జాతీయ సాక్షరతా మిషన్' పిలుపు మేరకు అక్షరాస్యతా ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న ఈ ఆదర్శప్రాయుడైన ఎమ్మెల్సీ తాను ఇక ఎమ్మెల్సీగా పోటీ చేయననీ, మిగిలిన కాలం సామాజిక ఉద్యమాలలో పాల్గొంటాననీ ఆయన అంటున్నారు. ఆయన ప్రజాజీవితం నిండు నూరేళ్లూ గడవాలనేది అందరి ఆకాంక్ష.

– బెజగం వెంకట శ్రీనివాసు; ఏపీ జీజేఎల్ఏ ఆర్గనైజింగ్ సెక్రెటరీ

(విఠపు బాలసుబ్రహ్మణ్యం మార్చి నెలాఖరున ఎమ్మెల్సీగా పదవీ విరమణ సందర్భంగా)

సహజంగా వికసించనిద్దాం!

అభిప్రాయం



శ్రీనివాస్ చింతగుంట

వ్యక్తి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే అత్యున్నతమైన ప్రక్రియ విద్య. కానీ ఈనాటి పరుగుల సమాజం విద్యకు సరికొత్త నిర్వచనాన్ని ఇచ్చింది. అదే... మార్కులు, ర్యాంకులు, వ్యాపారం! ఒక సగటు పదవతరగతి విద్యార్థి ఈ విద్యా సంవత్సరంలో ఎన్ని గంటలు విద్యేతర కార్యక్రమాలలో పాల్గొన్నాడో లెక్కిస్తే... అది కేవలం ఒక్క శాతం కంటే తక్కువే అని చెప్పొచ్చు. ఈ పరిస్థితి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో మరీ ఎక్కువ కనిపిస్తోంది. పిల్లలకు ఆటలు లేవు, పాటలు లేవు, తోటి వారితో సరిగా మాటలూ లేవు. బడిలో ఒత్తిడి, ఇంట్లో ఒత్తిడి, చివరకు తన ఒంట్లోనూ ఒత్తిడే. అంతిమంగా విద్యార్థి పరిస్థితి పరిణతి చెందకుండానే పండిపోయిన పండులా తయారవుతోంది. పండ్ల వ్యాపారి తన స్వార్థం కోసం పిందెలను సైతం రసాయనాలతో కృత్రిమంగా పండించినట్లు... పసిమొగ్గలాంటి విద్యార్థి బాల్యాన్ని మితిమీరిన ఒత్తిడితో మగ్గిపోయేలా చేస్తోంది సమాజం.

మానసిక వికాస సిద్ధాంత ప్రకారం వ్యక్తి వికాస దశలలో కౌమార దశ అత్యంత కీలకమైనది. సహజంగానే ఈ దశలో సంభవించే శారీరక, మానసిక మార్పుల మూలంగా ఎన్నో అలజడులు, ఒత్తిళ్లకు లోనవుతూ ఉంటారు పిల్లలు. తమ అభిరుచులు, వైఖరులతో సంబంధం లేకుండా ఇటు కుటుంబం, అటు పాఠశాల నుండి ఎదురయ్యే అదనపు ఒత్తిళ్లను నియంత్రించుకోలేక సతమతమవుతున్నారు. విద్యార్థి అంటే స్వతహాగా కొన్ని అభిరుచులూ, వైఖరులూ, ఆలోచనలూ... అన్నింటికీ మించి భావోద్వేగాలూ కలిగిన ఒక చైతన్య మూర్తి. తనకంటూ కొన్ని ప్రత్యేక సామర్థ్యాలు, అభిరుచులు ఉంటాయి. వాటికనుగుణంగా కొన్ని లక్ష్యాలు ఏర్పరచుకుని ఉంటాడు. కానీ కుటుంబం, పాఠశాల, సమాజం అనే చట్రంలో పడి తన చిట్టి గుండెలోని అభిరుచులనూ, తన బుల్లి మెదడులోని ఆలోచనలనూ అణచివేసుకుంటున్నాడు. ఈ వయసులో ఏర్పడే మానసిక రుగ్మతలతో సమీప భవిష్యత్తులో అనేక శారీరక రోగాలకు లోనవుతున్నాడు. దీనిని సైకాలజీలో 'సైకోసొమేటిక్ డిజార్డర్స్' అంటారు. అంటే మనిషి మానసిక సమస్యలు శారీరక అనారోగ్యానికి



దారితీయడం. ఉదాహరణకు అధిక ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక లక్షణాలు కలిగిన వ్యక్తి క్రమేపి... రక్తపోటు, షుగర్ వ్యాధి, గ్యాస్ ట్రబుల్, అజీర్తి వంటి రోగాలకు లోనవడం. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. విద్యార్థి దశలో కలిగే అనవసరమైన ఒత్తిడి మూలంగా భవిష్యత్తులో మనం ఆరోగ్యకరమైన యువతనూ, ఆనందకరమైన భారతావనినీ ఎలా ఆశించగలం?

ఎన్‌సీఆర్‌బీ (నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో) నివేదిక ప్రకారం 2016 నుండి ఇప్పటి వరకు దాదాపుగా 14,000 మంది విద్యార్థులు వారి పరీక్షల్లో ఫెయిల్ అయిన కారణంగా ఆత్మహత్యలకు పాల్పడి తనువు చాలించారు. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలకు ప్రధాన కారణం విద్యార్థి సామర్థ్యాలను సరిగా అర్థం చేసుకోలేకపోవడం, వారి అభిరుచులను, వైఖరులను, ఆలోచనలను పరిగణనలోనికి తీసుకోకపోవడమే. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్నీ, విద్యాశాఖనూ అభినందించక తప్పదు. గత విద్యా సంవత్సరం నుండి 'కెరీర్ గైడెన్స్' అనే చక్కటి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 9, 10 తరగతులు చదివే విద్యార్థులకు వారి వారి అభిరుచులు, వైఖరులకు అనుగుణంగా సమాజంలో ఉండే అనేక రకాల కెరీర్లూ, వాటిని చేపట్టడానికి అవసరమైన కోర్సులూ, ఆ కోర్సులు అందుబాటులో ఉండే విద్యాసంస్థలూ... ఇలా అన్ని వివరాలనూ ఒక పోర్టల్ ద్వారా (కెరీర్ పోర్టల్) అటు విద్యార్థులకు ఇటు ఉపాధ్యాయులకు ప్రభుత్వం తెలియపరుస్తోంది. ప్రభుత్వం ఇంతటి అద్భుతమైన, విద్యార్థి స్నేహపూర్వకమైన ఈ కార్యక్రమాన్ని పాఠశాల, విద్యా ప్రణాళికలలో ఒక కీలకమైన భాగంగా పొందుపరిచి అమలుపరిచినట్లయితే మరిన్ని సత్ఫలితాలు పొందవచ్చు.

తల్లిదండ్రులుగా, ఉపాధ్యాయులుగా ప్రభుత్వాధికారులుగా మనం ఈ పరీక్షా సమయంలో పిల్లలకు ధైర్యాన్నిద్దాం, ఒత్తిడి నియంత్రణ మార్గాలను నిర్దేశిద్దాం. అన్నింటికీ మించి స్వేచ్ఛనిద్దాం. తద్వారా ఆరోగ్యకరమైన భావి భారత పౌరులను స్వాగతిద్దాం.

వ్యాసకర్త ఉపాధ్యాయుడు | 94412 30753

కర్మఫలం

మహా భారతం అనుశాసనిక పర్వం ప్రథమాశ్వాసంలో ఒక కథ ఉంది. ఆ కథ పేరు గౌతమీ లుబ్ధక మృత్యు కాల సంవాదం. కథలో పాత్రలు గౌతమి అనే పేరు గల ఒక స్త్రీ, ఒక కిరాతుడు, ఒక సర్పము, మృత్యు దేవత, యముడు.

గౌతమి అన్న ఆమె కొడుకు పాము కాటుకు చనిపోయాడు. ఒక కిరాతుడు ఆ పామును కట్టి తెచ్చి దానిని గౌతమి ముందు పడవేసి, "దీనిని చంపుతాను, అనుజ్ఞ ఇమ్మ"ని అడిగాడు.

పాముని చంపటానికి ఆమె ఒప్పుకోలేదు. "విధివశాత్తు వచ్చిన కీడు ఇది. ఎవరినీ నిందించే పని లేదు. అదీ గాక, ఈ పాముని చంపితే నా కొడుకు బ్రతుకుతాడా? కాబట్టి పామును విడిచిపెట్టు" అన్నది.

"అలా కాదు, ఈ పామును ఎట్లయినా చంపుతాను" అని వాడు వాదనకు దిగాడు.

అప్పుడు పాము, "నేనేమి తప్పు చేశాను? మృత్యువు నాతో ఈ బాలుణ్ణి కరవమన్నది. అందువల్ల నేను కరిచాను" అన్నది.



జ్యోతిర్మయం

ఇంతలో మృత్యువు వచ్చి అన్నది, "ఇందులో నేను చేసిన తప్పు ఏమీ లేదు. యముడు ఈ బాలుని చంపమని ఆజ్ఞాపించినాడు. అందువల్ల చంపినాను" అని.

అప్పుడు దోషమంతా యముని మీద పడ్డది. దోష నివారణకు, ధర్మ సంశయ నివృత్తికి యముడు అక్కడకు వచ్చి అన్నాడు, "ఈ బాలుని మృతికి పాము గానీ, మృత్యువు గానీ, నేను గానీ కారణం గాము. ఇతడు ఎలాంటి కర్మ చేసి ఉన్నాడో, ఆ కర్మకు అనుగుణమైన ఫలం పొందాడు. పాము కరచి చావవలసిన కర్మ చేశాడు కాబట్టి, పాము కరచి చనిపోయాడు. కొడుకు అట్లా చనిపోతే, దుఃఖించవలసిన కర్మ గౌతమి చేసింది" అని.

విశ్వనాథ సత్యనారాయణ 'సాహిత్య సురభి' అనే తమ గ్రంథంలో ఈ కథ గురించి గొప్పగా వ్యాఖ్యానిస్తూ, ఈ కథ కర్మ సిద్ధాంతాన్ని బోధిస్తున్నదని చెప్పారు. మృత్యువు నిత్యం. అది జీవులు చేసికొన్న కర్మ మీద ఆధారపడి ఉంది. ఇంకొక హేతువు చేత ఈ ప్రపంచకంలో జరిగే కార్యాలకు సమాధానం చెప్పటం సాధ్యం కాదు. అందుచేత మనుష్యుడు శాంతచిత్తుడై ఉండాలనీ, శమ దమాది వైరాగ్య సంపత్తి కలిగి ఉండాలనీ అన్నారు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.సప్తమి రా.8.40 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** మృగశిర రా.7.11 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** తె.4.17 నుండి 6.02 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.25 నుండి 9.15 వరకు, తదుపరి రా.10.54 నుండి 11.41 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.48 నుండి 11.30 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.02, **సూర్యాస్తమయం:** 6.07.

ఆర్టిజన్లు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సీఎం కేసీఆర్‌కు బండి సంజయ్ లేఖ



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్లు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం సీఎంకు లేఖ రాశారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ దాదాపు 23 వేలమంది కొన్నినెలలుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం గర్హనీయమని పేర్కొన్నారు. ఆర్టిజన్లు, ఉద్యోగుల పట్ల విద్యుత్‌శాఖ యాజమాన్యం, రాష్ట్ర సర్కార్ కనీసం శ్రద్ధ చూపకపోవడం తగదన్నారు. జీపీఎఫ్, పీఆర్సీ వంటి సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 1999 నుంచి 2004 మధ్య కాలంలో నియమితులైనవారికి జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో విద్యుత్ ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆర్టిజన్లు, విద్యుత్ ఉద్యోగులు సమ్మెలోకి దిగితే మొత్తం రాష్ట్ర పాలనా యంత్రాంగమే కుప్పకూలుతుందని హెచ్చరించారు. దేశంలోనే మెరుగైన వైద్య సదుపాయం ఉద్యోగులకు అందిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకొనే ప్రభుత్వం నగదురహిత వైద్యవిధానానికి ఎందుకు వెనకాడుతోందని ప్రశ్నించారు.

భార్యకు తెలియకుండానే

మరో ఇద్దరికి పేపర్ లీక్

- ఏఈ ప్రశ్నపత్రం విక్రయాన్ని ఇద్దరికే పరిమితం చేయాలనుకున్న రేణుక
- కానీ మరో ఇద్దరు అభ్యర్థులతో బేరం కుదుర్చుకున్న భర్త డాక్యా
- భార్య పసిగట్టకూడదనే వారిని ఓ లాడ్జికి పిలిచి పేపర్ విక్రయించినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడి
- అభ్యర్థులకు సహకరించిన మధ్యవర్తిని అరెస్ట్ చేసిన పోలీసులు



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ల లీకేజీ కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితురాలైన రేణుక భర్త డాక్యా ఆమెకు తెలియకుండానే మరో ఇద్దరికి ఏఈ ప్రశ్నపత్రాలను విక్రయించినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైంది. వాస్తవానికి ప్రశ్నపత్రాలను మరో నిందితుడు ప్రవీణ్ నుంచి అందుకున్న రేణుక... తన బంధువు ద్వారా నీలేష్, గోపాల్‌లతోనే పేపర్ల విక్రయానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ విషయాన్ని ప్రవీణ్‌కు చెప్పి ప్రశ్నపత్రాలు తీసుకునేప్పుడే రూ.5 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చింది. అప్పటికే గ్రూప్–1 ప్రిలిమ్స్‌ను అడ్డదారిలో రాసిన 'ప్రవీణ్ అండ్ కో'మెయిన్స్‌ను అదే పంథాలో క్లియర్ చేయాలనే పథకంతో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే లీకేజీ వ్యవహారం ఎట్టి పరిస్థితుల్లోనూ బయటపడకూడదనే ఉద్దేశంతో ఎక్కువ మంది అభ్యర్థులకు పేపర్ లీక్ చేయొద్దని ప్రవీణ్ రేణుకకు చెప్పాడు. అందుకే రేణుక తన భర్తతో కలిసి నీలేష్, గోపాల్‌లను ఇంటికే తీసుకెళ్లి చదివించింది. అయితే ఈ పేపర్లను మరో ఇద్దరికి అమ్మి ఎక్కువ మొత్తం సొమ్ము చేసుకోవాలని డాక్యా భావించాడు. ఇందులో భాగంగానే భార్యకు చెప్పకుండా తిరుపతయ్య అనే మధ్యవర్తి ద్వారా ప్రశాంత్‌రెడ్డి, రాజేంద్రకుమార్ అనే మరో ఇద్దరు అభ్యర్థులకు ఏఈ ప్రశ్నపత్రాలు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకొని అడ్వాన్సులు సైతం తీసుకున్నాడు. ఈ విషయాన్ని భార్య పసిగట్టకూడదనే ఉద్దేశంతోనే వారిని ఈ నెల 4న (పరీక్ష ముందురోజు రాత్రి) హైదరాబాద్‌లో తాము బస చేసిన ఓ లాడ్జికి రప్పించి పేపర్లు అందించాడు.

ప్రవీణ్ ఇంటి నుంచి నగదు స్వాధీనం...

ప్రశ్నపత్రాల విక్రయం ద్వారా రూ. 14 లక్షల వరకు ఆర్జించిన రేణుక అందులో రూ. 10 లక్షలను ప్రవీణ్‌కు ఇచ్చింది. రెండు దఫాలుగా ఈ డబ్బు అందుకున్న ప్రవీణ్ అందులో కొంత మొత్తాన్ని తన బ్యాంకు ఖాతాలో వేసుకున్నాడు. అకౌంట్‌లో ఉన్న డబ్బును ప్రవీణ్ అరెస్టు సందర్భంలోనే అధికారులు గుర్తించారు. అదనపు కస్టడీలో భాగంగా అతన్ని విచారిస్తున్న సిట్ అధికారులు సోమవారం బడంగ్‌పేటలోని మల్లికార్జునకాలనీలో ఉన్న ఇంట్లో సోదాలు చేశారు. అక్కడ లభించిన రూ. 4 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం ప్రశాంత్‌రెడ్డి, రాజేంద్రకుమార్‌లను అరెస్టు చేసిన సిట్ పోలీసులు... సోమవారం తిరుపతయ్యను అరెస్టు చేశారు. ఈ ముగ్గురినీ కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకొని విచారించాలని నిర్ణయించారు. వారి నుంచి మరెవరికైనా పేపర్ అందిందా అనే కోణంలో ఆరా తీయనున్నారు.

గ్రూప్-1 టాపర్లకు సామర్థ్య పరీక్షలు..

గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో 100కుపైగా మార్కులు సాధించిన 121 మంది అభ్యర్థుల్లో ఇప్పటికే 53 మందిని ప్రశ్నించిన సిట్ అధికారులు... అభ్యర్థుల సమర్థతను పరీక్షించడానికి ఎఫీషియెన్సీ టెస్ట్ నిర్వహిస్తున్నారు. నిపుణులతో మరో ప్రశ్నపత్రం తయారు చేయించి వాటికి సమాధానాలు రాయించడం ద్వారా అభ్యర్థుల సమర్థతను పరీక్షిస్తున్నారు. మరోవైపు న్యూజిలాండ్ నుంచి వచ్చి గతేడాది గ్రూప్–1 ప్రిలిమ్స్ రాసి 100కుపైగా మార్కులు పొందిన మరో నిందితుడైన రాజశేఖర్ సమీప బంధువు ప్రశాంత్‌కు సిట్ అధికారులు వాట్సాప్ ద్వారా నోటీసులు జారీ చేశారు.

హ్యాకింగ్ ద్వారానే...

పేపర్ల లీకేజీ కేసులో అదనపు కస్టడీకి తీసుకున్న ప్రవీణ్, రాజశేఖర్, డాక్యా, రాజేశ్వర్‌లను రెండో రోజైన సోమవారం తొమ్మిది గంటలపాటు ప్రశ్నించారు. ముఖ్యంగా కమిషన్ సెక్రటరీ వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన పి.ప్రవీణ్, మాజీ నెట్‌వర్క్ అడ్మిన్ ఎ.రాజశేఖర్‌లను లోతుగా విచారించి పేపర్ల లీకేజీ అంశంలో మరో చిక్కుముడిని విప్పారు. కాన్ఫిడెన్షియల్ సెక్షన్‌లో కస్టోడియన్‌గా వ్యవహరిస్తున్న శంకరలక్ష్మి కంప్యూటర్ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను ప్రవీణ్ సిస్టం ద్వారా హ్యాక్ చేసిన రాజశేఖర్ అందులోంచి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ను చేజిక్కించుకున్నట్లు తేల్చారు.

వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారే: రాజగోపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: ప్రపంచమంతా మోదీ పాలన, భారతదేశం వైపు చూస్తోందని, వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారే అని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. అయ్యాకొడుకులు స్థాయికి మించి మాట్లాడితే.. పులి లాంటి మోదీ, బీజేపీతో పెట్టుకుంటే పిసికేస్తామని ఘాటుగా వ్యాఖ్యానించారు. సోమవారం నల్లగొండ పట్టణంలో గుండగోని మైసయ్య వర్ధంతి సభలో పాల్గొన్న రాజగోపాల్‌రెడ్డి ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. అధికారం అడ్డంపెట్టుకొని కేసీఆర్ కుటుంబం పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబ అవినీతిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, కేంద్ర నిఘా సంస్థలతో విచారణ జరిపించి కవితతోపాటు కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపడం ఖాయమని హెచ్చరించారు.

ఘనంగా శ్రీచైతన్య ఫియెస్టా

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ శిల్పకళావేదికలో శ్రీచైతన్య స్కూల్ ఇంటర్ స్కూల్ స్టేట్ లెవెల్ కాంపిటీషన్ ఫియెస్టా– ఎ బోకె ఆఫ్ ఇన్‌హరెంట్ టాలెంట్స్–2023 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్టు శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ పేర్కొన్నారు. శ్రీచైతన్య స్కూల్స్ ఫియెస్టా ప్రోగ్రామ్ ద్వారా నారథాన్–స్టోరీ నెరేషన్, అబాకస్, చిత్రకళ (డ్రాయింగ్) 3 విభాగాల్లో నిర్వహించినట్లు వెల్లడించారు. స్కూల్ స్థాయి నుంచి జోనల్ స్థాయి, జోనల్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన తెలంగాణలోని దాదాపు 500కు పైగా విద్యార్థులతో గ్రాండ్ ఫినాలే విజయవంతంగా నిర్వహించి బహుమతులను అందజేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత బీఎస్ రావు విద్యార్థులను అభినందించారు.

అపార్ట్‌మెంట్లలో ఏఈడీ వైద్య పరికరాలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: కార్డియాక్ అరెస్ట్ అయితే అత్యవసర సమయంలో వైద్య చికిత్స అందించే ఏఈడీ (ఆటోమేటిక్ ఎక్స్‌టర్నల్ డీఫైబ్రిల్లేటర్స్) వైద్య పరికరాలను పరిశ్రమలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో అందుబాటులో ఉంచడం తప్పనిసరి చేస్తూ కొత్త చట్టాన్ని తీసుకొస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్)పై అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హరీశ్‌రావు మాట్లాడుతూ రూ.15 కోట్లతో 1,262 ఏఈడీ పరికరాలను కొనుగోలు చేసి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీదవాఖానాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. ఎవరికైనా కార్డియాక్ అరెస్టు అయిన సందర్భంగా సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేని పక్షంలో ఏఈడీ పరికరంతో గుండెకు స్వల్పంగా షాక్‌లు ఇవ్వడానికి ఈ వైద్య పరికరాలు ఉపయోగపడతాయని వివరించారు.

బీదలు, రైతులు, సామాన్యుల పార్టీ..

బీఆర్‌ఎస్ అంటే బీదలు, రైతులు, సామాన్యుల పార్టీ అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. నారాయణఖేడ్‌లో జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 90 నుంచి 100 సీట్లు గెలుచుకుంటుందని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు.

రీజాయిన్.. రిజైన్!

▶ మొదటి పేజీ తరువాయి

లేఖపై డీఎస్ సంతకం పెడుతున్న వీడియోలను మీడియాకు విడుదల చేయడం గమనార్హం. డీఎస్ చిన్నకుమారుడు అర్వింద్ బీజేపీ ఎంపీకాగా.. పెద్ద కుమారుడు సంజయ్ తాజాగా కాంగ్రెస్‌లో చేరారు. ఈ ఇద్దరి మధ్య రాజకీయ విభేదాలు, పంతాలే.. డీఎస్ చేరిక, రాజీనామా ఎపిసోడ్‌కు కారణమనే చర్చ జరుగుతోంది.

డీఎస్ రాసిన లేఖలో ఏముందంటే..

''ఈ నెల 26న నా కుమారుడు సంజయ్ కాంగ్రెస్‌లో తిరిగి చేరిన సందర్భంగా ఆశీస్సులు అందజేయడానికి గాంధీభవన్‌కు వెళ్లాను. అప్పుడు నాకు కండువా కప్పి నేను కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు మీడియాలో ప్రచారం చేశారు. నేను ఎప్పటికీ కాంగ్రెస్ వాదినే. కానీ ప్రస్తుత నా వయసు, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉండదల్చుకున్నాను. పార్టీలో నా చేరికకూ, నా కుమారుడు సంజయ్ టికెట్‌కు ముడిపెట్టడం భావ్యం కాదు. కాంగ్రెస్ విధివిధానాలు, సంప్రదాయాలు, ప్రజామోదం మేరకే పార్టీ టికెట్ల కేటాయింపు జరుగుతుందన్న విషయం తెలియనిది కాదు. ఆరోగ్యరీత్యా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్న నన్ను వివాదాల్లోకి లాగవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. నేను మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరానని మీరు భావిస్తే.. ఈ లేఖను రాజీనామాగా భావించి ఆమోదించవలసిందిగా కోరుకుంటున్నాను'' అని డీఎస్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖ ప్రతిని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి కూడా పంపుతున్నట్టు తెలిపారు. ఈ లేఖపై డీఎస్ సంతకం చేస్తున్న వీడియోను మీడియాకు విడుదల చేశారు. ఈ లేఖపై సాక్షిగా డీఎస్ భార్య విజయలక్ష్మి చేసిన సంతకం ఉండటం గమనార్హం.

డీఎస్ భార్య పేరిట మరో లేఖ

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు డీఎస్ రాసిన లేఖతోపాటు ఆయన భార్య విజయలక్ష్మి పేరిట మరో లేఖను, ఆమె మాట్లాడిన వీడియో కూడా మీడియాకు విడుదలైంది. 'ఇదిగో డీఎస్ రాజీనామా.. ఇది ఎవరికి సంబంధించితే వారికి..' అంటూ విజయలక్ష్మి సంతకంతో ఈ లేఖను రాశారు. ''ఇది రాజకీయాలు చేసే సమయం కాదు. ఆయనను మీరు పార్టీలో చేర్చుకునే పద్ధతి కూడా ఇదికాదు. ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం వచ్చింది. దయచేసి మీ రాజకీయాలకు ఆయనను వాడుకోవద్దు. మీరు నిన్న చేసిన ఒత్తిడి వల్ల డీఎస్‌కు రాత్రి ఫిట్స్ కూడా వచ్చాయి. కాంగ్రెస్ వాళ్లకు చేతులు జోడించి దండం పెడుతున్నా. ఇంకోసారి ఇటువైపు రాకండి. ఈ వయసులో అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను కొంచెం ప్రశాంతంగా బతకనీయండి..'' అని ఆ లేఖలో విజయలక్ష్మి పేర్కొన్నారు.

సాయంత్రానికి హెల్త్ బులెటిన్

డీఎస్, ఆయన భార్య విజయలక్ష్మి పేరిట లేఖలు, వీడియోలతోపాటు సోమవారం సాయంత్రం డీఎస్‌కు వైద్యుల సలహాతో కూడిన లేఖ కూడా మీడియాకు అందింది. డీఎస్ పార్కిన్సన్స్ వ్యాధి, బీపీతో బాధపడుతున్నారని, ఆయన మెదడుకు సర్జరీ అయిందని.. ఇటీవలే గుండెపోటుకు కూడా గురయ్యారని పేర్కొంటూ కన్సల్టెంట్ న్యూరాలజిస్టు బి.చంద్రశేఖర్‌రెడ్డి పేరిట ఈ లేఖను విడుదల చేశారు. డీఎస్ ఒత్తిడికి దూరంగా ఉండాలని, జన సమూహాలు, ప్రయాణాలు, రాజకీయాలు, మీడియాకు దూరంగా ఉండటం అవసరమని ఆ లేఖలో పేర్కొనడం గమనార్హం.

కుమారుల రాజకీయ కలహాలతో..!

తాను కాంగ్రెస్‌లో చేరేందుకే గాంధీభవన్‌కు వచ్చానని, తాను చనిపోయాక మృతదేహంపై కాంగ్రెస్ జెండా కప్పాలని సోనియాగాంధీని కలిసినప్పుడు కోరానని ఆదివారం పేర్కొన్న డీఎస్ మరునాడే రాజీనామా చేయడంపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఆయన ఇద్దరు కుమారుల మధ్య రాజకీయ వైరమే దీనికి కారణమని రాజకీయ వర్గాలు చెప్తున్నాయి. డీఎస్ చిన్న కుమారుడు ధర్మపురి అర్వింద్ బీజేపీ తరఫున నిజామాబాద్ ఎంపీగా ఉన్నారు. ఆయన పెద్ద కుమారుడు సంజయ్ ఆదివారమే కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సంజయ్‌తోపాటు డీఎస్ కూడా గాంధీభవన్‌కు వెళ్లారు. అయితే సంజయ్ చేరిక సందర్భంగా డీఎస్ గాంధీభవన్‌కు వెళ్లాలా, వద్దా అన్న విషయంలో కుటుంబ సభ్యుల మధ్య తీవ్ర విభేదాలు నెలకొన్నట్టు డీఎస్ సన్నిహిత వర్గాల్లో చర్చ జరుగుతోంది. చాలా కాలం నుంచీ విడిగా ఉంటున్న డీఎస్ కుమారులు ఇద్దరు చెరో పార్టీలో ఉన్నారు. ఆ ఇద్దరూ ఎవరికి వారు తమకు అనుకూలంగా తండ్రిని ఉపయోగించుకునే ప్రయత్నాలు చేస్తుండటమే ఈ రాద్ధాంతానికి కారణమని డీఎస్ కుటుంబ సన్నిహితులు చెప్తున్నారు. వాస్తవానికి డీఎస్ కాంగ్రెస్‌లో చేరడం ఎప్పుడో ఖరారైందని.. ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరడానికి ముందు డీఎస్ ఢిల్లీ వెళ్లి సోనియాగాంధీని కలిసి వచ్చారని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. డీఎస్ కుటుంబ సభ్యుల మధ్య అభిప్రాయ భేదాలతో ఇంతకాలం ఆగినట్టు వివరిస్తున్నాయి. చివరికి పెద్ద కుమారుడు సంజయ్ రాజకీయ భవిష్యత్తు వైపు మొగ్గుచూపిన డీఎస్.. ఆదివారం గాంధీభవన్‌కు వచ్చి కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. కానీ మరుసటి రోజే రాజీనామా చేశారు. కాగా.. డీఎస్‌కు ప్రాణహాని ఉందని, ఆయనకు రక్షణ కల్పించాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ ప్రభుత్వాన్ని కోరారు.


అర్వింద్

అర్వింద్ బ్లాక్‌మెయిల్ కారణంగానే..: సంజయ్



డీఎస్ రాజీనామా విషయమై ఆయన పెద్ద కుమారుడు సంజయ్ సోమవారం మీడియాతో మాట్లాడారు. తన సోదరుడు అర్వింద్ దిగజారి వ్యవహరిస్తున్నాడని, బ్లాక్‌మెయిల్ చేసి తన తండ్రితో లేఖలు రాయిస్తున్నారని ఆరోపించారు. అర్వింద్ రౌడీలను, డబ్బును అడ్డుపెట్టుకుని దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, తన తండ్రి ప్రాణాలకు హాని ఉందని ఆరోపించారు. ''మా నాన్నకు ఫిట్స్ వస్తే ఇంట్లో ఎందుకు ఉంచారు? ఆయన ఆరోగ్యంపై ఆందోళనగా ఉంది. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశిస్తే నేను అర్వింద్‌పై పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. ఎవరి సత్తా ఏమిటో ఎన్నికల్లోనే తేలుతుంది..'' అని సంజయ్ వ్యాఖ్యానించారు.

'లహరి'తో అమ్మఒడి అనుభూతి

- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- అత్యాధునిక హంగులతో లహరి ఏసీ స్లీపర్ బస్సులు ప్రారంభం


లహరి బస్సులను ప్రారంభిస్తున్న పువ్వాడ, బాజిరెడ్డి గోవర్ధన్. చిత్రంలో సజ్జనార్

మన్సూరాబాద్: ప్రైవేటు బస్సులకు దీటుగా టీఎస్ ఆర్టీసీ అమ్మఒడి అనుభూతిని కలిగించేలా లహరి ఏసీ స్లీపర్ బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చిందని, వీటిని ప్రజలు ఆదరించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం అత్యాధునిక హంగులతో ప్రవేశపెట్టిన లహరి బస్సుల ప్రారంభోత్సవం ఎల్బీనగర్‌లోని విజయవాడ బస్‌స్టాప్ వద్ద సోమవారం నిర్వహించారు. మంత్రి అజయ్‌కుమార్, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, సంస్థ ఎండీ వీసీ సజ్జనార్, స్థానిక కార్పొరేటర్ నర్సింహారెడ్డి జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ టీఎస్ ఆర్టీసీ ఇటీవల 756 లగ్జరీ బస్సులను కొనుగోలు చేసిందని, త్వరలోనే 1,300 ఎలక్ట్రిక్ బస్సులను కూడా ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక మొట్టమొదటగా ఏసీ స్లీపర్ బస్సులను టీఎస్ ఆర్టీసీ ప్రవేశపెడుతోందని బాజిరెడ్డి అన్నారు. ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తున్నట్లు వివరించారు. కాగా, ఆర్టీసీని రోడ్డు ప్రమాద రహిత సంస్థగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని సంస్థ ఎండీ సజ్జనార్ తెలిపారు. ప్రమాదాలను ఎలా తప్పించాలన్న విషయంలో శిక్షణ ఇప్పించేందుకు చెన్నైకు చెందిన చోళమండలం రిస్క్ సర్వీసెస్ సంస్థ నిపుణులతో శిక్షణ ఇప్పించాలని నిర్ణయించినట్లు చెప్పారు.


అమెరికా కలకు డాలర్ బరువు

▶ మొదటి పేజీ తరువాయి

పెడుతున్నాయని విద్యార్థులు అంటున్నారు. ఆరు నెలల క్రితం నాటి డాలర్ విలువతో పోల్చి రుణాన్ని లెక్కిస్తున్నాయని, భవిష్యత్‌లో ట్యూషన్ ఫీజు పెరిగితే విద్యార్థులే భరించాలని కొర్రీ పెడుతున్నాయని చెబుతున్నారు.

'చదువుల'సీజన్ మొదలు

అమెరికా సహా వివిధ దేశాల్లోని యూనివర్సిటీల్లో ఆగస్టు, సెప్టెంబర్‌లో మొదటి దశ అడ్మిషన్లు జరుగుతాయి. దీనికోసం విద్యార్థులు జనవరి నుంచే సన్నద్ధమవుతారు. పాస్‌పోర్టు, వీసా కోసం ప్రయత్నించడం, విదేశీ భాషకు సంబంధించి పరీక్షలు రాయడం చేస్తుంటారు. కోవిడ్ కాలంలో విదేశాలకు వెళ్లేవారి సంఖ్య తగ్గినా.. గత ఏడాది నుంచి మళ్లీ పుంజుకుంది. 2017లో దేశవ్యాప్తంగా 4.5 లక్షల మంది విదేశాలకు వెళ్తే.. 2022లో 6.48 లక్షల మంది వెళ్లారు. తెలంగాణ నుంచి అన్నిదేశాలకు కలిపి ఏటా సుమారు 60 వేల మంది వెళ్తుండగా.. అందులో అమెరికాకు చేరుతున్నవారే 30 వేల మంది. చాలా మంది సాఫ్ట్‌వేర్ కెరీర్‌కు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారు. డిజిటల్ ఎకానమీలో అవకాశాలు పెరగడంతో నైపుణ్య విభాగాలైన బిజినెస్, టెక్నాలజీ, డేటా సైన్స్‌కు భవిష్యత్‌లోనూ మంచి డిమాండ్ ఉంటుందని భావిస్తున్నారు. ఈ అంచనాలతోనే ఎక్కువ మంది విదేశాల్లో డేటాసైన్స్ పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఇప్పటివరకు అందిన



నివేదికల ప్రకారం.. డేటా అనాలసిస్‌లో 23 శాతం, డేటా విజువలైజేషన్‌లో 10శాతం, ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్ 26 శాతం, మెషీన్ లెర్నింగ్ 41 శాతం భారత విద్యార్థులు విదేశాల్లో చదువుతున్నారు. నిజానికి దేశంలో 2020–21 మధ్య డేటా సైన్స్ ఉద్యోగాలు 47.10 శాతం మేర పెరిగాయని, ఎంఎస్ పూర్తి చేసిన వారికి ఎక్కువగా అవకాశాలు లభిస్తున్నాయని గణాంకాలు చెప్తున్నాయి.

పెరిగిన ఫీజులతో..

ప్రధానంగా అమెరికా విద్యకు ఖర్చు గణనీయంగా పెరిగింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడమే ఇందుకు కారణం. ఆరు నెలల క్రితం రూ.79 వద్ద ఉన్న ఉన్న డాలర్ విలువ ప్రస్తుతం రూ.82 దాటింది. దీంతో అమెరికాలో ఖర్చు 15 శాతం పెరిగిందని ఓ కన్సల్టెన్సీ సంస్థ అంచనా వేసింది. దానికితోడు ఆర్థిక మాంద్యం పరిస్థితి కారణంగా అమెరికాలో తాత్కాలిక ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారింది. దీంతో అమెరికాలో ఉన్న భారత విద్యార్థులకు పూర్తిగా తల్లిదండ్రులు పంపే డబ్బులే దిక్కు అవుతున్నాయి. ఇక బ్యాంకులు ముందుగా నిర్ణయించిన మేరకు ట్యూషన్ ఫీజు మాత్రమే చెల్లిస్తున్నాయి. డాలర్ మారకం భారం విద్యార్థులు/తల్లిదండ్రులపైనే పడుతోంది. అమెరికాలోని యూనివర్సిటీల్లో చదివే విద్యార్థులు ట్యూషన్ ఫీజుకు సరిపడా బ్యాంకు బ్యాలెన్స్ చూపించాల్సి ఉంటుంది. కొన్ని కన్సల్టెన్సీ సంస్థలు అవసరమైన బ్యాలెన్స్ బ్యాంకులో వేసి.. విద్యార్థి అమెరికా వెళ్లిన తర్వాత డ్రా చేసుకుంటాయి. ఇందుకోసం కమీషన్లు తీసుకుంటాయి. ఇప్పుడీ కన్సల్టెన్సీలు తీసుకునే మొత్తాన్ని రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు పెంచేశాయని విద్యార్థులు వాపోతున్నారు.

ఏటా విదేశాలకు వెళ్తున్న భారత విద్యార్థుల సంఖ్య

సంవత్సరం	విద్యార్థులు
2017	4,53,977
2018	5,17,978
2019	5,86,329
2020	2,59,644
2021	4,44,574
2022	6,48,678

మరింత అప్పు చేయాల్సి వస్తోంది

మా అక్క గత ఏడాది అమెరికా వెళ్లింది. సెయింట్ లూయిస్ వర్సిటీలో రూ.10.85 లక్షలు ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పతనంతో కట్టాల్సిన సొమ్ము రూ.12.02 లక్షలకు పెరిగింది. ఎనిమిది నెలల్లోనే రూ.1.20 లక్షల వరకు భారం పడింది. నేను కూడా అమెరికా వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నాను. రూ.25 లక్షల్లో ఎంఎస్ పూర్తి చేస్తానని అనుకున్నా.. మరో నాలుగైదు లక్షలపైనే ఖర్చయ్యేలా ఉంది. మరిన్ని అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

– ప్రదీప్‌కుమార్, వరంగల్ (అమెరికా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న విద్యార్థి)

ఏం చేయాలన్నది తేలడం లేదు

అమెరికాలోని ఫ్లోరిడా వర్సిటీలో చేరాలనుకున్నా. అన్నీ సిద్ధం చేసుకున్నాను. మా ఫ్రెండ్ అక్కడే ఉన్నాడు. నేను సిద్ధమైనప్పుడు ఫీజు ఏడాదికి రూ.19.17 లక్షలు అయితే డాలర్ రేటు మార్పుతో.. రూ.21.25 లక్షలకు చేరింది. యూనివర్సిటీ ఆఫ్ న్యూహెవెన్‌లో ఫీజు రూ.21.36 లక్షల నుంచి రూ.23.67 లక్షలకు చేరిందని మరో ఫ్రెండ్ చెప్పాడు. ఇప్పటికే అతికష్టం మీద రూ.25 లక్షలు అప్పు చేశాం. మరో ఆరేడు లక్షలు ఉంటే తప్ప అమెరికా వెళ్లి చదవడం కష్టం. ఏం చేయాలన్నది తేలడం లేదు.

– విశాల్ త్రివిక్రమ్, విద్యార్థి, హైదరాబాద్

క్లుప్తంగా..

కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే విరూపాక్షప్ప అరెస్ట్



తుమకూరు: కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్(కేఎస్‌డీఎల్)కు సంబంధించిన లంచం కేసులో బీజేపీ ఎమ్మెల్యే ఎం.విరూపాక్షప్పను లోకాయుక్త పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అంతకుముందు, ఆయన పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు తిరస్కరించింది. తుమకూరు నుంచి బెంగళూరు వస్తుండగా మార్గమధ్యంలోనే విరూపాక్షను అదుపులోకి తీసుకున్నట్లు లోకాయుక్త ఐజీ తెలిపారు. విరూపాక్ష కుమారుడు ప్రశాంత్ మార్చి 2న ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.40 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. విరూపాక్ష నివాసంపై జరిపిన దాడుల్లో మరో రూ.8.23 కోట్లు దొరికాయి. అనంతరం కోర్టు ప్రభుత్వ రంగ కేఎస్‌డీఎల్‌కు చైర్మన్‌గా కూడా ఉన్న విరూపాక్షకు బెయిలిచ్చింది. అయితే, ప్రధాన ముద్దాయిగా ఉన్న విరూపాక్షప్ప కేసు విచారణలో సహకరించడం లేదంటూ లోకాయుక్త పిటిషన్ వేయగా కోర్టు బెయిల్‌ను రద్దు చేసింది. అసెంబ్లీ ఎన్నికల వేళ చోటుచేసుకున్న ఈ పరిణామం బీజేపీకి ఇబ్బందికరంగా మారింది.

ఆడ చీతా సాషా మృతి



భోపాల్: మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కులో నమీబియా నుంచి తీసుకొచ్చిన చీతాల్లో ఒకటి సోమవారం మృతి చెందింది. ఐదున్నరేళ్ల వయసున్న సాషా అనే ఆడ చీతా మరణించినట్లు అధికారులు వెల్లడించారు. జనవరిలో అది అనారోగ్యం బారినపడింది. రాష్ట్ర వైద్య బృందానికి తోడు నమీబియా డాక్టర్లనూ రప్పించారు. అది డీహైడ్రేషన్‌తోపాటు మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. కోలుకున్నట్టే కన్పించినా సోమవారం హఠాత్తుగా మరణించింది.

చీతాల్లో కిడ్నీ వ్యాధులు మామూలే

సాషాతో సహా మొత్తం 8 చీతాలను గత సెప్టెంబర్‌లో నమీబియా నుంచి తెప్పించడం తెలిసిందే. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీటిని స్వయంగా కునో పార్కులోకి వదిలారు. అక్కడి వాతావరణానికి అవి బాగానే అలవాటుపడ్డాయి. అయితే చీతాల్లో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులు తలెత్తడం సాధారణమేనని నిపుణులు చెబుతున్నారు. నమీబియా నుంచి తీసుకొచ్చినప్పటి నుంచే సాషా బలహీనంగా ఉందని అటవీ శాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. అన్ని ప్రయత్నాలూ చేశామని, అయినా కాపాడలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

సంస్కరణం

చట్టంపై ఉక్కుపాదం.. ప్రభుత్వంపై నిరసన గళం
ఇజ్రాయెల్ న్యాయవ్యవస్థలో భారీ మార్పులు
ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా సుప్రీంకోర్టు!
ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ ప్రతిపాదనలు
వ్యతిరేకిస్తున్న ప్రజలు.. నిరసనలు, ఆందోళనలు ఉధృతం
పదవి కాపాడుకోవడానికే నెతన్యాహూ డ్రామాలంటున్న ప్రత్యర్థులు

నిరసనలు, ఆందోళనలు, సమ్మెలతో గత మూడు నెలలుగా ఇజ్రాయెల్ అట్టుడికిపోతోంది. దేశవ్యాప్తంగా వేలాది మంది జనం నిత్యం వీధుల్లోకి వస్తున్నారు. బెంజమిన్ నెతన్యాహూ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరుబాట పట్టారు. కార్మికులు సమ్మె ప్రారంభించారు. న్యాయ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడమే ఇందుకు కారణం. ఇవి గొప్ప సంస్కరణలని నెతన్యాహూ అనుకూల వర్గాలు ఊదరగొడుతున్నప్పటికీ ప్రజలు విశ్వసించడం లేదు. న్యాయ వ్యవస్థలో ప్రభుత్వం తలపెట్టిన మార్పులు దేశ ప్రజాస్వామ్య పునాదులను కదిలిస్తాయని, తాము హక్కులు కోల్పోతామని వారు ఆరోపిస్తున్నారు. మార్పులకు వ్యతిరేకంగా గళమెత్తిన ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోయావ్ గల్లాంట్‌ను ఆదివారం హఠాత్తుగా పదవి నుంచి తొలగించడం మరింత అగ్గి రాజేస్తోంది. నెతన్యాహూ సర్కారు నియంతృత్వ ధోరణిపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ న్యాయ వ్యవస్థలో ప్రభుత్వం తలపెట్టిన మార్పులు, వాటిపై ప్రజల భయాందోళన వెనుక ఉన్న కారణాలు ఏమిటో తెలుసుకుందాం..

- సాక్షి, నేషనల్ డెస్క్



న్యాయవ్యవస్థలో మార్పులను వ్యతిరేకిస్తూ జెరూసలేంలో ప్రజల ఆందోళన

ఏమిటీ సంస్కరణలు

- 1948లో ఆవిర్భవించిన ఇజ్రాయెల్‌లో లిఖిత రాజ్యాంగం లేదు.
- నోటిమాటగా కొన్ని రాజ్యాంగ ప్రాథమిక చట్టాలు అమలవుతూ వస్తున్నాయి. ఈ చట్టాల ప్రకారం ఇజ్రాయెల్‌లో సుప్రీంకోర్టే శక్తివంతం.
- ఇజ్రాయెల్ పార్లమెంట్ అయిన 'నేస్సెట్'పై నియంత్రణ అధికారం సుప్రీంకోర్టుకే ఉంది.
- నెతన్యాహూ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న కొత్త సంస్కరణల ప్రకారం మొత్తం న్యాయ వ్యవస్థపై పార్లమెంట్‌కే అధికారాలు ఉంటాయి. అంటే అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలదే అసలు పెత్తనం.
- న్యాయమూర్తులను ఎలా నియమించాలి? ఎలాంటి చట్టాలు తీసుకురావాలి? అనేది పార్లమెంటే నిర్ణయిస్తుంది. అంతేకాదు సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాలల్లో మార్పులు చేసే అధికారం పార్లమెంట్‌కు ఉంటుంది.
- ఇజ్రాయెల్ జ్యుడీషియరీలో ఇలాంటి భారీ మార్పులను ప్రతిపాదిస్తుండడం ఇదే మొదటిసారి.
- సుప్రీంకోర్టు అనేది ఇజ్రాయెల్ ప్రజలకు సంబంధం లేని గ్రూప్‌గా మారిపోయిందని నెతన్యాహూ మద్దతుదారులు వాదిస్తున్నారు. న్యాయస్థానం పరిధి మీరి వ్యవహరిస్తోందని, సంబంధం లేని వ్యవహారాల్లో తలదూరుస్తోందని విమర్శిస్తున్నారు.
- ప్రజలు ఓట్లు వేసి ఎన్నుకున్న ప్రభుత్వంలో న్యాయస్థానం జోక్యం ఏమిటని వారు మండిపడుతున్నారు.
- అమెరికా లాంటి దేశాల్లో జడ్జీల నియామక వ్యవస్థను రాజకీయ నాయకులే నియంత్రిస్తారని నెతన్యాహూ గుర్తుచేస్తున్నారు. తద్వారా తన చర్యలను సమర్థించుకుంటున్నారు.
- ఇజ్రాయెల్‌లో జడ్జీలను నియమించే తొమ్మిది మంది సభ్యుల కమిటీలో మెజార్టీ సభ్యులు ప్రభుత్వ ప్రతినిధులే ఉండేలా ఆయన ఒక బిల్లును తీసుకొచ్చారు.
- పార్లమెంట్ చేసిన కొన్ని చట్టాలు చెల్లవంటూ సుప్రీంకోర్టు గతంలో తీర్పులు వెలువరించింది. అలాంటి చట్టాలను మళ్లీ ఆమోదించే అధికారం పార్లమెంట్‌కు ఉండాలని(ఓవర్‌రైడ్ క్లాజ్) నెతన్యాహూ ప్రతిపాదిస్తున్నారు.
- పదవిలో ఉన్న ప్రధానమంత్రిని కుర్చీ నుంచి దించేయాలంటే మంత్రివర్గంలో మూడింట రెండొంతుల మంది మద్దతు తప్పనిసరిగా ఉండాలన్నది మరో కీలక ప్రతిపాదన.
- శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా లేకపోతేనే ప్రధానమంత్రిని తొలగించాలని, ఇతర కారణాలతో కాదని ఇంకో ప్రతిపాదన చేశారు.

నెతన్యాహూకు ప్రయోజనమేంటి?



- ✔ ప్రధానమంత్రి నెతన్యాహూపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. వాటిపై దర్యాప్తు కొనసాగుతోంది. ఆయనపై మోసం, లంచం తీసుకోవడం, విశ్వాస ఘాతుకానికి పాల్పడడం వంటి ఆరోపణలు ఉన్నాయి.
- ✔ తాను ఏ తప్పూ చేయలేదని నెతన్యాహూ చెబుతున్నప్పటికీ ఆయన పదవి నుంచి దిగిపోవాల్సిందేనని ప్రత్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.
- ✔ పదవిని కాపాడుకోవడానికే న్యాయ వ్యవస్థలో సంస్కరణల పేరుతో కొత్త డ్రామాకు తెరతీశారని ఆరోపిస్తున్నారు.
- ✔ అవినీతి ఆరోపణలపై విచారణను ఎదుర్కొంటున్న నెతన్యాహూ సుప్రీంకోర్టుతో ఓ ఒప్పందానికి వచ్చి ప్రధానమంత్రి పదవిలో కొనసాగుతున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఆయన ప్రభుత్వం తీసుకొనే విధానపరమైన నిర్ణయాల్లో భాగస్వామి కాకూడదు. కానీ, న్యాయ వ్యవస్థలో సంస్కరణలంటూ విధానపరమైన నిర్ణయంతో ఒప్పందాన్ని ఉల్లంఘించినందున ప్రధానిగా ఆయన్ను అనర్హుడిగా ప్రకటించాలంటూ ఇజ్రాయెల్ అటార్నీ జనరల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.




ప్రత్యర్థుల అభ్యంతరాలు

జడ్జీలను నియమించే అధికారం నెతన్యాహూ, ఆయన మిత్రుల చేతుల్లో ఉంటే ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు తప్పదని ప్రత్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుకూలంగా పనిచేసే జడ్జీలను నియమించుకొని, అవినీతికి సంబంధించిన కేసుల నుంచి బయటపడి, అధికారంలో సుదీర్ఘ కాలం కొనసాగాలన్నదే నెతన్యాహూ ఎత్తుగడ అని ఆరోపిస్తున్నారు. న్యాయ వ్యవస్థ సర్వ స్వతంత్రంగా పనిచేయాలని, అందులో ఇతరుల పాత్ర ఉండరాదని నెతన్యాహూ గతంలో గట్టిగా వాదించారు. ఇండిపెండెంట్ జ్యుడీషియరీకి మద్దతు పలికారు. ఇప్పుడు స్వప్రయోజనాల కోసం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ప్రత్యర్థులు ఆక్షేపిస్తున్నారు. స్వతంత్ర న్యాయ వ్యవస్థ అంటే హద్దుల్లేని, నియంత్రణ లేని న్యాయ వ్యవస్థ కాదని నెతన్యాహూ తాజాగా వ్యాఖ్యానించడం గమనార్హం.

ప్రజలకు నష్టమే!

ఇజ్రాయెల్ న్యాయ వ్యవస్థ బలహీనపడితే కేవలం ఇజ్రాయెల్ పౌరులకే కాదు, పాలస్తీనా ప్రజలకు సైతం నష్టమేనని నిపుణులు చెబుతున్నారు. ఇజ్రాయెల్ ఆక్రమించుకున్న వెస్ట్‌బ్యాంక్‌లో పెద్ద సంఖ్యలో పాలస్తీనా పౌరులు ఉన్నారు. వారికి రెసిడెన్సీ కార్డులు ఉన్నాయి. హక్కులకు విఘాతం కలిగినప్పుడు, ప్రభుత్వం నుంచి వేధింపులు పెరిగినప్పుడు, ప్రమాదంలో ఉన్నామని భావించినప్పుడు ప్రజలు ఇకపై కోర్టులను ఆశ్రయించలేరని, ఒకవేళ కోర్టుకెళ్లినా న్యాయం జరుగుతుందన్న భరోసా ఉండదని నిపుణులు అంటున్నారు. ప్రభుత్వం చెప్పినట్లే కోర్టులు ఆడాల్సి ఉంటుందని, అవి ప్రజలకు రక్షణ కల్పించలేవని అభిప్రాయపడుతున్నారు. కోర్టులపై రాజకీయ నాయకుల పెత్తనం మొదలైతే ఇజ్రాయెల్‌లోని మైనార్టీల హక్కులకు, జీవితాలకు రక్షణ ఉండదని అంచనా వేస్తున్నారు.



తదుపరి ఏం జరగొచ్చు?

జ్యుడీషియరీలో మార్పుల ప్రతిపాదనలను ప్రభుత్వం పూర్తిగా వెనక్కి తీసుకొనేదాకా పోరాటం ఆపే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ ప్రజలు తేల్చిచెబుతున్నారు. పోరాటం మరింత ఉధృతం చేస్తామని అంటున్నారు. ప్రజలు తమను ఎన్నుకున్నది చట్టాలు చేయడానికేనని ప్రభుత్వం చెబుతుండడం ఆసక్తికరంగా మారింది. న్యాయ వ్యవస్థలో సంస్కరణలకు ప్రజామోదం లభించిందని నెతన్యాహూ అనుచరులు పేర్కొంటున్నారు. అయితే జనాందోళనకు తలొగ్గి, సంస్కరణలను నెలపాటు వాయిదా వేస్తున్నట్టు నెతన్యాహూ తాజాగా ప్రకటించారు. మరోవైపు ఈ ఉదంతంతో రాజ్యాంగ సంక్షోభం తలెత్తే ప్రమాదం కనిపిస్తోందని ప్రజాస్వామ్యవాదులు ఆందోళన చెందుతున్నారు. అంతర్గత సంఘర్షణ నెలకొనే ప్రమాదమూ లేకపోలేదంటున్నారు.

సంస్కరణలు నెలపాటు వాయిదా

నిరసనలకు తలొగ్గిన ప్రధాని నెతన్యాహూ

జెరూసలేం: ప్రజాగ్రహానికి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తలొగ్గారు. న్యాయ వ్యవస్థలో సంస్కరణల ప్రణాళికను నెల పాటు వాయిదా వేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. దేశ ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ''ఇజ్రాయెల్‌ను చీల్చడానికి శత్రువులు ప్రయత్నిస్తున్నారు. వారికి అవకాశం ఇవ్వొద్దు. ఆందోళనలు విరమించండి. హింసకు దూరంగా ఉండండి'' అని ప్రజలకు సూచించారు. పార్లమెంట్ వేసవి సమావేశాలు ఏప్రిల్ 30న పునః ప్రారంభం కానున్నాయి. సంస్కరణలపై బిల్లును వాటిలో ప్రవేశపెట్టాలని నెతన్యాహూ నిర్ణయానికొచ్చినట్లు తెలుస్తోంది. అయితే సంస్కరణలను శాశ్వతంగా పక్కన పెట్టాలని నిరసనకారులు తేల్చిచెప్పారు. అప్పటిదాకా పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. సోమవారం వేలాదిగా పార్లమెంట్ ముట్టడికి ప్రయత్నించారు. సంస్కరణలపై పార్టీల మధ్య ఏకాభిప్రాయం సాధించాలన్నదే నెతన్యాహూ ఉద్దేశమని తెలుస్తోంది.

అమెరికా గురుద్వారాలో కాల్పులు.. ఇద్దరికి గాయాలు

న్యూయార్క్: అమెరికాలో శాక్రమెంటోలోని గురుద్వారాలో కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఇది విద్వేష నేరం కాదని భారత సంతతికి చెందిన సార్జంట్ అమర్ గాంధీ స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం గురుద్వారాలో మతపరమైన నగర్ కీర్తన్ జరుగుతుండగా ఆవరణలో ఇద్దరు వ్యక్తులు ఓ విషయమై ఘర్షణ పడ్డారు. వారిలో ఒకరి స్నేహితుడు ఘర్షణ పడుతున్న వ్యక్తిపై తుపాకీతో కాల్చాడు. ఈ కాల్పుల్లో గాయపడిన ఆ వ్యక్తి తిరిగి కాల్పులు జరపగా ప్రత్యర్థి గాయపడ్డాడు. క్షతగాత్రులిద్దరూ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారికి ఎలాంటి ప్రాణహాని లేదని సార్జంట్ గాంధీ తెలిపారు. ఇది విద్వేషపూరిత నేరం కాదని, బాధితులు ఒకరికొకరు పరిచయమున్న భారతీయులేనని ఆయన పేర్కొన్నారు. మరో ఘటనలో అర్కన్సాస్‌లోని లిటిల్ రాక్‌లో ఆదివారం రాత్రి జరిగిన వేర్వేరు కాల్పుల ఘటనల్లో ఇద్దరు మృతి చెందగా మరో ఐదుగురు గాయాలపాలయ్యారు.

కాల్పుల్లో ముగ్గురు చిన్నారుల మృతి

నాష్‌విల్లే: అమెరికాలోని నాష్‌విల్లేలోని ఓ ప్రెస్బిటేరియన్ పాఠశాలలో సోమవారం దుండగుడు జరిపిన కాల్పుల్లో ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులతో జరిగిన కాల్పుల్లో దుండగుడు హతమయ్యాడు.

కరోనా కొత్త కేసులు 1,805

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్ మళ్లీ విజృంభిస్తోంది. 24 గంటల వ్యవధిలో కొత్తగా 1,805 కరోనా కేసులు నమోదైనట్లు కేంద్రం సోమవారం తెలిపింది. అదే సమయంలో, యాక్టివ్ కేసులు 134 రోజుల తర్వాత 10 వేల మార్కు దాటాయంది. రోజువారీ పాజిటివిటీ రేట్ 3.19%, వీక్లీ పాజిటివిటీ రేట్ 1.39 శాతంగా ఉంది. యాక్టివ్ కేసులు 10,300కు పెరిగినట్లు వెల్లడించింది. చండీగఢ్, గుజరాత్, హిమాచల్, యూపీ, కేరళల్లో ఆరుగురు చనిపోయారు.

అట్టుడికిన పార్లమెంటు

'రాహుల్, అదానీ'పై విపక్షాల ఆందోళన ● ఉభయ సభలూ వాయిదా ● నల్ల దుస్తులతో సభ్యుల నిరసన



రాహుల్‌పై అనర్హత వేటును నిరసిస్తూ సోమవారం పార్లమెంట్ ప్రాంగణంలో ఆందోళనల్లో కాంగ్రెస్‌తో పాటు పాల్గొన్న బీఆర్ఎస్ తదితర విపక్షాల పార్టీల సభ్యులు

మోదీకి ఎందుకంత భయం?

''ప్రధాని మోదీ జీ! ప్రజల రిటైర్మెంట్ నిధులను అదానీ గ్రూప్‌లో ఎందుకు పెట్టుబడులుగా పెట్టాల్సి వచ్చిందన్న విపక్షాల ప్రశ్నలకు మీ నుంచి సమాధానం లేదు. అదానీ గ్రూప్ అవకతవకలపై విచారణ లేదు. మీకెందుకంత భయం?'' అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ''మోదీ–అదానీ బంధం బయటపడ్డాక కూడా ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్‌ఐసీ, ఎస్‌బీఐ, ఈపీఎఫ్‌ఓ పెట్టుబడులన్నింటినీ అదానీ సంస్థల్లో ఎందుకు పెట్టాల్సి వచ్చింది?'' అంటూ సోమవారం ఆయన ట్వీట్ చేశారు.

న్యూఢిల్లీ: రాహుల్‌గాంధీపై అనర్హత వేటు మొదలుకుని పలు అంశాలపై పార్లమెంటు సోమవారం అట్టుడికిపోయింది. విపక్ష సభ్యుల ఆందోళనలు, డిమాండ్లు, నినాదాలతో ఉభయ సభలూ దద్దరిల్లాయి. పెద్దగా ఎలాంటి కార్యకలాపాలూ చేపట్టకుండానే మరోసారి వాయిదాపడ్డాయి. ఇటు లోక్‌సభ, అటు రాజ్యసభ ఉదయం సమావేశమవుతూనే కాంగ్రెస్, విపక్ష సభ్యులు మూకుమ్మడిగా ఆందోళనకు దిగారు. ప్లకార్డులు చేబూని నినాదాలతో హోరెత్తించారు. అదానీ అవకతవకలపై జేపీసీ దర్యాప్తు కోరుతూ వెల్‌లోకి దూసుకెళ్లారు. లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యులు స్పీకర్ కుర్చీపైకి కాగితాలు విసిరారు! సభాధ్యక్షులు ఎంత ప్రయత్నించినా పరిస్థితి అదుపులోకి రాలేదు. దాంతో ఉభయ సభలూ మధ్యాహ్నం రెండింటి దాకా వాయిదా పడ్డాయి. తిరిగి సమావేశమైన తర్వాత కూడా పరిస్థితిలో పెద్దగా మార్పు రాకపోవడంతో మంగళవారానికి వాయిదా పడ్డాయి. రాహుల్‌పై వేటును నిరసిస్తూ కాంగ్రెస్‌తో పాటు విపక్ష సభ్యులంతా నల్ల దుస్తులు ధరించి సభలకు హాజరయ్యారు. అంతకుముందు ఈ అంశంపై వ్యూహరచనకు కాంగ్రెస్ సారథ్యంలో విపక్షాలన్నీ సమావేశమై చర్చించాయి.

ఆర్థిక బిల్లుకు రాజ్యసభ ఆమోదం

ఎలాంటి చర్చలూ చేపట్టకుండానే ఆర్థిక బిల్లు–2023ను, జమ్మూ కశ్మీర్ బడ్జెట్, పలు ఇతర బిల్లులను రాజ్యసభ సోమవారం మూజువాణి ఓటుతో ఆమోదించి లోక్‌సభకు తిప్పి పంపింది. సభలో విపక్ష సభ్యుల ఆందోళన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. వీటిపై చర్చకు 10 గంటల సమయాన్ని సభ్యులు వినియోగించుకోలేదంటూ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఆవేదన వెలిబుచ్చారు. గత వారం లోక్‌సభ కూడా ఈ బిల్లులను చర్చ లేకుండానే ఆమోదించడం తెలిసిందే.

కాంగ్రెస్‌కు తృణమూల్ బాసట

కొన్నాళ్లుగా కాంగ్రెస్‌తో ఉప్పూనిప్పుగా ఉంటున్న మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సోమవారం ఆ పార్టీకి సంఘీభావం ప్రకటించింది. లోక్‌సభ నుంచి రాహుల్‌ను అనర్హునిగా ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన వ్యూహరచన భేటీలోనూ, అదానీ ఉదంతంపై జరిగిన నిరసనల్లోనూ పాల్గొంది. తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, శివసేన (యూబీటీ)తో సహా మొత్తం 16 విపక్షాలు వీటిలో పాల్గొన్నాయి. తమ మద్దతు కేవలం రాహుల్ అంశానికే పరిమితమని అనంతరం తృణమూల్ స్పష్టత ఇచ్చింది. ''పార్లమెంటును, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు జరిపే ఆందోళనల్లో కాంగ్రెస్‌తో పాటు అన్ని పార్టీలతోనూ మేం కలిసి సాగుతాం. అదే సమయంలో పలు అంశాలపై కాంగ్రెస్‌తో తమ అభిప్రాయ భేదాల్లో ఏ మార్పూ లేదు'' అని పేర్కొంది. కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష కూటమికి తృణమూల్ కొంతకాలంగా దూరంగా ఉంటుండటం తెలిసిందే.

బంగ్లా ఖాళీ చేయండి

లోక్‌సభ సభ్యత్వం రద్దయిన నేపథ్యంలో అధికారిక బంగ్లాను ఖాళీ చేయాలంటూ రాహుల్‌గాంధీకి తాఖీదులందాయి. ఎంపీ హోదాలో 12, తుగ్లక్ లేన్‌లో ఆయనకు కేటాయించిన బంగ్లాను ఏప్రిల్ 22కల్లా ఖాళీ చేయాలని లోక్‌సభ హౌజింగ్ కమిటీ పేర్కొంది. అనర్హత వేటు పడ్డ ఎంపీలు నెలలోపు అధికారిక నివాసాన్ని ఖాళీ చేయాల్సి ఉంటుందని సీనియర్ అధికారి ఒకరు గుర్తు చేశారు. బంగ్లాలో మరింతకాలం ఉండాలనుకుంటే కమిటీకి రాహుల్ లేఖ రాయవచ్చన్నారు.

గుర్రాల రేసుకు గాడిదను...

రాహుల్‌పై కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి వ్యాఖ్యలు

బీజేపీ కుసంస్కారానికి నిదర్శనం: కాంగ్రెస్ | 'కంచర గాడిద' అసలు రంగు తెరపైకి: ఖేరా



న్యూఢిల్లీ: రాహుల్‌గాంధీ కేంద్రంగా బీజేపీ, కాంగ్రెస్ విమర్శలు, ప్రతి విమర్శల పర్వం శ్రుతి మించుతోంది. సావర్కర్‌పై రాహుల్ విమర్శలను తప్పుబడుతూ కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి సోమవారం ఆయనపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ''రాహుల్ స్వయంకృతాపరాధాలకు రామాయణ, మహాభారత వృత్తాంతాలతో ముడి పెడుతూ కాంగ్రెస్ విచిత్ర విన్యాసాలు చేస్తోంది. అసలు సావర్కర్ వంటి మహనీయుల త్యాగాల గురించి రాహుల్‌కు ఏం తెలుసు? కాంగ్రెస్ వాళ్లు ఓ గాడిదను గుర్రాల రేసులో నిలబెడుతున్నారు'' అన్నారు! కేంద్ర మంత్రులు, బీజేపీ నేతల దిగజారుడు వ్యక్తిత్వానికి ఈ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయంటూ కాంగ్రెస్ దుయ్యబట్టింది. ''బీజేపీ వాళ్లు ఓ గాడిదకు కంచర గాడిదలా రంగులేశారు. దాని అసలు రంగేమిటో ఇప్పుడు బయట పడుతోంది'' అంటూ ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ మీడియా విభాగం చీఫ్ పవన్ ఖేరా కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పురివి దిగజారుడు మాటలంటూ ఆ పార్టీ నేత జైరాం రమేశ్ కూడా విమర్శించారు.

ప్రియాంకది అహంకారం | రాముని వంశంతో మీకు పోలికా: ఠాకూర్

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీది అహంకారమంటూ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మండిపడ్డారు. అందుకే తమ కుటుంబాన్ని రాముని వంశంతో పోల్చుకున్నారంటూ మండిపడ్డారు. ''దేవుడా! దేశానికి చివరికి ఎలాంటి రోజును చూడాల్సిన గతి పట్టింది! దేశ ప్రజాస్వామ్యానికి తాము అతీతులమని నమ్మే ఓ కుటుంబం ఏకంగా రామునితోనే పోల్చుకుంటోంది. ఈ అన్నాచెల్లెళ్ల అహంకారాన్ని దేశమంతా చూస్తోంది'' అన్నారు. ''బ్రిటిష్ వారిపై సావర్కర్ పోరాటానికి స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంటుందంటూ ఇందిరాగాంధీ కొనియాడారు. మనవడేమో ఇలా అవమానించే ప్రయత్నం చేస్తున్నారు'' అని ఎద్దేవా చేశారు.

సావర్కర్‌ను అవమానించొద్దు

లేదంటే కూటమికి బీటలే ● రాహుల్‌కు ఉద్ధవ్ హెచ్చరిక



ముంబై: సావర్కర్‌పై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను మహారాష్ట్రలో కాంగ్రెస్ భాగస్వామ్య పార్టీ శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే తీవ్రంగా తప్పుబట్టారు. ''ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్‌తో విపక్షాలన్నీ చేతులు కలుపుతాం. కానీ సావర్కర్ మా దేవుడు. ఆయనపై ఎలాంటి వ్యాఖ్యలు చేసినా సహించేది లేదు. సావర్కర్‌పై వ్యాఖ్యలను రాహుల్ కట్టిపెట్టకపోతే కాంగ్రెస్‌తో మా బంధానికి బీటలు తప్పవు'' అని హెచ్చరించారు. రాహుల్ వ్యాఖ్యలకు నిరసనగా ఢిల్లీలో కాంగ్రెస్ విందు సమావేశానికి హాజరు కాబోనని ప్రకటించారు. ''నా పేరు సావర్కర్ కాదు, గాంధీ. క్షమాపణలు చెప్పను'' అని రాహుల్ శనివారం పేర్కొనడం తెలిసిందే. సావర్కర్‌పై చాలాకాలంగా ఆయన విమర్శలు చేస్తున్నారు. సావర్కర్‌పై విమర్శలు మానకపోతే అనర్హత వేటు నేపథ్యంలో ప్రజల్లో వచ్చిన సానుభూతినీ రాహుల్ పోగొట్టుకుంటారని పార్టీ పత్రిక సామ్నా సంపాదకీయంలో ఉద్ధవ్ హెచ్చరించారు.



సోమవారం కోల్‌కతాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగత సత్కారం సందర్భంగా గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ. రాజ్యాంగబద్ధ దేశాధినేతగా దేశం 'విపత్తు' బారిన పడకుండా కాపాడాలంటూ ఈ సందర్భంగా ముర్మును మమత కోరారు.

దుస్తులు విప్పించి సోదాలు!

బ్రిటన్లో నల్లజాతి పిల్లలపై పోలీసుల దాష్టీకం

లండన్: బ్రిటన్ పోలీసులు నల్లజాతి చిన్నారుల పట్ల జాతి వివక్షతో వ్యవహరిస్తున్నారని ఓ నివేదిక పేర్కొంది. తరచూ వారినే ఎక్కువగా దుస్తులు విప్పించి సోదాలు చేస్తున్నట్లు వెల్లడించింది. ''2018–2022 మధ్య ఇలా 3 వేల మంది పిల్లలను సోదాలు చేశారు. వీరిలో మూడొంతులు నల్లజాతి పిల్లలే. అంతా చూస్తుండగానే ఎనిమిదేళ్ల పిల్లలను కూడా బట్టలిప్పి తనిఖీలు చేయడం ఘోరం. అమ్మాయిలను తనిఖీ చేసేటప్పుడు పురుష అధికారులు, అబ్బాయిలకైతే మహిళా అధికారులు ఉండటం మరీ శోచనీయం'' అని చిల్డ్రన్స్ కమిషనర్ రాచెల్ డిసౌజా అన్నారు. ''2020లో లండన్‌లోని ఓ స్కూల్లో 15 ఏళ్ల నల్లజాతి బాలికను డ్రగ్స్ ఉన్నాయంటూ మహిళా అధికారులు దుస్తులు విప్పి సోదాలు జరిపారు. ఎలాంటి డ్రగ్స్ దొరకలేదు. దీనికి జాతి వివక్షే కారణమని భావిస్తున్నాం'' అని తెలిపారు.

అరుణాచల్ జీ20 సదస్సుకు చైనా డుమ్మా

బీజింగ్/న్యూఢిల్లీ: అరుణాచల్‌ప్రదేశ్ రాజధాని ఈటానగర్‌లో ఆదివారం జరిగిన జీ20 సన్నాహక సదస్సుకు చైనా గైర్హాజరైందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పరిశోధనలు, ఆవిష్కరణల థీమ్‌తో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం జరిపిన ఈ సదస్సుకు చైనా మినహా ఇతర జీ20 సభ్యదేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. అరుణాచల్ తమదని చైనా వాదిస్తుండటం, దాన్ని భారత్ తిప్పికొడుతుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడ సదస్సుపై అసంతృప్తితోనే చైనా తమ ప్రతినిధులను పంపలేదంటున్నారు. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ దీన్ని ఖండించారు. జరిగిందో తెలుసుకుంటానన్నారు.

భావోద్వేగరహితంగా విచారణ

బిల్కిస్ పిటిషన్ల విచారణపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ: బిల్కిస్ బానో కేసులో దోషుల ముందస్తు విడుదల ఇతర కేసుల్లో మాదిరిగా నిబంధనలకు లోబడే జరిగిందా అని సుప్రీంకోర్టు సోమవారం ప్రశ్నించింది. సంబంధిత రికార్డులన్నింటినీ ఏప్రిల్ 18న తదుపరి విచారణ సందర్భంగా తమ ముందుంచాలని కేంద్రం, గుజరాత్ ప్రభుత్వాలను ఆదేశించింది. ''హేయమైన ఈ నేరానికి సంబంధించి భావోద్వేగాలతో కాకుండా సమతూకంతో వ్యవహరించాలి. ఈ కేసును చట్టానికి లోబడి విచారించాల్సిన అవసరముంది'' అని న్యాయమూర్తులు జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్నల ధర్మాసనం పేర్కొంది.

యడియూరప్ప ఇంటిపై రాళ్ల దాడి

రిజర్వేషన్లకు వ్యతిరేకంగా గిరిజన వర్గాల ఆందోళన ఉద్రిక్తం

శివమొగ్గ/చిక్‌బళ్లపుర: కర్ణాటక బీజేపీ అగ్ర నేత, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప ఇంటిపై సోమవారం రాళ్ల దాడి జరిగింది. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇటీవల ఎస్సీ, ఎస్టీల్లో రిజర్వేషన్లను పెంచడంతో పాటు పలు రిజర్వేషన్లను కొన్ని ఉన్నత వర్గాలకు అనుకూలంగా మార్చింది. దీంతో తమకు అన్యాయం జరిగిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బంజారాలు, మరికొన్ని గిరిజన వర్గాలు శికారిపురలో ఆందోళన చేశారు. భారీగా ర్యాలీ నిర్వహించి యడియూరప్ప, సీఎం బసవరాజ బొమ్మైలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దిష్టిబొమ్మలను, చీరలను దహనం చేశారు. శివమొగ్గ జిల్లా శికారిపురలోని యడియూరప్ప నివాసంపైకి రాళ్లు రువ్వారు. దాంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. రిజర్వేషన్లపై రాజకీయాలతో సమాజాన్ని కాంగ్రెస్ విడదీయజూస్తోందని బొమ్మై ఆరోపించారు.

మారనున్న ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్

న్యూఢిల్లీ: నూతన జాతీయ విద్యావిధానం(ఎన్‌ఈపీ) ప్రకారం 2024–25 విద్యా సంవత్సరం నుంచి ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల సిలబస్‌ను సవరించనున్నట్లు కేంద్రం సోమవారం పేర్కొంది. కొత్త సిలబస్‌తో పుస్తకాలు డిజిటల్ ఫార్మాట్‌లోనూ అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ఎన్‌ఈపీ–2020 ప్రకారం చిన్నారులు ప్రాథమిక దశలో ఐదేళ్లు, సన్నద్ధత, మధ్య దశల్లో మూడేసి ఏళ్లు, సెకండరీ స్టేజిలో నాలుగేళ్లు గడపాల్సి ఉంటుందన్నారు.

సాక్షి కరీంనగర్

మంగళవారం । 28 । మార్చి । 2023



అశ్వవాహనంపై విహరింపు

వేములవాడ: రాజన్న సన్నిధిలో జరుగుతున్న సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారిని అశ్వ వాహనంపై ఊరేగించారు.



హుండీ ఆదాయం రూ.35లక్షలు

ఓదెల: మల్లన్న స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రూ.35,49,062 వచ్చినట్లు ఈవో సదయ్య తెలిపారు. మిశ్రమ బంగారం, వెండి వచ్చిందన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0/22.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

కూలీలతో పని చేయించుకున్నప్పుడు వారి చెమట ఆరకముందే కష్టార్జితం చెల్లించాలి
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
మంగళ 6:32	బుధ 4:48

న్యూస్‌రీల్

నెలరోజుల నుంచి మూసిఉన్న రైల్వేగేటు



రామడుగు(చొప్పదండి): మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామశివారులోని ఎల్‌సీ 25ఈ రైల్వే గేట్ నెల రోజుల నుంచి మరమ్మతుల పేరుతో మూసివేశారు. దీంతో ఇబ్బంది పడాల్సివస్తోందని దేశరాజ్‌పల్లి గ్రామస్తులు సోమవారం రైల్వేగేట్ వద్ద ఆందోళనకు దిగారు. రైల్వేగేట్ మూసివేయడంతో ఇతర మార్గంలేక, పంట పొలాల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు గేట్ తెరవాలని పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోని పరిస్థితి ఉందని తెలిపారు. అధికారులు స్పందించి గేట్ తెరిపించేలా చేయాలని కోరారు.

తగ్గిన పత్తి ధర



జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్లో పత్తి ధరలు రోజురోజుకు తగ్గుతున్నాయి. గత శుక్రవారం నాటి మార్కెట్ ధర కన్నా రూ.300 తగ్గింది. సోమవారం మార్కెట్లో క్వింటాల్ పత్తికి గరిష్ట ధర రూ.7,200 పలికింది. మార్కెట్‌కు 131 వాహనాల్లో 1,924 క్వింటాళ్ల పత్తిని రైతులు తీసుకొచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,000, కనిష్ట ధర రూ.6,800 పలికింది. గన్నీ సంచుల్లో 19మంది రైతులు 35క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకరాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,000, మోడల్ ధర రూ.6,800, కనిష్ట ధర రూ.6,000కు ఖరీదు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్‌యార్డులో క్రయవిక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

ప్రభుత్వ కళాశాలలో టాస్క్ శిక్షణ

శాతవాహనయూనివర్సిటీ: కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో టాస్క్‌ద్వారా మహేంద్రాప్రైడ్ క్లాస్‌రూం నైపుణ్య శిక్షణను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీలక్ష్మీ ప్రారంభించారు. విద్యార్థులు నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో ఉద్యోగాలు తొందరగా సాధించవచ్చని తెలిపారు. కోర్సులు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు రావాలంటే మొదటి నుంచే అదనపు నైపుణ్యాలు సంపాదించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్‌రెడ్డి, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్.శోభారాణి, టీఎస్‌కేసీ మెంటర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎస్‌యూలో రూ.20 కోట్లతో గిరిజన హాస్టళ్లు

శాతవాహనయూనివర్సిటీ: శాతవాహన యూనివర్సిటీలో గిరిజన విద్యార్థుల వసతిగృహాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. బాలికల వసతిగృహ నిర్మాణానికి రూ.10 కోట్లు, బాలురకు రూ.10 కోట్ల చొప్పున విడుదల చేసినట్లు శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సంకశాల మల్లేశ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గల ఏడు యూనివర్సిటీలకు రూ.140 కోట్లు మంజూరు చేయగా శాతవాహనకు రూ.20 కోట్లు అందించనున్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీలో బాల్య వివాహలతో కలిగే అనర్థాలపై చైల్డ్‌లైన్ 1098 జిల్లా కో‌‑ ఆర్డినేటర్ సంపత్, తిమ్మాపూర్ తహసీల్దార్ కనుకయ్య విజ్ఞప్తి మేరకు సర్పంచ్ మీసాల అంజయ్య అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ చిన్న వయసులో ఎవరు కూడా పెళ్లి చేయవద్దని అన్నారు. గ్రామంలో ఎక్కువగా బుడిగె జంగాలు బాల్య వివాహాలు చేస్తున్నట్లు అధికారుల దృష్టికి వెళ్లిందన్నారు. బాల్య వివాహలను ప్రోత్సాహించవద్దని, బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని, ప్రభుత్వ పథకాలు రావు అని పేర్కొన్నారు. ఇన్‌చార్జి డీసీపీవో శాంత, శ్రీలత, రమేశ్ ఉన్నారు.

కొంచెం మోదం.. కొంచెం ఖేదం!

- ఎన్ఎంఆర్ వేతనాలు పెంచుతూ గెజిట్ జారీ
- రెండేళ్లకోసారి పెరుగుదల, తాజా సవరణతో 15శాతం పెంపు
- కరీంనగర్‌లో కనీస వేతనానికి దూరంగా కొందరు ఎన్ఎంఆర్‌లు
- రూ.425కు బదులుగా రోజుకు రూ.283 మాత్రమే చెల్లింపు
- సాక్షాత్తూ కరీంనగర్ కలెక్టరేట్ ప్రాంగణంలోనే అమలుకాని వైనం
- మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో సంతృప్తికరంగానే వేతనాలు



కార్మికులు

కేటగిరీ	2018 ప్రకారం వేతనాలు	
	నాన్ కార్పొరేషన్	కార్పొరేషన్
అన్‌స్కిల్డ్	రూ.425	రూ.531
సెమీ స్కిల్డ్	రూ.480	రూ.600
స్కిల్డ్	రూ.540	రూ.675

కేటగిరీ	2022 ప్రకారం వేతనాలు	
	నాన్ కార్పొరేషన్	కార్పొరేషన్
అన్‌స్కిల్డ్	రూ.489	రూ.611
సెమీ స్కిల్డ్	రూ.552	రూ.690
స్కిల్డ్	రూ.621	రూ.776

(నోట్: ఈ పెంపుదల 2019–2020, 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాలకు వర్తిస్తుంది..)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: నామినల్ మస్టర్ రోల్ (ఎన్ఎంఆర్)ల వేతనాలు పెంచుతూ కరీంనగర్ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి రెండేళ్లకోసారి వీరి వేతనాలను సవరిస్తూ ఉంటారు. కానీ, కరోనా కారణంగా 2020లో వీరికి వేతన సవరణ జరగలేదు. ఫలితంగా ఇప్పుడు 2020లతోపాటు 2022ను కలుపుకొని వేతనాలను 15శాతం పెంచుతూ గెజిట్ జారీ చేశారు. త్వరలోనే నూతన వేతనాలు అమలులోకి రానున్నాయి. అదే సమయంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఎన్ఎంఆర్‌లకు ఇంకా 2016కు ముందు ప్రకారమే వేతనాలు చెల్లిస్తుండటం గమనార్హం. మొత్తానికి వేతనాలు పెరిగినందుకు కొందరు సంతోషపడుతుండగా.. మరికొందరు మాత్రం ఇంకా తమ బతుకులు మారనందుకు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కరీంనగర్ జిల్లాలో ఇలా?

జిల్లాలో కలెక్టర్ కాంప్లెక్స్‌తోపాటు పలు ప్రభుత్వ శాఖల్లో చిరుద్యోగులుగా పనిచేసే.. నామినల్ మస్టర్ రోల్ (ఎన్ఎంఆర్)ల స్థితి దయనీయంగా ఉంది. నెల మొత్తం బండెడు చాకిరీ చేసినా వారికి దక్కేది కేవలం రూ.8500 మాత్రమే. అది కూడా 30రోజుల్లో ఒక్కరోజు కూడా ఆబ్సెంట్ లేకుండా ఉంటేనే. ఏ అవసరానికి సెలవుపెట్టినా వేతనంలో కోతలు తప్పవు. ఇలాంటి వారు దాదాపు కేవలం కరీంనగర్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో 30మందికి వరకు ఉన్నారు. వాస్తవానికి వీరికి కనీస వేతనాలు చెల్లించాలని 2016లో ఉమ్మడి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వెలువడిన ప్రభుత్వ అధికారిక నిబంధనలు ఇప్పటికీ అమలు కాలేదు. ఫలితంగా జిల్లాలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్‌ల పరిస్థితి దయనీయంగా ఉంది. అడ్డా మీద కూలీల కంటే కూడా తమ వేతనాలు చాలా తక్కువగా ఉన్నాని వారంతా వాపోతున్నారు. అయితే, ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేసే ఎన్ఎంఆర్‌లకు వేతనాలు గెజిట్ ప్రకారమే ఇస్తుండటం గమనార్హం.

15శాతం పెంచుతూ జీవో

తాత్కాలిక పద్ధతిన వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే చిరుద్యోగులుగా వీరిని రిక్రూట్ చేసుకున్నారు. వాస్తవానికి వివిధ శాఖలు వారికి అవసరమైన మేరకు రోజువారీ పద్ధతిన పనిచేసే ఎన్ఎంఆర్‌ల వేతనాలు చెల్లించాలి. ఈ అందరికీ చివరిసారిగా 2018లో వేతనాలు పెరిగాయి. అనంతరం కరోనా కారణంగా ఈ పెంపుదల జరగలేదు. తాజాగా వీరి వేతనాలను 15శాతం మేరకుపెంచుతూ కలెక్టర్ కర్ణన్ గెజిట్ జారీ చేశారు. చేసే పని, ప్రావీణ్యం ఆధారంగా వీరిని అన్‌స్కిల్డ్ (చౌకీదార్, అటెండర్, స్వీపర్, మేస్త్రీ, మజ్దూర్, స్కావెంజర్ తదితరాలు) సెమీ స్కిల్డ్ (సెకండ్ క్లాస్ మేషన్, కార్పెంటర్, బ్లాక్‌స్మిత్, పెయింటర్, ఫిట్టర్, కుక్, ఎలక్ట్రీషియన్, తదితరాలు) స్కిల్డ్ (ఫస్ట్‌క్లాస్ మేషన్, మెకానిక్,ఫిట్టర్, వెల్డర్, డ్రైవర్, క్లర్క్స్, టైపిస్ట్ తదితరాలు) అనే మూడురకాలుగా వర్గీకరించారు. ఇవే ఆదేశాలు కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు వర్తించనన్నాయని అధికారులు తెలిపారు.

ఆ 30 మందికి అమలు చేయాలి



ప్రస్తుతం కరీంనగర్ కలెక్టరేట్‌లో దాదాపు 30 మంది 15 ఏళ్లుగా ఎన్ఎంఆర్‌లుగా పనిచేస్తున్నారు. వీరికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. కాకుండా కేవలం రూ.8500 నామమాత్రపు వేతనాలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ విషయం సమాచార హక్కు చట్టం ద్వారా వెల్లడైంది కూడా. వారంతా నోరు తెరిచి అడగలేని దయనీయ స్థితిలో ఉన్నారు. ఎన్ఎంఆర్‌లకు తాజాగా 15శాతం వేతన సవరణను ఆహ్వానిస్తున్నాం. కానీ, వీరి విషయంలో మానవతా దృక్పథంతో అందరికీ కొత్త వేతన సవరణ ప్రకారం.. జీతాలు అందజేయాలి.

– మహమ్మద్ జమీల్, సామాజిక కార్యకర్త

అన్నిరంగాల్లో అగ్రస్థానంలో కరీంనగర్



సత్కారం పొందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, జీపీ సిబ్బందితో మంత్రి కమలాకర్, తదితరులు

- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్
- తొమ్మిది అంశాల్లో 27 జీపీలకు జాతీయ అవార్డు
- సర్పంచులు, అధికారులు, సిబ్బందికి సత్కారం

కరీంనగర్: సంక్షేమ పథకాల అమలుతో పాటు, మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధిని సాధించడంలో జిల్లా ముందుంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారం జిల్లాస్థాయి జాతీయ పంచాయతీ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి మంత్రి ప్రారంభించారు. కరీంనగర్, మానకొండూర్, చొప్పదండి నియోజకవర్గాలకు చెందిన 11 మండలాల్లోని 27 గ్రామపంచాయతీల్లో పేదరికం లేని, మెరుగైన జీవనోపాధి పంచాయతీ, ఆరోగ్యకరమైన, చైల్డ్‌ఫ్రెండ్లీ, తగినంత నీరు, క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ, పంచాయతీలో స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు, సామాజిక భద్రత కలిగిన పంచాయతీ, పంచాయతీ విత్ గుడ్ గవర్నెన్స్, మహిళా స్నేహపూర్వక పంచాయతీ అనే అంశాలపై ప్రగతిని సాధించిన గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బందికి అవార్డులు ప్రదానం చేశారు. కలెక్టర్ ఆర్వీ.కర్ణన్, జెడ్పీచైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, సుడా చైర్మన్ జీవీ.రామకృష్ణారావు, అదనపు కలెక్టర్లు జీవీ.శ్యాంప్రసాద్‌లాల్, గరిమా అగర్వాల్, జెడ్పీ సీఈవో ప్రియాంక,డీపీవో వీరబుచ్చయ్య, డీఆర్‌డీవో శ్రీలత రెడ్డి, డీఎంహెచ్‌వో జువేరియా పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలి

ఇల్లందకుంట(హుజూరాబాద్): ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో నేటినుంచి ఏప్రిల్ 9వరకు జరిగే శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి గంగుల కమలాకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో హుజూరాబాద్ ఆర్డీవో హరిసింగ్ అధ్యక్షతన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి, కలెక్టర్ ఆర్వీ.కర్ణన్, సీపీ సుబ్బారాయుడు, జెడ్పీ చైర్‌పర్సన్ విజయతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.

- మంత్రి కమలాకర్ మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి జాతరకు 50వేలకు పైగా భక్తులు రానున్న నేపథ్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.
- ఉత్సవాల నిర్వహణకు నిధుల కొరత ఉందని ఎమ్మెల్సీ మంత్రిదృష్టికి తీసుకెళ్లగా.. అప్పటికప్పుడు రూ.10లక్షలు మంజూరు చేయాలని కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు.
- గతంలో కల్యాణ కార్యక్రమం ఆలస్యమైందని, ఈసారి 12 గంటల వరకు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టువస్త్రాలు ఈ సారి ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి సమర్పిస్తారని తెలిపారు.
- అన్నదానానికి ఎక్కువ మొత్తంలో కౌంటర్లు, వలంటీర్లను ఏర్పాటు చేయాలని అన్నారు. రాములోరి సమక్షంలో ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా, ఎవరూ కూడా ఆలయ పరిధిలో పొలిటికల్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని, ఫ్లెక్సీ రహిత జాతరగా ఉండాలని ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి కార్యకర్తలను కోరారు.
- కలెక్టర్ కర్ణన్ మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. టాయిలెట్స్‌కు ఇబ్బంది లేకుండా కరీంనగర్ నుంచి స్పెషల్ మొబైల్ టాయిలెట్స్ తెప్పిస్తున్నట్లు తెలిపారు.
- సీపీ సుబ్బారాయుడు మాట్లాడుతూ.. గతంలో పార్కింగ్ కోసం ఇబ్బందులు లేకుండా ఉండేది అని, ఇప్పుడు రైతులు పొలాలు వేయడంతో పార్కింగ్ స్థలంలేకుండా పోయిందన్నారు.
- భక్తులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని, కేటాయించిన చోట వాహనాలు పార్కింగ్ చేయాలని అన్నారు. అంతకుముందు ప్రముఖులకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎంపీపీ సరిగొమ్ముల పావని, సర్పంచ్ శ్రీలత, తహసీల్దార్లు మాధవి, రాజేశ్వరి, జెడ్పీటీసీ శ్రీరామ్ శ్యాం,దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ చంద్ర శేఖర్, ఆలయ ఈవో కందుల సుధాకర్ ఉన్నారు.

సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలని ఫిర్యాదు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్‌లు

కరీంనగర్: సర్పంచుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గోపాల్‌రావుపేట, చెల్పూర్, మన్నెంపల్లి సర్పంచ్‌లు కర్ర సత్యప్రసన్నరెడ్డి, నేరెళ్ల మహేందర్‌గౌడ్, మేడి అంజయ్య సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలోని 95శాతం సర్పంచులు చేసిన పనులకు నిధులు రాక ఆత్మహత్యలు, బాధలు పడుతున్నారన్నారు. గోపాల్‌రావుపేట గ్రామపంచాయతీకి రూ.18,06,548 నిధులు గతేడాది సెప్టెంబరు నుంచి ఫ్రీజింగ్‌లో ఉన్నాయని, 15వ ఆర్థిక సంఘం రూ.15,95,005, ఎస్ఎఫ్‌సీ రూ.4,89,668 చెక్కులు పాస్ కావడం లేదన్నారు. ఒక్కో గ్రామపంచాయతీకి దాదాపుగా రూ.35 లక్షలు రావాలని అన్నారు. రాష్ట్రంలోని సర్పంచులు గ్రామపంచాయతీ అకౌంట్‌లో ఉన్న నిధులు తీసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మూడు నెలల డబ్బులు ఇవ్వడం జరిగిందని, ఎస్ఎఫ్‌సీ నిధులు ఐదు నెలల నుంచి రావడం లేదన్నారు. ఇప్పటికైనా నెల నెల డబ్బులు గ్రామ పంచాయతీలకు ఇవ్వాలని ,ఫ్రీజింగ్ ఎత్తి వేయాలని, సర్పంచ్‌ల బాధలు తీర్చాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచులు జీవన్, లక్ష్మి ,రాజేశ్వరి, ఎల్లయ్య, కవిత, మహిపాల్, మేఘరాజు ,కర్ణాకర్, రవీందర్ రెడ్డి, బాలరాజు కవిత, రాజు ఉన్నారు.

సమయపాలనా... అదెక్కడ!



ప్రజావాణి కోసం డీటీల పడిగాపులు

కరీంనగర్ అర్బన్: అసలే వేసవికాలం అర్జీ ఇచ్చి త్వరగా వెళ్లాలనుకునేవారికి నిరాశే. ప్రజావాణిలో సమయపాలన అటకెక్కడం, పర్యవేక్షణ కరవవడంతో ఇష్టారాజ్యంగా మారింది. సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఉదయం 9గంటలకే ప్రజావాణికి చేరుకున్నారు. 10.15 దాటినా రిజిస్ట్రేషన్ విభాగం, రసీదుల విభాగం ఖాళీగా కనిపించడంతో పడిగాపులు తప్పలేదు. దీంతో పాటు ఆడిటోరియంలో సమావేశాలు నిర్వహించడంతో అన్ని మండలాల డీటీలు బయట నిరీక్షించారు. సమావేశానంతరం 11.20దాటాకా ఆడిటోరియంలో అర్జీలను స్వీకరించారు.

కలెక్టర్ గారూ... ప్రజావాణి సమయాన్ని మార్చరూ!

- గరిష్టస్థాయికి ఉష్ణోగ్రతలు
- కనీస సౌకర్యాలు కరువు
- ఏదైనా జరిగితే బాధ్యులెవరు?



ఎండకు తాళలేక కూతురికి నీరు తాగిస్తున్న తండ్రి



సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ప్రజల తాకిడి

కరీంనగర్‌అర్బన్: అర్జీల పరిష్కారం దేవుడెరుగు అర్జీ ఇచ్చేందుకు వచ్చే ప్రజలకు ఎండ తాకిడి తప్పడం లేదు. రాష్ట్ర విపత్తులశాఖ వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. కాగా గత కొన్ని రోజులుగా భానుడి ప్రతాపం తారాస్థాయికి చేరడంతో ఉదయం 10గంటలు దాటితే బయట కాలు పెట్టాలంటే జంకాల్సిన పరిస్థితి నెలకొంది. అరగంటకోసారి నోరు తడారిపోతోంది. ఈ నేపథ్యంలో వృద్ధులు, దీర్ఘకాలిక రోగులకు ప్రతికూలమే. ఈ క్రమంలో జిల్లా నలుములల నుంచి కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు వడదెబ్బకు గురయ్యే అవకాశాలున్నాయి. ఉదయం 10.30 గంటల తర్వాత ప్రజావాణి ప్రారంభం అవుతుండటంతో ఉదయమే వచ్చిన ప్రజలు అప్పటి వరకు ఎదురు చూడాల్సి వస్తోంది. అర్జీని అధికారులకు ఇచ్చి వెళ్లేందుకు మరో గంట సమయం పడుతుంది. తదుపరి తమ స్వస్థలాలకు చేరేందుకు ఎండలో ప్రయాణం చేయాల్సి వస్తోంది. జిల్లా కలెక్టర్ చొరవ చూపి సమయాన్ని మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఉదయమే నిర్వహించడం ఉత్తమం

గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజావాణి సమయాన్ని మార్చాల్సిన అవసరముంది. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం అటకెక్కడంతో ప్రజలు ప్రజావాణికి రావాల్సిందే. ఫోన్‌లో ఫిర్యాదు చేసే పరిస్థితి లేదు. ఉదయం 10.30 తర్వాత అర్జీలను స్వీకరిస్తున్నారు. రిజిస్ట్రేషన్ కౌంటర్, రసీదుల విభాగ సిబ్బంది 10 గంటలకు చేరుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ విభాగం, రసీదుల విభాగం ఉదయం 7 గంటలకే ప్రారంభిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ప్రతి సోమవారం ప్రజావాణిలో విధులు నిర్వహించే ఉద్యోగులకు మూడు గంటలు ముందుగా వెళ్లేలా ఏర్పాటు చేయాలి. అలాగే ప్రజావాణి అర్జీలను స్వీకరించే సమయాన్ని 7.30 గంటలకు ప్రారంభిస్తే శ్రేయస్కరంగా ఉంటుంది. 11 గంటలలోగా అర్జీల స్వీకరణ పూర్తయితే వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారు పగటి ఎండ తగలకుండా ఇంటికి చేరుకునే అవకాశముంది. గతంలో జిల్లా కలెక్టర్లుగా పనిచేసిన స్మితాసబర్వాల్, నీతూప్రసాద్, సర్ఫరాజ్ అహ్మద్‌లు ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఉదయమే ప్రజావాణిని నిర్వహించారు. సదరు అనుభవాల క్రమంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తే శ్రేయస్కరం.

మండల ప్రజావాణి పటిష్టం ఉత్తమం

మండల అధికారులపై నమ్మకం లేక ప్రజలు కలెక్టరేట్‌కు వస్తున్నారన్న విమర్శలున్నాయి. మండలంలో జరిగే ప్రజావాణికి 10కి మించి అర్జీలు రావడం లేదంటే వారి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. హుజూరాబాద్, కరీంనగర్ రెవెన్యూ డివిజన్లలోని పలు మండలాల్లో ఒక్క అర్జీ రాని పరిస్థితి. అధికారులకు అర్జీలను ఇస్తే చెత్త బుట్టలో పడేస్తున్నారని జిల్లా కలెక్టర్‌ను కలిస్తే సమస్య పరిష్కారమవుతుందన్న నమ్మకంతో కరీంనగర్ చేరుకుంటున్నారు.

ప్రజావాణికి జనతాకిడి

ప్రజావాణికి మండుటెండలోనూ ఆదరణ తగ్గడం లేదు. సోమవారం జరిగిన ప్రజావాణిలో 215 దరఖాస్తులు వచ్చాయని కలెక్టరేట్ ఏవో జగత్‌సింగ్ వివరించారు. అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, జీవీ శ్యాంప్రసాద్‌లాల్, ట్రైనీ కలెక్టర్ నికోలస్, జెడ్పీ సీఈవో ప్రియాంక తదితరులు అర్జీలను స్వీకరించారు.

గుక్కెడు తాగునీరు కరువే

అసలే ఎండలు మండుతుండగా కనీస సౌకర్యాలు కరవయ్యాయి. ప్రతి సోమవారం ప్రజావాణికి వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ఈ క్రమంలో వారికి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం విమర్శలకు తావిస్తోంది. మూత్రశాలలు లేకపోగా తాగేందుకు గుక్కెడు నీరు కూడ అందుబాటులో లేదు. గతంలో ప్రతి వేసవిలో ప్రవేశద్వారం వద్ద మంచినీరు ఏర్పాటు చేసేవారు. సదరు ఊసే లేకపోగా ఇంటి నుంచి బాటిళ్లలో నీటిని తెచ్చుకుంటున్నారు.

ఆర్థికప్రగతి సాధన దిశగా ముందుకు సాగాలి

- కలెక్టర్ ఆర్‌వీ. కర్ణన్

హుజూరాబాద్‌రూరల్: దళితబంధు పథకం యూనిట్లను ఏర్పాటు చేసిన లబ్ధిదారులు మరి కొందరికి ఉపాధి కల్పించేస్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆర్‌వీ. కర్ణన్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో దళితబంధు పథకం కింద గ్రౌండింగ్ చేసిన పలు యూనిట్లను కలెక్టర్, సీపీ ఎల్.సుబ్బారాయుడుతో కలసి సందర్శించారు. లబ్ధిదారులతో యూనిట్ల అభివృద్ధి, లాభాల గురించి అడిగి తెలుసుకున్నారు. మొదటి దశలో యూనిట్లను గ్రౌండింగ్ చేసేందుకు గాను సగం డబ్బులు ఇచ్చామని, మిగిలిన డబ్బులు మంజూరు చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీని కలెక్టర్ ఆదేశించారు. ఎంఆర్ఎస్ గానుగ నూనెలు లబ్ధిదారుడితో కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రకాల నూనెలను గానుగ పట్టి అమ్మడంతో పాటు కాంటాక్ట్ పద్ధతిలో కొందరిని నియమించుకొని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, దుకాణదారులకు పంపించి, ఆదాయం పొందాలని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి సురేశ్, ఈడీ నాగార్జున, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఎంపీడీవో వేముల విజయలక్ష్మి ఉన్నారు.

'ఉపాధి' పనులు వేగవంతం చేయండి

కరీంనగర్‌అర్బన్: జిల్లాలో ఉపాధిహామీ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధిహామీ పనులపై సమీక్షించారు. 2018 నుంచి 2023 వరకు ఉపాధిహామీ ద్వారా నిర్వహించిన పనుల చెల్లింపులు పెండింగ్ లేకుండా చూడాలని అన్నారు. 2022 కన్నా ముందు మంజూరైన అన్ని పనులు పూర్తిచేయాలని, వైకుంఠధామాల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు, యూసీతో సహా పంపించాలని ఈ సందర్భంగా సూచించారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్, సీపీ

ఇంటర్‌లో ఒకరు డిబార్

కరీంనగర్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో సోమవారం చొప్పదండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకరు డిబార్ అయినట్లు డీఐఈవో రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా జనరల్, ఒకేషనల్ విభాగాల్లో మొత్తంగా 14,513 మంది విద్యార్థులకు గాను 388మంది పరీక్షకు గైర్హాజరు అయ్యారని తె8లిపారు. 14,125 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు డీఐఈవో రాజ్యలక్ష్మి పేర్కొన్నారు.

క్లుప్తంగా

పద్మశాలీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా అఖిల్



నియామక పత్రం అందిస్తున్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్: పద్మశాలీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా జమ్మికుంట పట్టణానికి చెందిన గాజెంగి అఖిల్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం హుజూరాబాద్‌లో జరిగిన పద్మశాలీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 30 లక్షల పైచిలుకు ఉన్న పద్మశాలీల స్థితిగతులను మార్చాలంటే రాజకీయ ప్రాతినిధ్యం వల్లే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇందుకోసం పద్మశాలీ కులస్తులను ఏకం చేయాలని సూచించారు. తన నియామకానికి సహకరించిన పద్మశాలీ సంఘం సీనియర్ నాయకులు సంగెం సత్యనారాయణ, బండారి సదానందం, శ్రీనివాస్ తదితరులకు అఖిల్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ బండి సంజయ్ అత్తమ్మ మృతి



మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి కమలాకర్

కరీంనగర్‌టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఇంట విషాదం నెలకొంది. ఆయన అత్తమ్మ వనజ సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్, మేయర్ వై.సునీల్‌రావు, బీజేపీ నాయకులు వనజ పార్థివదేహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం ఎంపీ కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఉచిత వైఫైకి ఆదిలోనే ఆటంకం

- బీఎస్ఎన్ఎల్ ఆఫీస్‌లో అగ్ని ప్రమాదంతో సేవలకు బ్రేక్



కలెక్టరేట్‌లో వైఫై పరికరం

కరీంనగర్ అర్బన్: అధికారులు, ఉద్యోగులు, ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వైఫైకి ఆదిలోనే ఆటంకం కలిగింది. పరికరాలు బిగించినా సేవలు అందడం లేదు. ఇటీవల బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో అగ్ని ప్రమాదం సంభవించడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సేవలు నిలిచిపోయాయి. దీంతో వైఫై సేవలకు కూడా బ్రేక్ పడింది. స్మార్ట్ సిటీలో భాగంగా కలెక్టరేట్‌లో నాలుగు వైఫై పరికరాలను అమర్చారు. ఇందులో రెండు అధికారులు, ఉద్యోగుల కోసం కాగా మరో రెండు ప్రజల కోసం ఏర్పాటు చేశారు. బీఎస్ఎన్ఎల్ ఆఫీస్‌లో మరమ్మతుల అనంతరం వైఫై సేవలు ప్రారంభమవుతాయని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

పత్తి విత్తనం.. రైతుకు భారం

- గతేడాది ప్యాకెట్ ధర రూ.810.. ప్రస్తుతం రూ.853
- జిల్లా కర్షకులపై రూ.1.29 కోట్ల భారం



విత్తన ప్యాకెట్లు

కరీంనగర్ అర్బన్: అసలే వాతావరణ ప్రతికూల పరిస్థితులతో కునారిల్లుతున్న అన్నదాతకు ప్రభుత్వ సాంత్వన కరువవుతోంది. ఇప్పటికే విత్తన రాయితీలను ఎత్తేసిన సర్కారు తాజాగా పత్తి విత్తన ప్యాకెట్ ధర పెంచేసింది. విత్తన ధరలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్యాకెట్ ధర రూ.853 నిర్ణయించగా గతేడాదితో పోలిస్తే ప్యాకెట్‌కు రూ.43 పెరిగింది. ఈ లెక్కన కరీంనగర్ జిల్లా రైతులపై రూ.1.29 కోట్ల భారం పడనుంది. గతంతో పోలిస్తే ఎరువులు, మందులు, కూలీల ధరలు పెరగడంతో పెట్టుబడి మరింత పెరగనుందని కర్షకులు కలవరపడుతున్నారు.

బీటీ–2కే ప్రాధాన్యత..

పత్తి పండించే రైతులు విత్తనాలను ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. పలు కంపెనీలు వివిధ రకాల విత్తనాలను మార్కెట్లో ప్రవేశపెట్టడంతో వాటి ధరలపై కేంద్ర ప్రభుత్వం నియంత్రణ విధించింది. ఏటా విత్తన తయారీ తదితర ఖర్చులను లెక్కించి, సర్కారు ధరను నిర్ణయిస్తుంది. అలా ప్రకటించిన ధరకే కంపెనీలు విత్తనాలను విక్రయించాలి. మార్కెట్‌లో బీటీ–1, బీటీ–2 రకాలు అందుబాటులో ఉన్నా ఎక్కువ మొత్తంలో బీటీ–2 విత్తనాన్నేసాగు చేస్తారు. జిల్లాలో సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉండగా ఏటా 3 లక్షల పత్తి విత్తన ప్యాకెట్ల(ఒక్కొక్కటి 450 గ్రాములు) విక్రయాలు జరుగుతాయి.

నకిలీ బెడద తప్పేనా?

కరీంనగర్ జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం 3.50 లక్షల ఎకరాలు కాగా రైతులు 1.80 లక్షల మంది ఉన్నారు. పత్తి సాగు చేసే రైతులు ఎకరాకు రెండు నుంచి మూడు సంచుల విత్తనాన్ని ఉపయోగిస్తారు. ఈ లెక్కన జిల్లా సాగు విస్తీర్ణం లక్ష ఎకరాలు కాగా 3 లక్షలకు పైగా విత్తన ప్యాకెట్లు అవసరమవుతాయి. వందల రకాల విత్తనాలు అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం బీటీ–2 విత్తనాల ప్యాకెట్ ధర రూ.810 ఉంది. వచ్చే సీజన్‌లో ఒక సంచి రూ.853తో విక్రయించుకోవచ్చని కేంద్రం ప్రకటించింది. ఎక్కువ మొత్తంలో అవసరం ఉండటంతో ఏటా నకిలీ విత్తనాలు మార్కెట్లోకి వస్తున్నాయి. అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా వాటికి అడ్డుకట్ట పడటం లేదు. మరి ఈసారి నకిలీ బెడద తప్పేనా అన్న చర్చ జరుగుతోంది.

విత్తనాలపై స్పష్టత అవసరం

ఏటా నకిలీ విత్తనాలు నీడలా వెంటాడుతుంటే వ్యవసాయ శాఖ తదనుగుణ చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. పత్తి విత్తనాలను ప్రభుత్వం రాయితీపై ఇవ్వడం లేదు. ప్రైవేటు కంపెనీలే ఆధారం. ఈ క్రమంలో అసలు ఏయే కంపెనీలకు అనుమతి ఉంది, ఎంత ధర తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలి. నకిలీ విత్తనాలు విక్రయించే డీలర్ల లైసెన్స్ రద్దు చేయాలి. ఇక వచ్చే సీజన్లో ప్రతి విత్తన సంచిపై క్యూఆర్ కోడ్ ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. ఏ కంపెనీ, ఎప్పుడు తయారు చేసింది, లాట్ నంబర్, విత్తన రకం తదితర వివరాలు తెలుసుకోవచ్చు. గతంలో పలు కంపెనీలు విక్రయించిన విత్తనాలు నాసిరకమని తేలాయి. అలాంటి విత్తనాలతో రైతులకు నష్టం జరిగితే పరిహారం ఇప్పించేలా ఒప్పందం చేసుకోవాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

పేద దళిత రైతులకు లీజుకు ఇవ్వండి

- ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూముల విషయంలో ఏఐఎఫ్‌బీ డిమాండ్
- రియల్ ఎస్టేట్ వ్యాపారులు విక్రయిస్తున్నారని ఆరోపణ
- ప్రజావాణిలో నాయకుల ఫిర్యాదు



అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములను వ్యవసాయం చేసుకోవడానికి పేద దళిత రైతులకు లీజుకు ఇవ్వాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌ను కలిసి, వినతిపత్రం అందించారు. ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ.. కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరులో సర్వే నంబర్ 383, 438, 439, 443, 549, 550, 581, 584, 442, బొమ్మకల్‌లోని సర్వే నంబర్ 113, 114, 115లలో ఉన్న భూములను ప్రభుత్వం 2006 స్వాధీనం చేసుకుందన్నారు. వాటిని పేద దళితులకు వ్యవసాయానికి లీజుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోర్టులో సీలింగ్ కేసు పెండింగ్‌లో ఉండగా ఆయా సర్వే నంబర్లలోని భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు చేసి, విక్రయిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటివరకు జరిగిన అన్ని రకాల రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కోరామన్నారు. కోర్టు లీజుకు ఇవ్వాలని చెప్పినప్పటికీ ఇవ్వకపోవడానికి గల కారణాలపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. సదరు భూముల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు, కోర్టులో సీలింగ్ కేసు పెండింగ్‌లో ఉందనే పేరుతో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి.ప్రశాంత్ కుమార్, నాయకులు బద్రి నేత, రమేశ్, రామ్మూర్తి, అరుణ్, కొమురయ్య, శంకరయ్య, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని ముంచిపోయిన వారంతా మోదీలే

- డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: దేశాన్ని అప్పుల్లో ముంచిపోయిన వారంతా మోదీలేనని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని ఖండిస్తున్నామని డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తా వద్ద నిరసన దీక్ష చేపట్టారు. దేశంలో కోట్ల రూపాయల మేర బ్యాంకు రుణాలు తీసుకొని, చెల్లించకుండా దేశం విడిచి, పారిపోయిన వ్యాపారులందరూ గుజరాత్‌కు చెందినవారేనని ఆరోపించారు. సూరత్ కోర్టులో పరువు నష్టం కేసు వేయించి, రాజకీయ కుట్రతో రాహుల్ గాంధీని పార్లమెంటు నుంచి బహిష్కరించడం ప్రధాని మోదీ నియంత పాలనకు నిదర్శనమన్నారు. కరోనా లాక్‌డౌన్‌తో దేశ ఆర్థిక వ్యవస్థ పడిపోతే, అదానీ మాత్రం అత్యంత సంపన్నునిగా ఎలా ఎదిగాడని ప్రశ్నించారు. దీనిపై జేపీసీ వేయాలని పార్లమెంటు సాక్షిగా రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే కుట్రపూరితంగా ఆయనను జైల్లో పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, మడుపు మోహన్, పత్తి కృష్ణారెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, ఎండీ.తాజ్, శ్రవణ్ నాయక్, కర్ర సత్యప్రసన్నరెడ్డి, మేనేని రోహిత్‌రావు, బత్తిని శ్రీనివాస్ గౌడ్, మల్యాల సుజిత్ కుమార్, సయ్యద్ అఖిల్, గడ్డం విలాస్ రెడ్డి, రాచకొండ ప్రభాకర్, నాగి శేఖర్, మామిడి అనిల్, ఎస్.ఎల్ గౌడ్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోండి

- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్
- కలెక్టరేట్ ఆవరణలో అంతర్జాతీయ మిల్లెట్ మేళా ప్రారంభం



తృణధాన్యాలను పరిశీలిస్తున్న మంత్రి కమలాకర్, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు, కలెక్టర్

కరీంనగర్: పోషక విలువలున్న చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. పోషణ అభియాన్–పోషణ్ పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఆవరణలో చిరుధాన్యాల మేళా నిర్వహించారు. దీన్ని మంత్రి ప్రారంభించారు. ప్రదర్శనలో ఉంచిన స్టాళ్లను పరిశీలించారు. మన పూర్వీకులు తృణధాన్యాలను మాత్రమే ఆహారంగా తీసుకున్నారని, అందువల్లే వాళ్లు 100 ఏళ్లు బీపీ, షుగర్ వంటి వ్యాధులు లేకుండా జీవించారని చెప్పారు. ప్రస్తుతం పురుగు మందుల వాడకం ఎక్కువైనందున మనం తినే ఆహారం వల్ల అనేక వ్యాధులు వస్తున్నాయని పేర్కొన్నారు. తృణధాన్యాలైన కొర్రలు, సామలు, ఊదలు వంటివి భోజనంలో తీసుకోవాలని సూచించారు. స్టాళ్లను చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్, మానకొండూర్ ఎమ్మెల్యే బాలకిషన్, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావులు పరిశీలించారు. అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్, ఉట్నూరు ఐటీడీఏ సభ్యులు, జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం, అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. సుమారు 150 రకాల మిల్లెట్స్‌తో చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ప్రజాప్రతినిధులు తరలివచ్చారు. కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, జెడ్పీ సీఈవో ప్రియాంక, అసిస్టెంట్ కలెక్టర్ లెనిన్, ట్రైనీ కలెక్టర్ నవీన్, జిల్లా సంక్షేమ అధికారి సబితాకుమారి, అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ వారం ఆయిల్‌పామ్ మొక్కలు నాటాలి

- జెడ్పీ సీఈవో ప్రియాంక



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో ప్రియాంక

కరీంనగర్ అర్బన్: ప్రతీ వారం 100 నుంచి 120 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకోవాలని జెడ్పీ సీఈవో ప్రియాంక ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఆయిల్‌పామ్ సాగుపై వ్యవసాయ, ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు 603 ఎకరాల్లో మొక్కలు నాటినట్లు తెలిపారు. 93 మంది రైతులకు 296 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు నిధులు విడుదలయ్యాయని పేర్కొన్నారు. అంతర పంటలు, నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఒక ఎకరానికి రూ.4,200 చొప్పున ఉద్యాన శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి జిల్లాకు రాయితీ డబ్బులు వచ్చాయని అన్నారు. వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపిస్తున్నారని, గతేడాది సాగు చేసిన తోటల్లో మొక్కలకు పూత కూడా ప్రారంభమైందని అన్నారు. వచ్చే వానాకాలంలో 4,500 ఎకరాల్లో మొక్కలు నాటడమే లక్ష్యంగా అన్నదాతల ఎంపిక జరగాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, మైక్రో ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనుక్షణం రక్షణతో విధులు నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న జీఎం గురువయ్య

గోదావరిఖని(రామగుండం): అనుక్షణం రక్షణతో విధులు నిర్వహిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య అన్నారు. సోమవారం ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1లో ఆయన పర్యటించారు. ఆఫ్‌లోడింగ్ క్వారీలోని పని స్థలాలను, ప్రాజెక్టు విస్తరణ పనులను, తీసుకుంటున్న రక్షణ చర్యలను పరిశీలించారు. ఓసీపీల్లో ఎండాకాలం సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం ఎస్.సాంబయ్య, ఏరియా జీఎం టీవీరావు, ప్రాజెక్టు అధికారి ఎస్.రాధాకృష్ణ, ఏరియా రక్షణ అధికారి సీహెచ్.వెంకటరమణ, ప్రాజెక్టు ఇంజినీర్ ఆర్.శ్రీనివాస్, మేనేజర్ ఉదయ్‌హరిజన్, రక్షణ అధికారి కోటయ్య తదితరులున్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



ఉత్పత్తులను పరిశీలిస్తున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. సోమవారం వృత్తి విద్య కోర్సుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్వహించిన టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు పూర్తవగా వారు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. ఏరియాలో మూడు సెంటర్ల ద్వారా టైలరింగ్‌లో 108 మందికి, మగ్గం వర్క్‌లో 35 మందికి, బ్యూటీషియన్‌లో 72 మంది, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులో 56 మంది మహిళలకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకొని, రాబోయే రోజుల్లో ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు సింగరేణి తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు సవిత, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, అధికారులు అనిల్‌కుమార్, శ్రీనివాస్, సేవా కో–ఆర్డినేటర్ దేవారెడ్డి, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్జీ–1 జీఎంను సన్మానించిన డైరెక్టర్లు



గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 జీఎంగా పనిచేస్తూ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న కె.నారాయణను సోమవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో డైరెక్టర్లు ఘనంగా సన్మానించారు. జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బలరాం, సత్యనారాయణరావు, ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నర్సరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రామగిరి(మంథని): సింగరేణిలో పని చేస్తున్న నర్సరీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం ఫారెస్ట్రీ డీజీఎం బానోతు కర్ణాకు వినతిపత్రం అందించి, మాట్లాడారు. నర్సరీ కార్మికులకు కనీస వేతనం, బోనస్, పీఎఫ్, వైద్యం, చట్టబద్ధ హక్కులు అమలు చేయాలని కోరారు. కొన్నేళ్లుగా కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తింపు లేకుండా అడ్డా మీద లేబర్లుగా పని చేస్తున్నారని అన్నారు. వారి న్యాయమైన హక్కుల సాధన కోసం ఐఎఫ్‌టీయూ పోరాట ఫలితంగా సింగరేణి యాజమాన్యం ముందుకు వచ్చి, సమస్యల పరిష్కారానికి హామీలు ఇచ్చిందని పేర్కొన్నారు. కొత్తగా పిలిచిన టెండర్‌లో కార్మికులకు చెందాల్సిన హక్కులు, సౌకర్యాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ప్రపంచ రంగస్థల దినోత్సవం



సరస్వతి చిత్రపటానికి పూలమాల వేసిన కళాకారులు

చిగురుమామిడి: మండల కేంద్రంలో ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీనగర్‌లో మండలంలోని ఆయా గ్రామాల రంగస్థల కళాకారులు హాజరై, కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. సరస్వతి చిత్రపటానికి పూలమాల వేసి, కొబ్బరికాయ కొట్టారు. పాటలు, భజనలతో సందడి చేశారు. రంగస్థల సాంస్కృతిక కళాకారుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. 50 ఏళ్లు నిండిన కళాకారులకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. కళాకారులకు మేకప్ కిట్, సౌండ్ సిస్టం, వాయిద్య పరికరాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చందబోయిన పర్శరాములు, మండల ప్రధాన కార్యదర్శి రాధారపు సంపత్, ఉపాధ్యక్షుడు ఎం.సంపత్, కోశాధికారి బి.లక్ష్మీనారాయణ, కళాకారులు పాల్గొన్నారు.

న్యాయవాద గుమస్తాల సంఘం అధ్యక్షుడిగా ఎన్నిక



సాయిరాం

హుజూరాబాద్‌రూరల్: న్యాయవాద గుమస్తాల సంఘం ఎన్నికల్లో గోపగోని సాయిరాం విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి అంబాల ప్రవీణ్ సోమవారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా ఎడ్ల రాజు, కార్యదర్శిగా బల్ల వీరు, కోశాధికారిగా వల్లెపు నరేష్ ఎన్నికైనట్లు పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన వారిని బార్ అసోషియేషన్ అధ్యక్షుడు బండి కళాధర్, పలువురు న్యాయవాదులు అభినందించారు.

దళిత బంధు యూనిట్ల పరిశీలన

జమ్మికుంట(హుజూరాబాద్): మున్సిపల్ పరిధిలోని దళిత బంధు యూనిట్లను కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, సీపీ సుబ్బారాయుడు సోమవారం పరిశీలించారు. మోత్కులగూడెంలోని డెయిరీ ఫామ్, పట్టణంలోని ఏటుజెడ్ మెడికల్, మొబైల్ షాపుల్లో వ్యాపార లావాదేవీలు, ఆదాయం, నిర్వహణ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆదాయం పెంచుకొని, ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో దళిత బంధు పథకం ప్రత్యేక అధికారి సురేష్, ఈడీ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం



వెంకటేశ్వర్‌రావు (ఫైల్)

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాది అన్నమరాజు వెంకటేశ్వరరావు(54) మృతికి జిల్లా కోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు సంతాపం తెలిపారు. ఆయన కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కోర్టు హాలులో సంతాప సమావేశం ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రం రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు, న్యాయవాదులు టి.వేణుగోపాల్, కనుకుల సంజీవరెడ్డి, బొడ్ల శ్రీనివాస్‌లు వెంకటేశ్వర్‌రావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. జిల్లా జడ్జి బి.ప్రతిమ మాట్లాడుతూ.. తొందరపాటు, ఆవేశంతో మనకు నష్టం జరగడంతోపాటు ఇతరులకు కూడా ఇబ్బందులు కలుగుతాయని చెప్పారు. అందరూ తొందరపాటును విడనాడాలని సూచించారు. వెంకటేశ్వర్‌రావు మృతికి సంతాపం తెలిపి, ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి సంతాపంగా న్యాయవాదులు సోమవారం విధులకు గైరాజరయ్యారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- పేపర్ లీకేజీపై ఎస్ఎఫ్ఐ డిమాండ్

కరీంనగర్: పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి శనిగరపు రజనీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారి గ్రూప్–1 నోటిఫికేషన్ విడుదల చేస్తే నిరుద్యోగులు ఎంతో సంతోషంగా కోచింగ్ సెంటర్లలో వేలకు వేల ఫీజులు చెల్లించి, సన్నద్ధమవుతున్నారని తెలిపారు. ప్రిలిమ్స్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ అవడం బాధాకరమన్నారు. ఈ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, ఇందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. నోటిఫికేషన్ రద్దు వల్ల నష్టపోయిన ప్రతీ నిరుద్యోగ అభ్యర్థికి నెలకు రూ.20 వేలు ఇవ్వాలన్నారు. సీఎం కేసీఆర్ స్పందించి, చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ ఎం.పూజ, జిల్లా అధ్యక్షుడు గజ్జెల శ్రీకాంత్, సహాయ కార్యదర్శి కాంపెల్లి అరవింద్, జిల్లా కమిటీ సభ్యులు రత్నం సురేష్, నాగుల శివ, నాయకులు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో ఆడ దూడలే జననం

- ప్రత్యేక వీర్యం ఒక డోస్ ధర రూ.850
- హుస్నాబాద్ డెయిరీ మేనేజర్ నాగయ్య



దూడలను పరిశీలిస్తున్న డెయిరీ మేనేజర్ నాగయ్య

చిగురుమామిడి: కోడెల నుంచి ప్రత్యేకంగా సేకరించిన వీర్యంతో పశువులకు కృత్రిమ గర్భధారణ చేయడం వల్ల కేవలం ఆడదూడలు మాత్రమే జన్మిస్తాయని హుస్నాబాద్ డెయిరీ మేనేజర్ చింతపూల నాగయ్య అన్నారు. ఈ సదవకాశాన్ని చిగురుమామిడి మండలంలోని కరీంనగర్ డెయిరీ పరిధిలో పని చేస్తున్న పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల అధ్యక్షులు సద్వినియోగం చేసుకుంటే రూ.10 వేల ప్రోత్సాహకం అందిస్తున్నట్లు తెలిపారు. సోమవారం గాగిరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని బొల్లోనిపల్లెలో కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన ఆడ దూడలను కరీంనగర్ డెయిరీ ప్రతినిధులు పరిశీలించారు. పాడి ఆవులకు కేవలం ఆడ జీవాలే జన్మించాలంటే ప్రత్యేక వీర్యం ఒక డోస్ ఖరీదు రూ.850 ఉంటుందన్నారు. ఇందులో రూ.450 డెయిరీ చెల్లిస్తుందని, మిగతా రూ.400 రైతు భరించాల్సి ఉంటుందని చెప్పారు. అన్నదాతలు వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమపై దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో బయాఫ్ ప్రోగ్రాం ఆఫీసర్ ముత్యంరెడ్డి, రూట్ సూపర్‌వైజర్ సీత రవి, డెయిరీ వెటర్నరీ అసిస్టెంట్ సురేశ్, బొల్లోనిపల్లె డెయిరీ అధ్యక్షుడు రాజేశం, కార్యదర్శి శ్రీను, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



శిబిరం ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీలత

కొత్తపల్లి: మండలంలోని మల్కాపూర్‌లో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ పిల్లి శ్రీలత మహేశ్ ప్రారంభించారు. రాష్ట్రంలో అంధత్వ నివారణే ధ్యేయంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మల్కాపూర్‌లో 16 రోజులు నిర్వహించి ఈ శిబిరంలో కంటి పరీక్షలు చేసుకోవాలని కోరారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, ఎంపీడీవో ఏ.శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ గొట్టె జ్యోతి, ఎంపీటీసీ పండుగ గంగవ్వ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షాబీర్ పాషా, శిబిరం ఇన్‌చార్జి వైద్యుడు శ్రీకాంత్, శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసారం శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన



మాట్లాడుతున్న ఏపీఎం భార్గవ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సోమవారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో డిజిటల్ లావాదేవీలపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డిజిటల్ చెల్లింపులు, బ్యాంకింగ్ విధానంపై డీపీఎం రమణ అవగాహన కల్పించారు. డిజిటల్ చెల్లింపులతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఉప సర్పంచ్ శేఖర్, ఏపీఎం భార్గవ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిపై ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సర్వే



సర్వే చేస్తున్న వలంటీర్లు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో నిర్వహిస్తున్న వాణినికేతన్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో భాగంగా సోమవారం యువతకు విద్య, ఉపాధిపై వలంటీర్లు ఇంటింటా సర్వే చేశారు. అనంతరం సాయంత్రం జరిగిన సమావేశంలో జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.పద్మ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి పెద్ది రమేశ్, అధ్యాపకులు రమణారెడ్డి, రవి, సునీత తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన



పోషకాహారంపై వివరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో సోమవారం పోషణ్ అభియాన్‌లో భాగంగా తల్లులు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు భాగ్య, పద్మలు మిల్లెట్‌ఫుడ్, పలు రకాల పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, డీఆర్‌డీఏ డీపీఎం రమేశ్, ఏపీఎం భార్గవ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా ప్యాడ్లు అందజేత



కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఎస్సెస్సీ విద్యార్థులకు సోమవారం హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. రాబోయే వార్షిక పరీక్షల్లో 9.8జీపీఏ నుంచి 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.2,016 నగదు బహుమతి అందిస్తామని హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అనిల్, సుమన్, ప్రధానోపాధ్యాయురాలు పద్మతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైన్స్‌పై పట్టు సాధిస్తాం



- బయోసైన్స్‌పై ఆసక్తి
- భావి శాస్త్రజ్ఞులుగా మారుతామంటున్న విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదనే సామెతకు తగ్గట్టుగా మాకు సైన్స్ అంటే ఇష్టం..ఫిజికల్ సైన్స్ అయితేనేం.. బయోసైన్స్ అయితేనేం.. మాకు రెండు ఇష్టమే. ముఖ్యంగా బయో సైన్స్‌లో పట్టు సాధించి ప్రయోగాలు చేసి భావిశాస్త్రజ్ఞులుగా ఎగగాలనేదే మా లక్ష్యమంటున్నారు జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు. ఇటీవల కాలంలో సైన్స్‌పై విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా పలు సంస్థలు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భవిష్యత్‌లో దేశానికి అబ్దుల్ కలాం లాంటి గొప్ప సైనికులను అందించాలన్న లక్ష్యంతో విద్యార్థులు ముందుకు వెళ్తున్నారు. అందులో భాగంగానే బయోసైన్స్ ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లోని సాయి మానేరు పాఠశాల ఆవరణలో జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల 9వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో సుమారు 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సైన్స్‌ను బాగా చదువుతున్నాం.. సైన్స్‌లో గొప్ప వ్యక్తులుగా ఎదుగాలనుకుంటున్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను 'సాక్షి' పలకరించగా తమ మనోభావాలను వెల్లడించారు.

ఫస్ట్ ప్లేస్ కొట్టాం



బయో సైన్స్ ఆధ్వర్యంలో తొలిసారిగా జిల్లాస్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో మొదటి బహుమతి సాధించాం. సంతోషంగా ఉంది. సైన్స్‌లో క్విజ్ ఎలా ఉంటుందో తెలిసుకున్నాం. క్విజ్ కోసం సైన్స్‌ను బాగా చదివాం. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న. 10వ తరగతి పూర్తి అయ్యే లోపు గొప్ప ప్రయోగాలు చేస్తా.

– ఎం ఆదిత్య, టీఎస్ మోడల్ స్కూల్, గంగాధర

సైన్స్‌పై ఆసక్తి కలిగించేలా..



సైన్స్ క్విజ్ మమ్ముల్ని సైన్స్‌పై ఆసక్తి పెంచేలా చేసింది. క్విజ్‌కు ముందు మూడు రోజులు బాగా ప్రిపేర్ అయ్యాం. పోటీల్లో నాల్గోవ స్థానం వచ్చాం. వచ్చే సంవత్సరం మా స్థానాన్ని మెరుగుపరుకుంటాం. క్విజ్‌లో కొత్తకొత్త విషయాలు నేర్చుకున్నాం. సమాజానికి ఉపయోగపడే ప్రయోగాలు చేయాలనేది నా కోరిక.

– రోహిత్ కుమార్, టీఎస్ మోడల్ స్కూల్, శంకరపట్నం

బయోసైన్స్‌లో ప్రదర్శనలు



బయోసైన్స్‌లో పదో తరగతిలో ప్రయోగాలు చేయాలని ఉంది. తొలిసారిగా జరిగిన క్విజ్ పోటీలకు హాజరయ్యా. ఫస్ట్ రౌండ్‌లో బాగా రాణించిన మా టీం సెకండ్ రౌండ్‌కు అర్హత సాధించింది. సైన్స్‌లో బాగా రాణించి ఇంటర్‌లో మెడికల్ సీట్ కొట్టి డాక్టర్ వృత్తిని చేపట్టాలని ఉంది.

– పి.స్నేహ, జెడ్పీహెచ్ఎస్, నగునూర్

ప్రయోగాలు చేసి డాక్టరవుతా..



సైన్స్ అంటే ఇష్టం. అందులో బయోసైన్స్ అంటే చాలా. క్విజ్ పోటీల్లో మా టీం థర్డ్ ప్లేస్ వచ్చింది. హ్యాపీగా ఉంది. భవిష్యత్‌లో ప్రజలకు ఉపయోగపడే పెద్ద ప్రయోగాలు చేయాలని ఉంది. డాక్టర్ కావడం నా కల. క్విజ్‌తో ఎన్నో నేర్చుకున్న. ఇలాంటి క్విజ్‌లు ఏటా నిర్వహించాలి.

– టి.వర్షిణి, ప్రభుత్వ పాఠశాల, ధన్గర్‌వాడీ

విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు..



విద్యార్థుల్లో బయోసైన్స్‌పై ఆసక్తిని పెంచేందుకు తొలిసారిగా క్విజ్ పోటీలు నిర్వహించాం. మంచి స్పందన వచ్చింది. ప్రతీ విద్యార్థి సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలనేది మా ధ్యేయం. 180 మంది విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొనడం విశేషం. వచ్చే సంవత్సరం కూడా పోటీలు నిర్వహిస్తాం.

– సీహెచ్. శ్రీనివాస్, బయోసైన్స్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి

మిల్లెట్స్.. విటమిన్స్..

- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా విస్తృత ప్రచారం



చామనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజరు నిర్మల

కరీంనగర్‌రూరల్: ఒకప్పుడు పేదల ప్రధాన ఆహారమైన మిల్లెట్స్ ఇప్పుడు ఆరోగ్యపరంగా అందరికీ అవసరమయ్యాయి. దశాబ్దకాలంగా వాటికి దూరంగా ఉండి కోల్పోతున్నదేమిటో గుర్తించిన ప్రభుత్వాలు వాటికి విస్తృత ప్రచారం కల్పిస్తున్నాయి. భారత ప్రభుత్వ విజ్ఞప్తితో ఐక్యరాజ్య సమితి 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడాలో మిల్లెట్స్ ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

20 నుంచి పోషణ్ పక్వాడ పక్షోత్సవ్

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి ఏప్రిల్ 3వరకు పోషణ్ పక్వాడ పక్షోత్సవ్ కార్యక్రమం చేపట్టారు. 15రోజులపాటు రోజుకో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నారు. కరీంనగర్ మండలంలోని 17 గ్రామాల పరిధిలోని 27 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రధానంగా సిరిధాన్యాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. సాధారణంగా వినియోగించే బియ్యంతో పాటు గోధుమలు, సజ్జలు, రాగులు, జొన్నలు, కొర్రలు తదితర వాటిల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. సిరిధాన్యాలను తినడం ద్వారా అనేక విటమిన్లు, ప్రొటీన్లు, ఖనిజ, లవణాలు లభిస్తాయని ప్రచారం చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా మంగళవారంతో పాటు ఏప్రిల్ 3న మిల్లెట్స్‌పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టారు. మిల్లెట్స్‌తో పలు రకాల వంటలు చేసి వాటిల్లోని పోషకాలను వివరిస్తారు.

అవగాహన కల్పిస్తున్నాం

మిల్లెట్స్‌పై అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పిస్తున్నాం. తల్లులు, గర్భిణులు, చిన్నారులకు మిల్లెట్స్‌లో ఉండే పోషక విలువలను వివరిస్తున్నాం. మిల్లెట్స్‌తో వివిధ రకాల వంటలు చేయడంపై పోటీలు నిర్వహించి అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాం.

– బి.ఉమారాణి, సీడీపీవో, కరీంనగర్‌అర్బన్ ప్రాజెక్టు

పుస్తకాలతో పాటు ప్రపంచాన్ని చదవండి

- అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



మాట్లాడుతున్న శ్యాంప్రసాద్‌లాల్

సప్తగిరికాలనీ(కరీంనగర్): విద్యార్థులు పుస్తకాలతో పాటు ప్రపంచాన్ని చదవాలని, అప్పుడే మేధస్సు వికసిస్తుందని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. సోమవారం తెలంగాణ బయోసైన్స్ ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని మానేరు పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల్లోని 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన జీవశాస్త్ర క్విజ్ పోటీల బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే విద్యాసంవత్సరంలో రాష్ట్రస్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించేలా కార్యక్రమం నిర్వహించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్. జనార్దన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు తరుచుగా క్విజ్ లాంటి పోటీలు నిర్వహించడంతో భవిష్యత్‌లో వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కాగా క్విజ్‌పోటీల్లో 45 పాఠశాలల నుంచి 180 మంది విద్యార్థులు, 45 మంది గైడ్ టీచర్లు హాజరైనట్లు బయోసైన్స్ ఫోరం జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్ అనంతాచార్య, సీహెచ్.శ్రీనివాస్‌లు తెలిపారు. మొదటి బహుమతి టీఎస్ మోడల్ స్కూల్ గంగాధర, రెండో బహుమతి టీఎస్ మోడల్ స్కూల్ ఎలగందల్, మూడో బహుమతి ధన్గర్‌వాడీ ప్రభుత్వ పాఠశాల సాధించిందన్నారు. విద్యార్థులకు నగదు పురస్కారాలను విజన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి స్వదేశ్‌కుమార్, సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి అశోక్‌రెడ్డి, ఎస్సార్ కళాశాల ప్రిన్సిపాల్ కలువకుంట్ల రామకృష్ణ, వేణుగోపాల్‌రెడ్డి, అంజనేయులు, మనోహర్‌రెడ్డి, గాజుల రవీందర్, మాడిశెట్టి గోపాల్, శ్రీనివాస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం



కరీంనగర్‌స్పోర్ట్స్: సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అరుణ యోగ శిక్షణ కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ స్టేడియంలో జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న యోగా శిక్షణ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో నిర్వహణ అధికారి రాపల్లి శ్రీనివాస్, సెక్టోరల్ ఆఫీసర్ అశోక్‌రెడ్డి, ఎంఈఓ మధుసూదనాచారి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి పోతన శ్రీనివాస్, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు అంతడ్పుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎండీ యూనిస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పోకడలపై అవగాహన అవసరం

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కూమార్
- మధుపాళీ వ్యాసతోరణం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్‌కల్చరల్: సమకాలీన సమస్యలకు సంబంధించిన రచయితలకు ఆధునిక పోకడలపై లోతైన అవగాహన ఉండడం కనీస అవసరమని, అప్‌డేట్ కానప్పుడు అవుట్‌డేట్ కావల్సిందే అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి వాగేశ్వరి డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం నేతృత్వంలో డా.బుర్ర మధుసూదన్‌రెడ్డి రచించిన 14వ గ్రంథం 'మధుపాళీ వ్యాసతోరణం' పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పుస్తకంలో పొందుపర్చిన 127 వ్యాసాలు నేటి యువతకు, ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉపయోగపడతాయని తెలిపారు. అన్ని వర్గాల విద్యాధికులకు పలు అంశాలపై పూర్తి అవగాహన కలుగుతుందన్నారు. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు–2030ను అధ్యయనం చేసి సవివరంగా 16 వ్యాసాలు పొందుపర్చడం సముచితంగా ఉన్నదని తెలిపారు. ప్రముఖ కవి దాస్యం సేనాధిపతి అధ్యక్షతన జరిగిన గ్రంథ ఆవిష్కరణలో సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ప్రముఖ విద్యావేత్త ఆనందరావు, ఆత్మీయ అతిథి బీవీఆర్ గోపాల్‌రెడ్డి, పుస్తక పరిచయకర్త నంది శ్రీనివాస్, పుస్తక రచయిత బుర్ర మధుసూదన్‌రెడ్డి, బొమ్మకంటి కిషన్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువుకు నామకరణం



శిశువుకు నామకరణం చేస్తున్న జెడ్పీ సీఈవో

కరీంనగర్: కరీంనగర్‌లోని శిశు గృహకు అప్పగించిన నవజాత శిశువు పుట్టి 21రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో జెడ్పీ సీఈవో ప్రియాంక సోమవారం బాలికకు నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సబితా కుమారి, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, సభ్యులు రేండ్ల కళింగ శేఖర్, రాధ, సీడీపీవోలు ఉమారాణి, కస్తూరి, డీసీపీఓ శాంత, శిశుగృహ మేనేజర్ పద్మ, బాలసదనం సూపరింటెండెంట్ సంతోషి, రమేశ్, రాజేశ్ కన్నా, రమ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్‌నగర్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం

- మేయర్ సునీల్‌రావు



భూమిపూజ చేస్తున్న మేయర్ వై.సునీల్‌రావు

కరీంనగర్‌సిటీ: పేద, మధ్య తరగతి ప్రజలు అధికంగా నివసించే కిసాన్‌నగర్ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మేయర్ సునీల్‌రావు అనానరు. సోమవారం 25వ డివిజన్‌లో పర్యటించి కిసాన్‌నగర్‌లో రూ.8.60 లక్షల నిధులతో చేపట్టిన ఎస్‌డబ్ల్యూజీ డ్రెయినేజీ పైపులైన్ పనులకు భూమిపూజ చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. డివిజన్‌లోని పలు కాలనీల్లో ఇరుకు గల్లీలు ఉండటంతో ఓపెన్ డ్రెయినేజీలతో ప్రమాదాలు జరిగాయని, స్థానిక ప్రజలు, కార్పొరేటర్ తమ దృష్టికి తెచ్చిన వెంటనే ఎస్‌డబ్ల్యూజీ డ్రెయినేజీ పైపులైన్‌తో క్లోజ్ చేసి అంతర్గత రోడ్ల విస్తరణ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎడ్ల సరిత అశోక్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న డైరెక్టర్లు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్ సింగిల్‌విండో చైర్మన్ ఎన్నికను నిర్వహించాలని డిమాండ్ చేస్తూ డైరెక్టర్లు ఆందోళన చేపట్టారు. సోమవారం ఇన్‌చార్జి చైర్మన్ గోనె నర్సయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సింగిల్‌విండో కార్యవర్గ సమావేశాన్ని డైరెక్టర్లు బహిష్కరించారు. చైర్మన్ ఎన్నిక కోసం తీర్మాణం చేసి మూడు నెలలవుతున్నప్పటికీ ఎన్నిక నిర్వహించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. వెంటనే నిబంధనల ప్రకారం చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు తోట తిరుపతి, బిజిలి పోశాలు, కుంభం అంజలి శ్రీనివాస్‌రెడ్డి, ఎర్ర అంజమ్మ, గాండ్ల అంజయ్య, గాజుల అంజయ్య, సంకరి శేఖర్, వేల్పుల రమేశ్, దాడి లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంచుకోవాలి



యోగా మాస్టర్ సంపత్‌కుమార్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

కరీంనగర్‌రూరల్: వలంటీర్లు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని యోగా మాస్టర్ డాక్టర్ సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో ఎస్సారార్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో భాగంగా యోగాపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాటాల్డారు. వలంటీర్లు మనోధైర్యాన్ని అలవరుచుకోవాలన్నారు. దేశసంస్కృతి పరిరక్షణకు వలంటీర్లు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్ సత్యనారాయణ, వార్డుసభ్యులు తోట కిరణ్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో శారద, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజస్తాన్ వైద్యుల పోరాటానికి సంఘీభావం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఎంఏ సభ్యులు

కరీంనగర్‌టౌన్: రాజస్తాన్ రాష్ట్రంలో వైద్యుల పోరాటానికి సంఘీభావం ప్రకటిస్తున్నట్లు ఐఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాంకిరణ్, వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన అత్యవసర సమావేశంలో మాట్లాడారు. రాజస్తాన్ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ఆరోగ్య హక్కు చట్టంపై సరైన మార్పులు చేసి పూర్తి అవగాహన కల్పించి అమలు చేయాలని లేకుంటే చట్టంను వెనక్కి తీసుకోవాలని అన్నారు. రాజస్తాన్ వైద్యులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. వారి పోరాటాలకు సంఘీభావంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఐఎంఏ సభ్యులు భాగ్యరెడ్డి, జగన్‌మోహన్‌రావు, రాజేందర్, మోహన్‌రెడ్డి, శ్రీలత, హిమబిందు, కృష్ణమూర్తి, అలీం, మహేష్ బాబు, సురేశ్, దామోదర్, శ్రీధర్, దిల్జీత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



కరీంనగర్‌కల్చరల్: మార్కెట్ రోడ్డులోని వేంకటేశ్వర ఆలయం హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రూ.1,96,842 ఆదాయం సమకూరినట్లు ఈవో ఉడుతల వెంకన్న తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన హుండీ లెక్కింపులో ఆలయ ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, సిబ్బంది మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో అల్ఫోర్స్ విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి

కొత్తపల్లి: టాస్క్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జెన్‌పాక్ట్ కంపెనీ జాబ్‌మేళాలో కరీంనగర్ సీతారాంపూర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎం.సిరిచందన, ఎస్.శ్రావణి, ఆర్.సాహితిలు ఎంపికైనట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులను సోమవారం అభినందించి మాట్లాడుతూ టాస్క్ నిర్వహిస్తున్న శిక్షణతో పాటు ప్రథమ సంవత్సరం నుంచే విద్యార్థినులకు ప్రత్యేక నైపుణ్య తరగతుల ద్వారా ప్రతిభావంతులుగా తయారు చేయడం వల్లనే వివిధ దేశీయ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికవుతున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్, టీపీవో డా.బి.విజయలక్ష్మి, టాస్క్ సమన్వయకర్త ఎ.గంగాప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



కరీంనగర్ అర్బన్: వారంతా అధికారులు, ఉద్యోగులు కానీ చిన్న పిల్లల్లా కలిసి ఆడారు.. పాడారు.. చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకుంటూ చిలిపిచేష్టల కవ్వింపుల తలపోస్తూ సందడి చేశారు. హోలీ ఏంజిల్స్ పాఠశాల 1994–95 పదోతరగతి విద్యార్థులు నగరంలోని మైత్రీ హోటల్ వేదికగా సమ్మేళనం నిర్వహించారు. అనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులను సన్మానించారు. అనంతరం మిత్రుడు సదానందం కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న క్రమంలో అతడి సోదరి వివాహానికి రూ.2,50,000 అందజేశారు. స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతమంటూ కాలు కాలు కదిపి కడదాకా తోడుండాలని తీర్మాణించారు. కరస్పాండెంట్ మల్లారెడ్డి, అధ్యాపక బృందం, ట్రాన్స్‌కో ఏడీ స్వప్న, బాల్క సుమన్ పీఏ కనపర్తి మనోహర్‌రావు, ఎల్ఐసీ ఏవో గోపికృష్ణ, చంద్రమోహన్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఎప్పటిలోగా చెల్లిస్తారు?

ఆర్టీసీని నివేదిక కోరిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగుల సహకార పరపతి సంఘానికి (సీసీఎస్) బకాయిపడ్డ మొత్తంలో ఇప్పటివరకు ఎంత చెల్లించారు.. మిగతాది ఎప్పటిలోగా చెల్లిస్తారో వచ్చే సోమవారంలోగా నివేదికను అందజేయాలని ఆర్టీసీని హైకోర్టు ఆదేశించింది. సీసీఎస్‌కు జమ చేయాల్సిన నిధులను సంస్థ సొంతానికి వాడేసుకోవడంతో వడ్డీ సహా రూ.900 కోట్ల బకాయిలు ఏర్పడ్డాయి. ఫలితంగా ఉద్యోగులకు ఈ సంఘం ద్వారా మంజూరు చేయాల్సిన రుణాలు ఆగిపోయాయి. దీంతో బకాయిల్లో కొంతమొత్తం చెల్లించాలని ఎప్పట్నుంచో ఆ సంఘం కోరుతున్నా ఆర్టీసీ నుంచి స్పందన లేకపోవడంతో సీసీఎస్ ఇటీవలే హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

సాయుధ పోరాటం తెలియని మూర్ఖులు బీజేపీ నాయకులు


నారాయణ

సాక్షి, మహబూబాబాద్: తెలంగాణ సాయుధ పోరాటం గురించి తెలియని మూర్ఖులు బీజేపీ నేతలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అమరుల స్తూపాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం 59జీఓ ద్వారా అత్యధిక డబ్బులు చెల్లించాల్సి వస్తున్న పేదల గుడిసెలను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే సాయుధ పోరాట యోధుల దినోత్సవాన్ని నిర్వహిస్తామని బీజేపీ చెప్పడం హాస్యాస్పదమన్నారు.

ప్రెజర్‌బాంబు పేలి జవాన్ మృతి


విజయ్ యాదవ్ (ఫైల్)

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబు పేలి యూపీకి చెందిన జవాన్ మృతి చెందాడు. బీజాపూర్ జిల్లా బైరంగఢ్ పీఎస్ పరిధిలోని తిమ్నార్ సీఏఎఫ్ క్యాంపుజవాన్లు అడవిలో సోమవారం కూంబింగ్ చేపడుతుండగా కాస్త దూరంలో మావోయిస్టులు ప్రెజర్ బాంబు అమర్చారు. దీన్ని గమనించకుండా సీఏఎఫ్ అసిస్టెంట్ ప్లాటూన్ కమాండర్ విజయ్ యాదవ్ కాలు వేయడంతో బాంబు పేలింది. ఆయన్ను క్యాంపునకు తరలిస్తుండగా మధ్యలోనే మృతి చెందాడు.


మహాభారత యుద్ధం చిత్రాలు


గ్రేటర్ వరంగల్ నగరంలోని మోడల్ హిందూ వైకుంఠధామం వ్యూ

అల..వైకుంఠధామంలో..

పచ్చని గ్రీనరీ.. ఆహ్లాద వాతావరణం • భగవద్గీతలాంటి ఆధ్యాత్మిక గ్రంథాలతో లైబ్రరీ

- విశాలమైన 4.20 ఎకరాల స్థలం
- చుట్టూ సీసీ కెమెరాలు, ప్రహరీకి సోలార్ ఫెన్సింగ్
- స్మార్ట్ సిటీలో మోడల్‌వైకుంఠధామం
- మహిళా సంఘాలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించే అవకాశం


భారీ శివుడి విగ్రహం


వైకుంఠధామంలో లోపల పచ్చని చెట్లు

వరంగల్ డెస్క్: పచ్చటి గ్రీనరీ.. ఐటీ హబ్‌ను తలపించే ముఖద్వారం.. లోపలికి అడుగుపెట్టగానే స్వాగతం పలికే.. వివిధ రకాల కడియం పూల అందాలు.. ఆధ్యాత్మికతను తలపించే శివుడి భారీ విగ్రహం.. కొంచెం లోపలికి వెళ్తే.. సేద దీరేందుకు చెట్లకింద రచ్చబండలు.. విశాలమైన పార్కింగ్ సదుపాయం.. గ్రీనరీ నడుమ అక్కడక్కడ నిర్మాణాలు.. ఇదేదో ఆలయమో.. లేదా సేద దీరే పార్క్ అనుకుంటున్నారా.. కాదండోయ్ స్మార్ట్ సిటీ అయిన వరంగల్ నగరంలోని మోడల్ వైకుంఠధామం. మనిషి చనిపోయాడన్న దుఃఖంతో వచ్చిన వారికి ఆ బాధనుంచి కాస్త ఉపశమనం కలిగేలా అన్ని హంగులు, ఆధునిక సొబగులతో తీర్చిదిద్దారు. నగరంలోనే ఇది మొదటి మోడల్ హిందూ వైకుంఠధామం.

మోడల్ డివిజన్‌లో.. మోడల్ వైకుంఠధామం

వరంగల్ నగరంలోని 57వ డివిజన్‌ను మోడల్ డివిజన్‌గాఎంపిక చేశారు. ఈ డివిజన్ పరిధిలోని వాజ్‌పేయి కాలనీలో పాత శ్మశాన వాటికను మోడల్ వైకుంఠధామంగా ఎంపిక చేశారు. సీఎంఏ నిధులు రూ.4.50 కోట్లతో 2.20 ఎకరాల విస్తీర్ణంలో తీర్చిదిద్దారు. ముఖద్వారం నుంచి నేరుగా లోపలికి వెళ్లేలా దారులు.. ఆ దారుల చుట్టూ కడియం పూల మొక్కలు.. పచ్చటి గ్రీనరీని పెంచారు. బర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లకు వెళ్లే దారిలో సత్యహరిశ్చంద్రుడి జీవిత చరిత్రను చిత్రాలతో పొందుపరిచారు. మరోవైపు మహాభారత యుద్ధ సన్నివేశాన్ని కూడా చిత్రాలతో పొందుపర్చారు. ఇక మనిషికి అవసరమైన నీరు, భూమి, గాలి, అగ్ని, నిర్మలమైన ఆకాశం.. పంచభూతాలను ఒకే దగ్గర కల్పించడం అన్న కాన్సెప్ట్‌తో ఈ వైకుంఠధామాన్ని నిర్మించారు.

పురాతన గ్రంథాలతో లైబ్రరీ

ఈ వైకుంఠధామంలో లైబ్రరీని ఏర్పాటు చేశారు. అందులో భగవద్గీత, మహాభారతంలాంటి గ్రంథాలను అందుబాటులో ఉంచనున్నారు.

నిర్వహణ బాధ్యతలు అప్పగించేందుకు కమిటీ ఏర్పాటు

మోడల్ వైకుంఠధామం నిర్వహణ బాధ్యతలను అప్పగించేందుకు కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం మృతదేహాల దహనం బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించాలని నిర్ణయించారు. మృతదేహాన్ని తీసుకురావడం నుంచి వైకుంఠరథం, పూలు, కర్రలు, దహనం వరకు అన్ని కార్యక్రమాలను వారి నిర్వహణలో చేయాలని భావిస్తున్నారు. ఇక మిగతా గ్రీనరీ బాధ్యతలను ఉద్యానవనశాఖ, ఎలక్ట్రికల్‌ను ఎలక్ట్రికల్ విభాగం, సివిల్ పనులు.. సివిల్ విభాగానికి కేటాయించనున్నారు. ఒక డెడ్‌బాడీ దహనానికి ఎంత చార్జ్ చేస్తారనేది ఇంకా నిర్ణయించాల్సి ఉంది. దీనిని త్వరలో రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మోదీ విధానాలు ప్రమాదకరం


కూనం నేని

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: దేశంలో ప్రస్తుతం చీకటి యుగం నడుస్తోందని.. స్వాతంత్ర్యం కంటే ముందు, ఆ తర్వాత కూడా ఇలాంటి పరిస్థితులు లేవని, బీజేపీ విధానాల కారణంగానే ఇలాంటి దుర్భర పరిస్థితులు దాపురించాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రతిపక్షాల గొంతు నొక్కడానికే ప్రధాని ప్రయత్నిస్తున్నారని, ప్రభుత్వ విధానాలను తప్పుబట్టే నేతలపై నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మోదీ విధానాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ప్రతిపక్షం చెప్పింది వినకూడదనే ధోరణితో బీజేపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందన్నారు.

బీజేపీని అధికారంలోకి రానివ్వబోం


తమ్మినేని

నల్లగొండ: తెలంగాణలో బీజేపీని అధికారంలోకి రానివ్వబోమని, బీజేపీని అడ్డుకునేందుకు లౌకిక, ప్రజాస్వామిక శక్తులను కలుపుకుపోతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్యయాత్ర సోమవారం నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, నకిరేకల్, చిట్యాలలో సాగింది. ఈ సందర్భంగా ఆయా చోట్ల తమ్మినేని మాట్లాడుతూ మునుగోడు శాసనసభ ఉపఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీలతో బీఆర్ఎస్ పార్టీ కలిసి పనిచేసి విజయం సాధించిన తర్వాత సీఎం కేసీఆర్ ఇప్పటికే పలు బహిరంగసభల్లో కమ్యూనిస్టులతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారని చెప్పారు. రాజ్యాంగ విరుద్ధంగా రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని కేంద్రం రద్దుచేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కేంద్రం రాజ్యాంగ పద్ధతులను మార్చి పాలన సాగిస్తోందన్నారు.

సంగారెడ్డిలో యూనివర్సిటీ ఏర్పాటు చేయండి

సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే జగ్గారెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం సీఎం కేసీఆర్‌కు ఆయన లేఖరాశారు. 'సంగారెడ్డి జిల్లా కేంద్రానికి ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న 8 నియోజకవర్గాల నుంచి విద్యార్థులు వస్తారు. మెదక్‌తో పాటు తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాలకు చెందిన వారు కూడా వస్తారు. సంగారెడ్డిలోని తారా డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం ఆ విద్యార్థులు పీజీ వరకు చదువుకుంటున్నారు. ఆ తర్వాతి చదువులకు మాత్రం హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోంది. హైదరాబాద్ వెళ్లాల్సి రావడంతో కొందరు విద్యార్థులు పీహెచ్‌డీ, ఇతర కోర్సులు చేయలేక మానేస్తున్నారు. తారా డిగ్రీ కళాశాలలో 40 నుంచి 50 ఎకరాల వరకు స్థలం కూడా ఉంది. ఆ స్థలం యూనివర్సిటీకి సరిపోతుంది. సంగారెడ్డిలో యూనివర్సిటీ డిమాండ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి కూడా బాగా వినిపిస్తోంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని వీలున్నంత త్వరలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరుతున్నా'అని సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖలో జగ్గారెడ్డి కోరారు.

లక్ష రుణ మాఫీ ఏదీ..

భువనగిరిలో మంత్రిని నిలదీసిన రైతు


రైతు రుణమాఫీ ఎప్పుడు అమలు చేస్తారని మంత్రి జగదీశ్‌రెడ్డిని ప్రశ్నిస్తున్న రైతు హరినాథ్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: సీఎం కేసీఆర్ లక్ష రుణమాఫీ ప్రకటించారు..ఇంకా అమలు కాలేదు..ఎప్పుడు చేస్తారని యాదాద్రి భువనగిరి జిల్లా హుస్నేనాబాద్‌కు చెందిన రైతు భీరెడ్డి హరినాథ్‌రెడ్డి విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిని ప్రశ్నించారు. సోమవారం భువనగిరిలో రైతు సేవా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం మహాజన సభలో ప్రసంగించి వేదిక నుంచి దిగుతుండగా రైతు మంత్రి దగ్గరకు వెళ్లి ప్రశ్నించారు. మొన్ననే రూ.లక్ష రుణమాఫీ చేశామని మంత్రి సమాధానమిస్తూ ముందుకు సాగారు. అయితే..రుణమాఫీ విషయాన్ని మైకులో చెప్పాలని రైతు కోరగా..మంత్రి నుంచి స్పందన రాలేదు. దీంతో రైతు హరినాథ్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ..సమస్యలు అడిగితే మంత్రి విసుక్కుంటున్నారని, ప్రశ్నిస్తే ప్రతిపక్షం అంటున్నారని మండిపడ్డాడు.

అక్కడ ఆ పథకాలు అమలైతే | రాజకీయ సన్యాసం

సవాల్ విసిరిన స్పీకర్ పోచారం

- తెలంగాణ తరహా సంక్షేమ పథకాలు బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలవుతున్నాయా అని ప్రశ్న?


మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు బీజేపీ, కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో అమలవుతున్నట్లు చూపిస్తే తాను రాజకీయ సన్యాసం చేస్తానని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సవాలు విసిరారు. సోమవారం రాత్రి కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. తాను స్పీకర్ హోదాలో రాలేదని, ఒక ఎమ్మెల్యేగా సమ్మేళనానికి వచ్చానన్నారు. దేశంలోని బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చూపిస్తే వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయనన్నారు. ఇటీవల బాన్సువాడకు వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తనపై, తన కుటుంబ సభ్యులపై చేసిన అనుచిత వ్యాఖ్యలు చాలా బాధించాయన్నారు. 'హైదరాబాద్‌లో భూ కబ్జాలకు పాల్పడే వ్యక్తి, ఓ బడా చోర్, నీ వెంట బాన్సువాడలో ఉన్న చోటా దొంగలు కలిసి ఆరోపణలు చేయడం సిగ్గు చేటని'ధ్వజమెత్తారు. తనపై, తన కుమారులైన పోచారం సురేందర్‌రెడ్డి, పోచారం భాస్కర్‌రెడ్డిలపై ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని, వెంట పడి తరుముతామని హెచ్చరించారు. స్వచ్ఛమైన జీవితం నుంచి వచ్చానని, అవసరమైతే బిచ్చమెత్తుకుంటా కానీ తప్పు చేయనని స్పీకర్ పోచారం కన్నీరు పెట్టుకున్నారు.

యాదాద్రి తరహాలో 'అడెల్లి' ఆలయ నిర్మాణం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- రూ.6.60 లక్షలతో గర్భగుడి, అర్ధమండపం పనులకు భూమిపూజ


అమ్మవారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

సారంగపూర్: యాదాద్రి ఆలయం తరహాలోనే అడెల్లి మహాపోచమ్మ ఆలయాన్ని కృష్ణ శిలలతో పునర్నిర్మిస్తామని రాష్ట్ర దేవాదాయ, న్యాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం అడెల్లిలో ఆలయ పునర్నిర్మాణ పనులకు సోమవారం భూమిపూజ చేశారు. ఐకేరెడ్డికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. గర్భగుడిలో అమ్మవారి విగ్రహం తప్ప మిగతా వాటిని పునర్నిర్మిస్తామని తెలిపారు. యాదాద్రి తరహాలోనే మాస్టర్ ప్లాన్ మేరకు పనులు జరుగుతాయని పేర్కొన్నారు. మొత్తం రూ.15 కోట్లతో ఆలయ పునర్నిర్మాణానికి అంచనాలు రూపొందించామని చెప్పారు. గర్భగుడి అర్ధమండప నిర్మాణాలకు రూ.6.60 లక్షలు, రాజగోపురానికి రూ.కోటి, ఆలయం చుట్టూ ఫ్లోరింగ్‌కు రూ.60 లక్షలు, వసతి గదుల నిర్మాణానికి రూ.40 లక్షలు, కోనేరు అభివృద్ధికి రూ.40 లక్షలు, దుకాణ సముదాయ నిర్మాణానికి రూ.కోటి కేటాయించినట్లు వివరించారు. ఆలయ పునర్నిర్మాణం త్వరగా పూర్తి చేసే దిశగా అధికారులు, పాలకమండలి సభ్యులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక ఆలయాలకు మహర్దశ వచ్చిందన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా రూ.144 కోట్లతో 811 దేవాలయాల అభివృద్ధికి ఖర్చు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, అడెల్లి ఆలయ కమిటీ అధ్యక్షుడు అయిటి చందు, స్థానిక సర్పంచ్ సుచరిత రాజేశ్వర్‌రావు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్ల వెంకట్రామిరెడ్డి, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల మురళీధర్‌రెడ్డి, ఆలూరు, కొట్ల(బి) పీఏసీఎస్ అధ్యక్షులు మాణిక్‌రెడ్డి, అయిర నారాయణరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక దోపిడీ చేస్తున్న బీజేపీ

- రైతు కూలీల హక్కులను హరించడం అప్రజాస్వామికం
- టీఎస్‌పీఎస్సీ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి


బీకేఎంయూ రాష్ట్ర విస్తృత కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి

కరీంనగర్: బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక రైతులు, కూలీల హక్కులను హరిస్తూ.. చట్టాలను మారుస్తూ ఆర్థిక దోపిడీకి గురి చేస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత కౌన్సిల్ ముగింపు సమావేశానికి సోమవారం చాడ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను నొక్కుతూ ప్రతిపక్షాలు లేకుండా చేయాలనే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని, వ్యవసాయ అనుబంధ కూలీల హక్కులకు రక్షణ లేకుండా పోతోందని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం ఈజీఎస్ పథకానికి 30,500 వందల కోట్లు కుదించారని.. ఇది పేదల ప్రభుత్వమా లేక కార్పొరేట్ల ప్రభుత్వమా అర్థం కావడం లేదని ఆరోపించారు. అట్టడుగు వర్గాల హక్కుల సాధనకు వారి రక్షణ కోసం దేశంలో సమాచార హక్కు చట్టం, అటవీ భూముల హక్కుల చట్టం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, రెవెన్యూ చట్టం తీసుకురావడంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమైందని అన్నారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడిచే బీజేపీ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని, విదేశాల్లో దాచుకున్న డబ్బులను వెనక్కి తీసుకొస్తానని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, దేశ ప్రజలందరికీ అచ్చేదిన్ వస్తుందని మోదీ ఏం చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పగించేందుకు బీజేపీ పూనుకుంటోందన్నారు. రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు కార్మికులు, కర్షకులు ఏకం కావాలని చాడ పిలుపునిచ్చారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని.. ఉద్యోగాలు కరువయ్యాయని అన్నారు. రాష్ట్రంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో జరిగిన లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జి ద్వారా సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇండ్లు లేని నిరుపేదలందరికీ స్థలాలు ఇవ్వాలని, ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని, రేషన్ కార్డు లేని ప్రతీ నిరుపేద కుటుంబానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీకేఎంయూ జాతీయ ప్రధాన కార్యదర్శి గుల్జార్ సింగ్ గోరియా, జాతీయ కార్యవర్గ కౌన్సిల్ సభ్యులు టి.వెంకట్రాములు, మోతె లింగారెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కలకొండ కాంతయ్య, నక్క బాల మల్లేశ్, సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం ఆఫీస్ బేరర్స్ కొయ్యడ సృజన్ కుమార్ పాల్గొన్నారు.

రాములోరి తలంబ్రాలకు స్పందన


తలంబ్రాల రశీదు అందిస్తున్న మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు(ఫైల్)

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ లాజిస్టిక్ ద్వారా భద్రాచలం రాములవారి తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేసేందుకు చేపట్టిన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కల్యాణానికి వెళ్లలేని భక్తులు తలంబ్రాలను అందుకునేందుకు ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా లాజిస్టిక్స్ కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దేవాలయాలు, ఇతరత్రా చోటుకు వెళ్లి ఆర్టీసీ యాజమాన్యం తలంబ్రాల పంపిణీపై విస్తృత ప్రచారం చేపట్టింది. ఇందులో భాగంగా రూ.116 చెల్లించి తమ వివరాలు నమోదు చేయించుకుని రశీదు పొందితే ఇంటి వద్దకే రాముల వారి తలంబ్రాలను అందించనుంది.

ఈ నెల 17 నుంచి బుకింగ్‌లు..

ఉమ్మడి జిల్లాలోని ఆరు డిపోల్లో రాములోరి తలంబ్రాల బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 26న ఒకే రోజు 438 బుకింగ్ చేశారు. ఇందులో రీజియన్ వారీగా చూస్తే మంచిర్యాల మొదటి స్థానంలో నిలిచింది. ఆదిలాబాద్ 73 బుకింగ్ చేయగా రూ.8468 ఆదాయం, భైంసాలో 6 బుకింగ్ కాగా రూ.696, నిర్మల్‌లో 21 కాగా రూ.2,436, ఉట్నూర్‌లో 3 బుకింగ్ కాగా రూ.348, ఆసిఫాబాద్‌లో 18 కాగా రూ.2088, మంచిర్యాలలో 317 బుకింగ్ చేయగా రూ.36,772 ఆదాయం సమకూరిందని మంచిర్యాల డీఎం రవీంద్రనాథ్ తెలిపారు.

ఈ నెల 17 నుంచి ఇప్పటి వరకు బుకింగ్, ఆదాయం

డిపో	బుకింగ్	ఆదాయం	ర్యాంకు
మంచిర్యాల	1241	రూ.1,43,956	1
ఆదిలాబాద్	462	రూ.53,592	2
నిర్మల్	284	రూ.32944	3
ఆసిఫాబాద్	218	రూ.25288	4
భైంసా	71	రూ.8236	5
ఉట్నూర్	39	రూ.4524	6

కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమం

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీనివాస్
- ముగిసిన ఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభలు
- తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీనివాస్

పాతమంచిర్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానా లకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్మించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ అన్నారు. మంచిర్యాలలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మూడు రోజులుగా సాగుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభలు సోమవారం ముగిసాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వ్యతి రేకిస్తూ, ప్రభుత్వ రంగ పరిశ్రమలు అమ్మం, ప్రైవేటీకరణను నిరసిస్తూ పోరాట కార్యక్రమాలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహాసభల్లో పలు తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షులుగా టి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఆర్.జనార్దన్, 13మంది ఆఫీస్ బేర్లు, 22మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాంద్‌పాషా, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, కార్యదర్శులు తాళ్లపెల్లి శ్రీనివాస్, ఎండీ.జాఫర్, తోకల తిరుపతి, మల్లేష్, అరుణోదయ కళాకారులు మల్లన్న, వీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు లాల్‌కుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డి చరణ్, కార్యదర్శి జేఎల్.శ్రీకాంత్, ఐఎఫ్‌టీయూ నాయకులు యాదగిరి, నర్సయ్య, శ్రీనివాస్, రమేష్, అప్పారావు, బాపు, రాజయ్య సునీత, రాజకళ, శోభ, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.



పాహిమాం పరమేశ్వరా..



వేములవాడ: రాజన్నను సోమవారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సీతారాముల కల్యాణోత్సవాలు ప్రారంభమైన తరుణంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబ సభ్యులతో చేరుకుని తలనీలాలు, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా రాజన్న గుడితోపాటు జాతరాగ్రౌండ్, బద్దిపోచమ్మ వీధి భక్తుల రద్దీతో కిటకిటలాడింది. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పరిశీలించారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్‌లో ఇద్దరికి చోటు


మహిపాల్


రవి

కరీంనగర్ స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి ఎన్నుకున్నారు. ఇందులో కరీంనగర్ జిల్లా నుంచి ఇద్దరికి చోటు దక్కింది. గతంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పని చేసిన జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్ ఈసారి కూడా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. అలాగే జిల్లా కార్యదర్శి కడారి రవిని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నియమించారు. వీరి ఎంపిక పట్ల అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు హరికిషన్, రాజగోపాలచారి, కటకం రవి, చంద్రశేఖర్, ఉనుక లక్ష్మణ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి
ఫ్యామిలీ
కరీంనగర్
మంగళవారం ॥ 28-3-2023

ప్రపంచాన్ని గెలిచిన మన బంగారాలు

ఇంటర్నేషనల్ బాక్సింగ్ అసోసియేషన్(ఐబీఏ) న్యూఢిల్లీలో (మార్చి15-మార్చి26) నిర్వహించిన ప్రపంచ మహిళల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో నిఖత్ జరీన్ (50 కేజీల విభాగం), స్వీటీ బూరా (81 కేజీల విభాగం), లవ్లీనా (75 కేజీల విభాగం), నీతూ గంగాస్ (48 కేజీల విభాగం) స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. నిఖత్ నుంచి నీతూ వరకు ఎవరిదీ నల్లేరు మీద నడక కాదు. అడుగడుగునా సవాళ్లు ఎదురయ్యాయి. వాటికి దీటుగా పంచ్‌లు ఇచ్చి తమను తాము నిరూపించుకున్న ఈ స్వర్ణవిజేతలు ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు...


నిఖత్ జరీన్

పదమూడేళ్ల వయసులోనే బాక్సింగ్ బరిలోకి దిగింది తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్‌కు చెందిన నిఖత్ జరీన్. నిఖత్‌లోని ప్రతిభ సంగతి పక్కన పెట్టి 'మగరాయుడిలా ఈ ఆటలు ఏమిటి' అన్న వాళ్లే ఎక్కువ.

'ఎందుకొచ్చిన తలనొప్పి' అని ఆమె తండ్రి నిఖత్‌ను ఆట మానిపించి ఉంటే విశ్వ విజేతగా నిఖత్‌ను చూసే వాళ్లం కాదు.

రింగ్‌లో ఒత్తిడి ఎదురైతే బిత్తరపోయే రకం కాదు నిఖత్. ఆ ఒత్తిడినే బలంగా చేసుకునే నైజం ఆమెది. ఆటకు సంబంధించిన వ్యూహాల పైనే కాదు ఆహార నియమాల విషయంలోనూ దృష్టి సారించే నిఖత్ ప్రతికూల వ్యాఖ్యల గురించి పట్టించుకోలేదు. ఆటలో వ్యూహ ప్రతివ్యూహాలపైనే తన ఆసక్తి.

వరుసగా రెండో ఏడాది ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌గా నిలిచి తన ప్రత్యేకత చాటుకుంది నిఖత్. మేరీ కోమ్ తరువాత ఒకటి కంటె ఎక్కువ స్వర్ణాలు గెలిచిన బాక్సర్‌గా నిలిచింది. పోరాటమే తన మార్గం. బలం.

హరియాణాలోని హిసార గ్రామీణ ప్రాంతానికి చెందిన స్వీటీ బురా తండ్రి మహేంద్రసింగ్ ఒకప్పటి బాస్కెట్‌బాల్ ప్లేయర్. తండ్రి ప్రభావంతో ఆటలపై స్వీటిలో ఆసక్తి మొదలైంది. బాక్సింగ్‌లో ఓనమాలు నేర్చుకోవడానికి ముందు స్వీటీ రాష్ట్ర స్థాయి కబడ్డీ ప్లేయర్. కబడ్డీలో స్వీటీ దూకుడు చూసి తండ్రితో సహా చాలామంది 'ఈ అమ్మాయికి బాక్సింగ్ అయితే కరెక్ట్' అనుకున్నారు.

తండ్రి సూచనతో బాక్సింగ్ వైపు వచ్చింది స్వీటీ. ఒక ఆటలో 'సూపర్' అనిపించుకున్నవారికి కొత్తగా వేరే ఆటలోకి వెళ్లి నిరూపించుకోవడం అంత సులువైన విషయం ఏమీ కాదు. స్వీటీ బడ్డింగ్ బాక్సర్‌గా ఉన్నప్పుడు తనకు పెద్దగా సౌకర్యాలు ఉండేవి కావు. ఎక్కడైనా ఖాళీ స్థానం కనిపిస్తే కోచ్ అక్కడ శిక్షణ ఇచ్చేవాడు. పొలం భూముల్లో నేర్చుకున్నామా, పట్టణంలోని ప్రసిద్ధ కోచింగ్ సెంటర్‌లో నేర్చుకున్నామా అనేదాన్ని స్వీటీ ఎప్పుడూ మనసు మీదికి తీసుకోలేదు. గురువు చెప్పినదానికి తనదైన వ్యూహాన్ని జోడించి ఆటలో రాణించేది.

ఒకసారి బాక్సింగ్ రింగ్‌లో ఉన్నప్పుడు స్వీటీకి ప్రత్యర్థి గట్టి పంచ్ ఇచ్చింది. 'చుక్కలు కనిపించి ఉంటాయి నీకు' అని తమ్ముడు అరిచాడు. అతను ఎగతాళిగా అన్నాడా, వ్యూహాత్మకంగా అన్నాడా అనేది వేరే విషయంగానీ తమ్ముడు చేసిన కామెంట్‌తో స్వీటీకి బాగా కోపం వచ్చింది. ఆ కోపం బలంగా మారి ప్రత్యర్థికి చుక్కలు చూపించింది!

స్వీటీ పంచింగ్ గ్రామర్‌ను చూసి ప్రేక్షకులు వేనోళ్ల పొగిడారు. ఆ విజయంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బాక్సింగ్‌లో స్వీటీ విజయపరంపర కొనసాగుతూనే ఉంది. 'ఆట అనేది నా రక్తంలోనే ఉంది' అని సగర్వంగా చెప్పే స్వీటీ బురాకు రాబోయే ఒలింపిక్స్ అనేది లక్ష్యం.


నీతూ గంగాస్

హరియాణా రాష్ట్రంలోని బివానీ జిల్లాలోని ఒక గ్రామంలో పుట్టింది నీతూ గంగాస్. తల్లి మాటల్లో చెప్పాలంటే చిన్నప్పుడు నీతూ చిలిపి అమ్మాయి. స్కూల్లో తగాదాలు, ఫైట్లు! బాక్సింగ్‌లో ఓనమాలు తెలియకపోయినా ప్రత్యర్థులకు బాక్సర్‌లా పంచ్‌లు ఇచ్చేది. ఇది చూసిన తండ్రి జై భగవాన్ కుమార్తెకు బాక్సింగ్‌లో శిక్షణ ఇప్పించడం ప్రారంభించాడు. అప్పుడు నీతూ వయసు 12 సంవత్సరాలు.

శిక్షణ తీసుకుంటోందన్న మాటేగానీ బాక్సింగ్‌లో ఎలాంటి ప్రతిభా చూపేది కాదు. ఎప్పుడూ ఎవరో ఒకరి చేతిలో ఓడిపోతూనే ఉండేది. ఒక రోజు 'ఇక నా వల్ల కాదు నాన్నా. నాకు బాక్సింగ్ వద్దు' అని ధైర్యంగా తండ్రితో చెప్పింది.

'అలాగే తల్లీ' అని ఆయన అని ఉంటే కొత్త చరిత్ర ఆవిష్కరణ అయ్యేది కాదు. కుమార్తెను బాక్సర్‌గా తీర్చిదిద్దడం కోసం చేస్తున్న ఉద్యోగానికి సెలవు(నాన్-పెయిడ్ లీవ్) పెట్టి మరీ కుమార్తె ట్రైనింగ్ నుంచి డైట్ వరకు దగ్గరుండి పర్యవేక్షించాడు. కొంతకాలం తరువాత ప్రసిద్ధ బాక్సింగ్ కోచ్, బివానీ బాక్సింగ్ క్లబ్ (బీబీసి) వ్యవస్థాపకుడు జగ్‌దీష్ సింగ్ దృష్టిలో పడింది నీతూ. 'బీబీసి'లో చేరడం నీతూకు టర్నింగ్ పాయింట్‌గా మారింది. నిజంగా చెప్పాలంటే అసలు సిసలు శిక్షణ అప్పుడే మొదలైంది. బాక్సింగ్‌లోని మెలకువలను ఔపోసన పట్టి రింగ్‌లో ప్రత్యర్థులను మట్టి కరిపించడం ప్రారంభించింది.

గత సంవత్సరం కామన్‌వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకం గెలుచుకొని ప్రపంచ దృష్టిని ఆకర్షించింది నీతూ.


లవ్లీనా బోర్గో హెయిన్

అస్సాంలోని గోలగాట్ జిల్లాకు చెందిన టికెన్ బోర్గోహెయిన్ చిన్న వ్యాపారి. 'పాపం ఈయనకు ముగ్గురూ ఆడపిల్లలే' అని ఎప్పుడూ ఎవరో ఒకరు అకారణ సానుభూతి చూపుతుండేవారు. ముగ్గురు కుమార్తెలలో చిన్న అమ్మాయి లవ్లీనా బోర్గో హెయిన్ అక్కలను స్ఫూర్తిగా తీసుకొని బాక్సింగ్ నేర్చుకుంది.

'మనకెందుకు బాక్సింగ్' అని తల్లిదండ్రులు ఎప్పుడూ అనలేదు. ఒకవైపు ఆర్థిక ఇబ్బందులు ఉన్నా చిన్న కుమార్తెను బాక్సింగ్ ఛాంపియన్‌గా చూడాలని కలలు కనేవాడు తండ్రి. 2018, 2019 ఉమెన్ వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు గెలుచుకొని తల్లిదండ్రుల కళ్లలో వెలుగులు నింపింది లవ్లీనా. గత సంవత్సరం ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం గెలుచుకుంది.

అంతర్జాతీయ స్థాయిలో బాక్సర్‌గా పేరు తెచ్చుకున్నా తన మూలాలు మరిచిపోలేదు లవ్లీనా. ఇప్పటికీ తండ్రికి వ్యవసాయ పనుల్లో సహాయం చేస్తుంటుంది. పాదాలెప్పుడూ నేల మీదే ఉండాలనేది తన సిద్ధాంతం.

2020 ఒలింపిక్స్‌లో కాంస్యం గెలుచుకుంది లవ్లీనా. ఒలింపిక్స్‌లో బంగారు పతకం గెలుచుకోవాలనేది తన కల.


స్వీటీ బురా

దిగుబడిలో రాజీ లేని సేద్యం!

సాగుబడి
ఉత్తరాభాద్ర కార్తె: మార్చి 30 వరకు



ఎస్.ఆర్. సుందరరామన్(83) తమిళనాట వ్యవసాయదారులకు చిరపరిచితమైన పేరు. సేంద్రియ సేద్య దిగ్గజం. సుసంపన్న సేద్య సంస్కృతికి నిలువెత్తు సంతకం. 83 ఏళ్ల జీవితంలో 60 ఏళ్ల వ్యవసాయ అనుభవం ఆయనది. 30 ఏళ్ల రసాయనిక వ్యవసాయం, మరో 30 ఏళ్లు సేంద్రియ సేద్య అనుభవం ఆయన సొంతం. తాను అనుసరిస్తున్న, సాగు పద్ధతి ఏదైనా, పూర్తి నిమగ్నతతో ఆయా పద్ధతులను క్రమశిక్షణతో పాటించటం హరిత విప్లవ ఆరంభకాలం నుంచే ఆయనకు అలవాటైంది. ఆయన పొలంలోకి చెప్పుల్లేకుండా కాలుపెట్టినా, ఆయనతో కాసేపు మాట కలిపినా గొప్ప ఆనందం కలుగుతుంది, ఎవరికైనా!

రసాయనాలతో ప్రకృతిని నష్టపరిచే వ్యవసాయాన్ని మానక తప్పని 'అనివార్యత' తనను ప్రకృతితో కలసి పనిచేసే వ్యవసాయం వైపు నడిపించిందని ఆయన చెబుతున్నప్పుడు.. సేంద్రియ వ్యవసాయ పక్షపాతిగానో/ప్రచార కర్తగానో కాకుండా.. సాగు పద్ధతి ఏదైనా.. అధిక ఖర్చును భరించడానికి / దిగుబడులు నష్టపోవడానికి సుతరామూ ఇష్టపడని, అనుక్షణం వ్యవసాయాన్నే శ్వాసించే కాకలుతీరిన రైతు యోధునిగా ఆయన దర్శనమిస్తారు. అపారమైన సుందరరామన్ సేంద్రియ సేద్య జ్ఞానం ప్రకృతి సేద్యం చేస్తున్న మన రైతులకు ఎంతగానో ఉపయోగపడతుందనటంలో సందేహం లేదు.

1% సేంద్రియ కర్బనంతోనే సుస్థిర దిగుబడి

శాస్త్రవేత్తలు సూచించిన విధంగా అన్ని జాగ్రత్తలనూ తీసుకున్నప్పటికీ రసాయనిక వ్యవసాయం నా సుదీర్ఘ అనుభవంలో అన్ని విధాలా నష్టదాయకంగా మారటం నేను అనుభవపూర్వకంగా చూశాను. అందుకే మహామహుల దగ్గర సేంద్రియ సేద్య నియమాలను ఐదేళ్లపాటు ప్రయోగాలు చేసి, స్వయంగా ఈ విధానం సరైనదేనని నిర్ధారణ చేసుకున్నాక నా పదెకరాల పొలాన్ని ఒకేసారి సేంద్రియ సేద్యంలోకి మార్చాను. మొదటి ఏడాది కూడా దిగుబడి తగ్గనివ్వలేదు.

ప్రతి పంటకూ ముందు పచ్చి రొట్ట ఎరువు పంటలు సాగు చేసి కలియదున్నటం.. సజీవ ఆచ్ఛాదనగా అంతర పంటలను ఏ పంట/తోటలోనైనా విధిగా సాగు చేయటం.. ఒకటికి పది రకాల సేంద్రియ ద్రావణాలు, జీవన ఎరువులను సొంతంగా తయారు చేసుకొని క్రమం తప్పకుండా వాడటం.. ప్రతి ఏటా పశువులు/కోళ్ల ఎరువు వాడటం.. ఈఎం (ఎఫెక్టివ్ మైక్రోఆర్గానిజమ్స్) మదర్ టింక్చర్ తప్ప మరి దేన్నీ మార్కెట్‌లో కొనుగోలు చేయకుండానే పోషక లోపం లేకుండా సేంద్రియ సేద్యం చేయటం.. హైబ్రిడ్ వంగడాలతోనే సేంద్రియ పంట దిగుబడులను రసాయనిక సేద్యానికి తీసిపోని విధంగా మొదటి ఏడాది నుంచే సాధించటం.. పాక్షికంగా ప్రాసెస్ చేసి విక్రయించటం ద్వారా అధికాదాయం పొందటం.. ఇవీ నా అనుభవాలు. కొత్త రైతులు పావెకరంతో మొదలు పెట్టి, అన్ని విషయాలూ బేరీజు వేసుకుంటూ 2-3 ఏళ్లలో పొలం అంతటినీ సేంద్రియ సేద్యంలోకి మార్చుకోవచ్చు. సేంద్రియ కర్బనం కనీసం 1%కి పెంచుకుంటేనే తప్ప దిగుబడులు స్థిరంగా రావు. ప్రతి ఏటా సేంద్రియ కర్బనం పరీక్ష చేయించుకోవాలి. ఇది ఏటేటా ఎంతో కొంతైనా పెరుగుతుంటేనే బాగా చేస్తున్నట్లు లెక్క. పంటలు ఏవి సాగు చేసినా ఏడాది పొడవునా పొలాన్ని పంటలతోనో, గడ్డితోనో కప్పి ఉంచాలి. పంటల మధ్య విరామంలో కూడా వారానికి మించి పొలాన్ని ఖాళీగా ఎండబారనివ్వకూడదు. సేంద్రియ సేద్యానికి, సేంద్రియ కర్బన పరిరక్షణకు ఇదే మూల సూత్రం.


- ఎస్.ఆర్. సుందర రామన్
(9842724778) వీరకొట్యుపాళెం, ఈరోడ్ జిల్లా, తమిళనాడు
(తమిళం/ఆంగ్లంలో సుందర రామన్‌తో మాట్లాడొచ్చు, క్షేత్రాన్ని సందర్శించవచ్చు. ఆయన శిష్యుడు కిషోర్‌ను 99490 94370 నంబరులో సంప్రదించవచ్చు)

ఎకరానికి ఏటా 10-20 టన్నుల పచ్చిరొట్టను విధిగా అందించాలంటారు సుందరరామన్. సాగు భూమి నిరంతరం సారవంతంగా ఉంటూ మంచి దిగుబడులు ఇవ్వాలంటే విధిగా ప్రతి ఏటా (6-8 రకాలు. ఎకరానికి 30 కేజీల విత్తనాలు చల్లి) పచ్చి రొట్ట పంటలను సాగు చేసి. 45-60 రోజుల్లో రోటవేటర్‌తో కలియదున్నాలి. దానితో పాటు. ప్రతి ఏటా (ఎకరానికి 10-20 టన్నుల) మాగిన పశువుల ఎరువు లేదా (8-12 టన్నుల) మాగిన కోళ్ల ఎరువు వాడాలి.


పచ్చిరొట్ట సాగు తప్పనిసరి

అంతర పంటలను వత్తుగా సాగు చేయటం ద్వారా కలుపు సమస్యగా మారకుండా చూసుకుంటున్నారు సుందరరామన్. ప్రతి పంటలోనూ ఆ పంటకు తగిన అంతర పంటలు వేస్తున్నారు. అరటి తోటలో జనుము. జీలుగ. ఉలవ. బొబ్బర విత్తనాలను ఎకరానికి 20 కిలోలు చల్లి అంతర పంటలుగా వత్తుగా సాగు చేసి చేతితో కలుపు తీయకుండా సేద్యం చేస్తున్నారు సుందరరామన్. జనుము. జీలుగ కోసి తోటలోనే ఆచ్ఛాదనగా వేయటం ద్వారా నేలకు నేరుగా ఎండ తగలకుండా చూస్తారు.


గడ్డితో ఆచ్ఛాదన


అంతరపంటలతో కలుపు ఔట్

పసుపును 9 అంగుళాల ఎత్తు మడుల్లో విత్తుకుంటారు. దీనిలో పిల్లి పెసరను పోలిన నరిపైర్ (కుంకుప పెసర/మాత్ బీన్) అనే పప్పుధాన్యపు పంటను అంతర పంటగా విత్తుతారు. ఎత్తు తక్కువలో నిండుగా అల్లుకుంటుంది. 3 నెలల్లో ఈ పంట పూర్తయ్యే సరికి పసుపు మొక్కలు పూర్తిగా ఎదుగుతాయి కాబట్టి తర్వాత కలుపు బాధ ఉండదు. కూరగాయ తోటల్లోనూ కుంకుప పెసరనే విత్తుతారు. చెరకును వరుసల మధ్య 4 అడుగుల దూరం పాటిస్తూ జనుము. జీలుగ సాగు చేస్తారు. ఈ పంటల నీడ ఎండ తీవ్రతను 3-4 డిగ్రీల మేరకు తగ్గిస్తుందంటారు సుందరరామన్. .


సోలార్ డ్రయ్యర్‌లో కొబ్బరి

కొబ్బరి కాయలను కాకుండా బోండాలను పగులగొట్టి సోలార్ డ్రయ్యర్‌లో ఎండబెట్టి విక్రయిస్తారు. పసుపు. మిరప కాయలను కూడా ఈ డ్రయ్యర్‌లోనే ఎండబెట్టి అమ్ముతారు. పదెకరాల్లో రసాయనిక రైతులకు దీటుగా దిగుబడులు తీసే సుందరరామన్‌కు మార్కెటింగ్ సమస్య లేదు. వ్యాపారులు పొలం దగ్గరకే వచ్చి కొనుక్కెళ్తారు. సత్యమంగళం ఆర్గానిక్ ఫార్మర్స్ వెల్ఫేర్ ట్రస్టు (ఇది రిజిస్టరైన ఎఫ్.పి.ఓ. కూడా) ద్వారా మిగతా ఉత్పత్తులను అమ్ముతారు. పిటిఎస్10. సేలం పసుపు రకాలలో 3.5-4.25% కుర్కుమిన్ పొందుతున్నారు.



సగటున ఎకరానికి ఏటా రూ. 50-60 వేల నికరాదాయం పొందుతున్నారు సుందరరామన్. ప్రకృతి అనుకూలిస్తే మరో రూ.15 వేలు అదనం. ఒకటికి పది రకాల ద్రవరూప ఎరువులు సొంతంగా తయారు చేసుకొని వాడటం ఆయన విజయ రహస్యం. అమృతం, పంచామృతం, పులిసిన మజ్జిగ, కషాయాలు, ఈఎం ద్రావణం, మురగబెట్టిన పశుమూత్రం, పులియబెట్టిన పండ్ల రసాలు, చేపల ద్రావణాలను (ఎకరానికి నెలకు ఇవన్నీ కలిపి 75-150 లీటర్లు) నెలకు 2.3 సార్లు డ్రిప్ ద్వారా పారిస్తారు. మరీ అవసరమైతే పిచికారీ చేస్తారు. ద్రావణాలను అందించటం ద్వారా భూమిలో సూక్ష్మ జీవరాశిని నిరంతరం వృద్ధి చేసుకుంటేనే సేంద్రియ కర్బనంతో పాటు దీటైన దిగుబడులు వస్తాయంటున్నారాయన.

దిగుబడి ఏనాడూ తగ్గలేదు!

రసాయనిక సేద్యం నష్టదాయకమని గుర్తించి సేంద్రియ సేద్యంలోకి మారిన సుందర రామన్ క్షేత్రంలో తొలి ఏడాది కూడా దిగుబడి తగ్గలేదు. సేంద్రియ సాగులో ఎకరానికి చెరకు 50-60 టన్నులు, పసుపు 20-25 క్వింటాళ్లు, వరి ధాన్యం 2.5- 3 టన్నులు, మిరప 35-40 బస్తాలు (40 కేజీలు), హైబ్రిడ్ మొక్కజొన్న 12-15 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నారు.

రెండు రోజుల్లో ఎండు మిర్చి రెడీ!

- నాణ్యంగా మిర్చిని ఎండబెట్టే విద్యుత్ ప్లాంట్లు అందుబాటులోకి
- మిర్చి రకాన్ని బట్టి 24- 36 గంటల్లో మిరప కాయలను ఎండబెట్టే ప్లాంట్లు
- మిర్చి రకాన్ని బట్టి టన్ను నుంచి రెండు టన్నుల సామర్థ్యంతో డ్రయ్యర్లు
- రంగు, క్వాలిటీ కలిగి ఉండే ఈ ఎండు మిర్చికి మంచి ధర పలికే అవకాశం
- ఎండు మిర్చిని ఏసీ లేకుండా ఏడాది పాటు ఇంటిదగ్గరే నిల్వ చేసుకునే వీలు

మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని రైతులకు పంట నష్టాలను తగ్గించేందుకు పండు మిరప కాయలను చప్పున, సురక్షితంగా, నాణ్యంగా ఎండబెట్టే యంత్రాలు (డ్రయ్యర్లు) అందుబాటులోకి వచ్చాయి. ఆరుబయట కల్లాల్లో పండు మిరపకాయలు పూర్తిగా ఎండాలంటే వాతావరణాన్ని బట్టి 20-30 రోజుల వరకు పడుతుంది. అంతేకాక, పండు మిర్చిని కల్లాల్లో ఆరబెట్టే సమయంలో సక్రమంగా ఎండ తగలదు. ఎండవేడి ఒకచోట తగిలి మరోచోట తగలక తాలు సమస్య వస్తోంది. నల్లమచ్చలు ఏర్పడే అవకాశాలుంటాయి. ఈ నేపథ్యంలో సోలార్‌తో పనిచేసే డ్రయ్యర్లతో పాటు, విద్యుత్‌తో పనిచేసే డ్రయ్యర్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. తక్కువ సమయంలో ఎటువంటి బ్యాక్టీరియా లేకుండా, తాలు రాకుండా మిర్చిని ఎండబెట్టే యూనిట్‌కు చెన్నైకి చెందిన శాంత ఇంజనీరింగ్ సంస్థ రూపకల్పన చేసింది. స్టెయిన్‌లెస్ స్టీల్‌తో, విద్యుత్ సర్క్యూట్‌లను తయారు చేసి.. వాటిలో ఓజోన్ గాలితో యంత్రాలను, మిర్చిని స్టెరిలైజ్ చేసి.. తక్కువ సమయంలోనే ఆరబెట్టే ప్రక్రియను అందుబాటులోకి తెచ్చింది ఈ సంస్థ. విద్యుత్ యూనిట్లు అనేక దేశాల్లో మంచి ఫలితాలిస్తున్నట్లు చెబుతున్నారు. గుంటూరు జిల్లా జొన్నలగడ్డలో విద్యుత్ డ్రయ్యర్లపై రైతులకు ఇటీవల అవగాహన కల్పించారు.


విద్యుత్ ప్లాంట్‌లో మిరపకాయలు

తాలు రాదు.. తొడెం రంగు మారదు

రైతు పొలంలో కోసిన పండు మిర్చిని నేరుగా విద్యుత్‌తో నడిచే డ్రయ్యర్ ప్లాంట్‌కు తరలించి ఎండబెట్టుకోవచ్చు. మిర్చి రకాన్ని బట్టి 24 నుంచి 36 గంటల్లోనే ఎండు మిర్చిని పొందవచ్చు. ఈ విధంగా ఆరబెట్టుకున్న మిర్చిలో తాలు ఒక శాతం కూడా రాదని నిపుణులు చెబుతున్నారు. అదేవిధంగా మిరపకాయకు ఉండే తొడెం సైతం ఆకుపచ్చ రంగులోనే ఉంటుంది. కోసినప్పుడు మిరప పండ్లకు ఉన్న రంగులోనే ఎండు మిరప కాయలు ఉంటాయి. మిర్చి రంగు, తొడెం పచ్చదనం చూసి నాణ్యతను అంచనా వేస్తారని, దాన్ని బట్టి ధర నిర్ణయమవుతుందని నిపుణులు అంటున్నారు. ఓజోన్ గాలితో మిర్చిని స్టెరిలైజ్ చేయటంతో మిర్చిలో బ్యాక్టీరియా ఉండేందుకు ఆస్కారం లేదంటున్నారు.


తొడిమెలు ఆకుపచ్చగా

ఏసీ లేకుండా ఏడాది పాటు ఇంటిపట్టునే నిల్వ

విద్యుత్ ప్లాంట్‌లో మిర్చిని సరైన వేడిలో, ఓజోన్ గాలితో ఎండబెట్టడం ద్వారా మిరపకాయలు రంగు మారకుండా, తొడిమలు సైతం ఆకుపచ్చగా నాణ్యంగా ఎండుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ విధంగా ఎండబెట్టిన మిరపకాయలను ఎటువంటి ఏసీలు లేకుండా సాధారణ గోదాములు/ఇళ్ళలోనే నిల్వ చేసుకొనే వీలుందని నిపుణులు చెబుతున్నారు. తద్వారా రైతులు కోల్డ్‌స్టోరేజ్ ఖర్చు లేకుండా సరైన ధర వచ్చినపుడు విక్రయించుకొని మంచి ఆదాయం పొందడానికి అవకాశం ఉంటుంది.

1-2 టన్నుల యూనిట్లు

విద్యుత్‌తో నడిచే యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవడానికి కనీసం 440 వాట్ల త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం అవసరం. ఒక టన్ను మిర్చిని ఆరబెట్టే సామర్థ్యం ఉన్న ప్లాంట్ నెలకొల్పడానికి రూ.15 లక్షల వరకూ ఖర్చవుతుంది. రెండు టన్నుల ప్లాంట్‌కు రూ.25 లక్షల వరకూ ఖర్చవుతుంది. కేంద్ర ప్రభుత్వం 35 శాతం వరకూ సబ్సిడీని అందిస్తుందని సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు. ఈ విధంగా రైతు ఒకరు ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకుంటే తన పంటతోపాటు గ్రామంలోని, ఇతర గ్రామాల్లోని రైతుల మిర్చిని ఆరబెట్టి అదనపు ఆదాయాన్ని పొందే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. సోలార్ డ్రయ్యర్లలో రాత్రుళ్లు వేడి తగ్గిపోకుండా చూసే పరిశోధనలు ఫలిస్తే భవిష్యత్తులో ఖర్చు తగ్గి, రైతులకు మేలు జరిగే అవకాశాలున్నాయి.


సోలార్ డ్రయ్యర్‌లో ఎండుతున్న మిరపకాయలు

– దాళా రమేష్‌బాబు, సాక్షి ప్రతినిధి, గుంటూరు
ఇన్‌పుట్స్: మల్లిఖార్జునరావు, గుంటూరు రూరల్



మళ్లీ మెరిసిన క్రిస్టియానో రొనాల్డో

యూరో-2024 క్వాలిఫయింగ్ టోర్నీలో మాజీ విజేత పోర్చుగల్ వరుసగా రెండో విజయం సాధించింది. గ్రూప్ 'జె'లో భాగంగా లక్సెంబర్గ్‌తో మ్యాచ్‌లో పోర్చుగల్ 6–0తో గెలిచింది. పోర్చుగల్ తరఫున 198వ మ్యాచ్ ఆడిన కెప్టెన్ క్రిస్టియానో రొనాల్డో (6వ, 31వ ని.లో) రెండు గోల్స్ సాధించాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ చేసిన క్రీడాకారుల జాబితాలో ప్రస్తుతం రొనాల్డో 122వ గోల్స్‌తో అగ్రస్థానంలో ఉన్నాడు. లిక్టెన్‌స్టయిన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లోనూ రొనాల్డో రెండు గోల్స్ చేశాడు.



రాజస్తాన్ రాయల్స్ జట్టులో సందీప్ శర్మ

పేస్ బౌలర్ సందీప్ శర్మకు ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆడే అవకాశం లభించింది. గాయం కారణంగా ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీకి దూరమైన రాజస్తాన్ రాయల్స్ జట్టు ప్రధాన పేసర్ ప్రసిధ్ కృష్ణ స్థానంలో సందీప్ శర్మను తీసుకున్నారు. 2013 నుంచి ఐపీఎల్ ఆడుతున్న 29 ఏళ్ల సందీప్ శర్మను ఈ సీజన్ కోసం వేలంలో ఎవరూ కొనుగోలు చేయలేదు. అయితే ప్రసిధ్ గాయంతో వైదొలగడంతో సందీప్‌కు అవకాశం దక్కింది. గతంలో పంజాబ్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడిన సందీప్ 104 మ్యాచ్‌ల్లో 114 వికెట్లు పడగొట్టాడు.

ఆంధ్ర టు డచ్ వయా ఆక్లాండ్...

- అంతర్జాతీయ క్రికెటర్‌గా ఎదిగిన తేజ నిడమనూరు
- నెదర్లాండ్స్ జట్టులో కీలక సభ్యుడిగా గుర్తింపు

ఆ కుర్రాడు చిన్నప్పటి నుంచి ఆటలను విపరీతంగా ఇష్టపడ్డాడు. వయసు పెరుగుతున్న కొద్దీ ఆటగాడిగా మారాలనే కోరిక కూడా పెరుగుతూ వచ్చింది. సొంత ఊరు వదిలినా, దేశాలు మారినా ఆ ఆలోచన మనసు లోంచి పోలేదు. అన్ని రకాల క్రీడలూ ప్రయత్నించిన తర్వాత క్రికెట్ వద్ద అతను ఆగాడు. అందులోనే అగ్ర స్థాయికి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఆపై దానిని చేరుకునేందుకు అన్ని రకాలుగా శ్రమించాడు. ఆ క్రమంలో ఎన్నో అవరోధాలు ఎదురైనా ఎక్కడా ఆశ కోల్పోలేదు. చివరకు తాను పుట్టిన, పెరిగిన దేశం కాకుండా ఉపాధి కోసం వెళ్లిన మూడో దేశం తరఫున జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అంతర్జాతీయ క్రికెటర్‌గా ముద్ర వేయించుకొని సగర్వంగా నిలిచాడు. అతని పేరే అనిల్ తేజ నిడమనూరు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో పుట్టి న్యూజిలాండ్‌లో పెరిగి ఇప్పుడు నెదర్లాండ్స్ జట్టుకు అంతర్జాతీయ మ్యాచ్‌లలో ప్రాతినిధ్యం వహిస్తున్న తేజపై 'సాక్షి' ప్రత్యేక కథనం.





సాక్షి, హైదరాబాద్:నెదర్లాండ్స్ క్రికెట్ టీమ్‌లో ఇప్పుడు తేజ నిడమనూరు కీలక సభ్యుడు. గత వారం జింబాబ్వేతో జరిగిన తొలి వన్డేలో అజేయ సెంచరీలతో అతను జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. గత ఏడాది మేలో తొలిసారి జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అతను ఇప్పటి వరకు 11 వన్డేలు, 6 టి20లు ఆడాడు. దక్షిణాఫ్రికాతో శుక్ర, ఆదివారాల్లో జరిగే వన్డే మ్యాచ్‌లకు తేజ ప్రస్తుతం సిద్ధమవుతున్నాడు. ఈ నేపథ్యంలో తేజ తన కెరీర్‌కు సంబంధించిన పలు విషయాలను 'సాక్షి'తో పంచుకున్నాడు. క్రికెటర్‌గా ప్రాథమికాంశాలు నేర్చుకోవడం మొదలు అవకాశాల కోసం యూరోప్ దేశం చేరడం వరకు అతని ప్రస్థానంలో అనేక మలుపులున్నాయి.

అలా మొదలైంది...

తేజ స్వస్థలం విజయవాడ. తేజ తల్లిదండ్రులు పాండురంగారావు, పద్మావతి మెరుగైన ఉపాధి అవకాశాల కోసం న్యూజిలాండ్‌కు వలస వెళ్లారు. దాంతో 2001లో ఏడేళ్ల వయసులో తేజ కొత్త జీవితం కూడా అక్కడే ప్రారంభమైంది. పాఠశాలలో చదువుతున్న సమయంలోనే భిన్నమైన ఆటల్లో తేజ రాణించాడు. ముఖ్యంగా కివీస్ అభిమాన క్రీడ రగ్బీలో కూడా అతను పట్టు సంపాదించాడు. అయితే అనుకోకుండా క్రికెట్‌పై కలిగిన ఆసక్తి పూర్తిగా ఈ క్రీడ వైపు మళ్లేలా చేసింది. ఆక్లాండ్‌లో తల్లి పని చేస్తున్న సంస్థ పక్కనే ప్రఖ్యాత 'కార్న్‌వాల్ క్రికెట్ క్లబ్' ఉంది. న్యూజిలాండ్‌లో అతి పెద్ద క్లబ్‌లలో ఒకటైన ఇక్కడే పలువురు దిగ్గజ క్రికెటర్లు మార్టిన్ క్రో, గ్రేట్‌బ్యాచ్, ఆడమ్ పరోరె తమ ఆటను మొదలు పెట్టారు. ఈ క్లబ్‌లో రోజూ క్రికెట్ చూస్తూ తేజ కూడా ఆకర్షితుడయ్యాడు. దాంతో తల్లిదండ్రులు అతడిని ఇందులో చేర్పించారు. ఆపై అతని క్రికెట్ సాధన మొదలైంది. చురుకైన ఆటతో వేగంగా పట్టు పెంచుకున్న తేజ స్థానిక లీగ్‌లలో సత్తా చాటడంతో వరుస అవకాశాలు వచ్చాయి. ఇదే క్రమంలో ఆక్లాండ్ 'ఎ' టీమ్‌లో అతను చోటు దక్కించుకున్నాడు. అక్కడా స్థానం లభించడంతో ఆక్లాండ్ సీనియర్ టీమ్‌లోకి ఎంపికయ్యాడు. 'క్రికెట్‌ను ఎంచుకున్న తర్వాత ఎక్కడా నేను ఉదాసీనతకు చోటు ఇవ్వలేదు. పూర్తి స్థాయిలో ప్రొఫెషనల్ క్రికెటర్ కావాలని గట్టిగా నిర్ణయించుకొని సుదీర్ఘ సమయాల పాటు ప్రాక్టీస్ చేస్తూ ఒకే లక్ష్యంతో సాగాను. నా ప్రదర్శనపై ప్రశంసలు రావడం, పలువురు ప్రోత్సహించడంతో భవిష్యత్తుపై స్పష్టత వచ్చింది' అని తేజ చెప్పాడు.

అవకాశాలు దక్కకపోవడంతో...

అయితే ఆటలో ఎదుగుతున్న కొద్దీ తేజకు ఊహించని పరిణామాలు ఆక్లాండ్‌లో ఎదురయ్యాయి. కేవలం అంకెలు, రికార్డులు మాత్రమే మెరుగైన అవకాశాలు కల్పించలేవని అతనికి అర్థమైంది. సీనియర్లు టీమ్‌లో పాతుకుపోవడం, వేర్వేరు కారణాల వల్ల అతనికి పూర్తి స్థాయిలో తన సత్తా చాటే అవకాశం రాలేదు. అయితే ఆటకు విరామం మాత్రం ఇవ్వరాదని పట్టుదలగా భావించడంతో మరో ప్రత్యామ్నాయం కోసం చూడాల్సి వచ్చింది. ముందుగా ఇంగ్లండ్ కౌంటీ డర్హమ్ మైనర్ లీగ్‌లలో అడుగు పెట్టిన తేజ ఆ తర్వాత నెదర్లాండ్స్‌లో లీగ్‌లు ఆడేందుకు ఆరు నెలల కాలానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే ఒప్పందం ప్రకారం నిర్ణీత సమయం ముగిసిన తర్వాత మళ్లీ కివీస్‌కు వెనక్కి వచ్చేయాల్సి వచ్చింది. ఇలాంటి స్థితిలోనూ క్రికెట్‌ను వదలకూడదనుకున్నాడు.

> "అంతర్జాతీయ క్రికెటర్ కావాలనే ఏకైక లక్ష్యంతో అన్ని ప్రయత్నాలూ చేశాను. ఇందుకోసం చాలా కష్టపడ్డా. ఏదీ సునాయాసంగా దక్కలేదు. ఎన్నో అవాంతరాలు ఎదురైనా పట్టుదలగా నిలబడ్డా. న్యూజిలాండ్‌లో నా 16 ఏళ్ల వయసులోనే అమ్మానాన్న భారత్‌కు వెనక్కి వచ్చేశారు. నేను కూడా రావాల్సి ఉండగా, కెరీర్‌ను నిర్మించుకుంటున్న దశలో రాలేనని చెప్పా. అప్పటి నుంచి అన్నీ నేనే సొంతంగా చేసుకున్నా. పార్ట్‌టైమ్ జాబ్‌లు చేస్తూ క్రికెట్‌ను మాత్రం వదల్లేదు. ఎవరి అండ లేకపోయినా, డచ్ భాష రాకపోయినా మొండిగా నెదర్లాండ్స్‌లో అడుగు పెట్టా. ఇదంతా నా స్వయంకృషి. ఈ ఏడాది జూన్‌లో జరిగే వన్డే వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో రాణించి మా జట్టు ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తే భారత్‌లో ఆడే అవకాశం వస్తుంది. అదే జరిగితే నా కెరీర్‌లో గొప్ప క్షణం అవుతుంది. అందుకోసం ఎదురు చూస్తున్నా." –'సాక్షి'తో తేజ నిడమనూరు

సరైన దిశలో...

నెదర్లాండ్స్‌లో గతంలో ఆడిన అనుభవం సరైన సమయంలో తేజకు పనికొచ్చింది. అక్కడే ఉండి పూర్తి స్థాయిలో క్రికెట్ ఆడితే భవిష్యత్తులో పైకి ఎదగవచ్చని అర్థమైంది. అయితే అలా చేయాలంటే ముందు అక్కడ ఒక ఉద్యోగంలో చేరాలి. దాంతో తాను చేసిన స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ డిగ్రీతో ఉద్యోగ ప్రయత్నం చేశాడు. అయితే అతని అర్హత ప్రకారం కాకుండా మరో రూపంలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా 'స్టార్ట్‌ఎక్స్' కంపెనీలో ఉద్యోగం వచ్చింది. 2019 మే నెలలో తేజ నెదర్లాండ్స్ గడ్డపై చేరాడు. నిబంధన ప్రకారం జాతీయ క్రికెట్ జట్టుకు ఎంపిక కావాలంటే కనీసం మూడేళ్లు నివాసం ఉండాలి. అయితే కొద్ది రోజులకే 'కరోనా' వచ్చి ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. ఆటను తీసి కొంత కాలం గట్టున పెట్టాల్సి వచ్చింది! ఇలాంటి స్థితిలో మరోసారి క్రికెట్ కెరీర్ సందేహంలో పడింది. అయినా సరే, తేజ వెనక్కి తగ్గలేదు. ఒకవైపు ఉద్యోగం, మరోవైపు క్రికెట్ ఆడుతూ వచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. సెలక్షన్ టోర్నీల్లో సత్తా చాటి ఎట్టకేలకు జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. 2022 ఏప్రిల్‌లో మూడేళ్లు ముగియగా, మే 31న ఆమ్‌స్టెల్‌వీన్‌లో వెస్టిండీస్‌తో తొలి వన్డే ఆడటంతో అతని స్వప్నం సాకారమైంది. 51 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో అజేయంగా 58 పరుగులు చేసిన తేజ అంతర్జాతీయ కెరీర్‌ను ఘనంగా మొదలు పెట్టాడు.

శ్రీజ 'ట్రిపుల్' ధమాకా

- మహిళల సింగిల్స్, డబుల్స్, టీమ్ విభాగాల్లో టైటిల్స్ సొంతం
- జాతీయ టీటీ చాంపియన్‌షిప్



జమ్మూ: మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంటూ తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ జాతీయ సీనియర్ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో మూడు విభాగాల్లో టైటిల్స్ సొంతం చేసుకుంది. సోమవారం ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తరఫున పోటీపడిన శ్రీజ మహిళల సింగిల్స్ విభాగంలో టైటిల్ నిలబెట్టుకోగా... డబుల్స్ విభాగంలో తన భాగస్వామి దియా చిటాలెతో కలిసి విజేతగా నిలిచింది. మహిళల టీమ్ ఈవెంట్‌లో శ్రీజ, దియా, అహిక ముఖర్జీలతో కూడిన ఆర్‌బీఐ జట్టు టైటిల్ సాధించింది. సింగిల్స్ ఫైనల్లో శ్రీజ 9–11, 14–12, 11–7, 13–11, 6–11, 12–10తో సుతీర్థ ముఖర్జీ (పశ్చిమ బెంగాల్)పై గెలిచి రూ. 2 లక్షల 75 వేల ప్రైజ్‌మనీని దక్కించుకుంది. డబుల్స్ ఫైనల్లో శ్రీజ–దియా ద్వయం 11–7, 11–7, 8–11, 14–12తో స్వస్తిక ఘోష్–శ్రుతి అమృతే (మహారాష్ట్ర) జోడీని ఓడించింది. టీమ్ ఫైనల్లో ఆర్‌బీఐ 3–2తో తమిళనాడును ఓడించింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో మొహమ్మద్ అలీ–వంశ్ సింఘాల్ (తెలంగాణ) జోడీ 6–11, 7–11, 6–11తో జీత్ చంద్ర–అంకుర్ భట్టాచార్య (పశ్చిమ బెంగాల్) జంట చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది.

హంపి, హారిక గేమ్‌లు 'డ్రా'





న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక వరుసగా రెండో 'డ్రా' నమోదు చేశారు. పొలీనా షువలోవా (రష్యా)తో జరిగిన గేమ్‌ను హంపి 19 ఎత్తుల్లో... జినెర్ జు (చైనా)తో జరిగిన గేమ్‌ను హారిక 52 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నారు.

కోల్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్‌గా నితీశ్ రాణా

గాయంతో శ్రేయస్ అయ్యర్ దూరం!



కోల్‌కతా: మరో నాలుగు రోజుల్లో మొదలయ్యే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో రెండుసార్లు చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కొత్త కెప్టెన్ ఆధ్వర్యంలో బరిలోకి దిగనుంది. రెగ్యులర్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వెన్ను నొప్పికి శస్త్ర చికిత్స అవసరం కానుంది. దాంతో అయ్యర్ మొత్తం ఐపీఎల్ టోర్నీకి దూరం కావడం ఖాయమైంది. ఈ నేపథ్యంలో శ్రేయస్ అయ్యర్ స్థానంలో నితీశ్ రాణా జట్టుకు నేతృత్వం వహిస్తాడని సోమవారం కేకేఆర్ ఒక ప్రకటన విడుదల చేసింది. గతంలో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో ఢిల్లీ జట్టుకు నితీశ్ రాణా కెప్టెన్‌గా వ్యవహరించాడు. రాణా కెప్టెన్సీలో ఢిల్లీ జట్టు 12 మ్యాచ్‌లు ఆడి ఎనిమిదింటిలో గెలిచి, నాలుగింటిలో ఓడిపోయింది. 2018 నుంచి కోల్‌కతా జట్టుకు ఆడుతున్న నితీశ్ రాణా కేకేఆర్ తరఫున 74 మ్యాచ్‌లు ఆడి 135.61 స్ట్రయిక్‌రేట్‌తో 1,744 పరుగులు సాధించాడు. ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీలో కోల్‌కతా తమ తొలి మ్యాచ్‌లో ఏప్రిల్ 1న పంజాబ్ కింగ్స్‌తో ఆడుతుంది.

సినిమా

కాంబినేషన్ రిపీట్ కావడం కామన్. అయితే హిట్ కాంబినేషన్ రిపీట్ అయినప్పుడు 'హిట్ రిపీట్' కావడం ఖాయం అనే అంచనాలు ఉంటాయి. తాజాగా మూడు కాంబినేషన్ల మీద అలాంటి అంచనాలు ఉన్నాయి. త్రివిక్రమ్-పూజా హెగ్డే, వెంకీ కుడుముల-రష్మికా మందన్నా, అట్లీ-నయనతార... ఈ ముగ్గురు డైరెక్టర్లు, ముగ్గురి హీరోయిన్ల కాంబో రిపీట్ అవుతోంది. ఆ విశేషాల్లోకి వెళదాం.

హిట్ రిపీట్

త్రివిక్రమ్ - పూజా హెగ్డే



పూజా హెగ్డే, త్రివిక్రమ్

తొలిసారి త్రివిక్రమ్ దర్శకత్వంలో పూజా హెగ్డే కథానాయికగా నటించిన చిత్రం 'అరవింద సమేత వీర రాఘవ' (2018). ఈ సినిమాలో అందం, ఆత్మవిశ్వాసం, ప్రతిభ ఉన్న అరవింద పాత్ర చేశారు పూజా హెగ్డే. నటిగా తన టాలెంట్ నిరూపించుకోవడానికి ఈ క్యారెక్టర్ హెల్ప్ అయింది. దాంతో పాటు సినిమా కూడా ఘన విజయం సాధించడంతో పూజా కెరీర్‌కి ప్లస్ అయింది. ఆ తర్వాత రెండేళ్లకు 'అల.. వైకుంఠపురములో' సినిమా ప్లాన్ చేసి, అందులోనూ పూజా హెగ్డేని తీసుకున్నారు త్రివిక్రమ్. ఈ సినిమాలో పూజా హెగ్డే చేసిన అమూల్య క్యారెక్టర్ ఆమెకు ప్లస్ అయింది. 'అల..'తో మరో హిట్ సినిమా ఆమె ఖాతాలో పడింది. ఇప్పుడు మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ ఓ సినిమా తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఇందులోనూ పూజానే హీరోయిన్. ఈ సినిమాలో పూజా హెగ్డే పాత్ర ఎలా ఉంటుంది? అనేది తెలియాల్సి ఉంది.

వెంకీ కుడుముల - రష్మికా మందన్నా



వెంకీ కుడుముల, రష్మికా మందన్నా

ఒక మీడియమ్ బడ్జెట్ సినిమాలో చేసిన సింపుల్, హోమ్లీ క్యారెక్టర్ ఆ తర్వాత పెద్ద బడ్జెట్ సినిమాలు, గ్లామరస్ రోల్స్ చేసే రేంజ్‌కి తీసుకెళుతుందని 'ఛలో' (2018) సినిమా ఒప్పుకున్నప్పుడు రష్మికా మందన్నా ఊహించి ఉండరు. కానీ ఆ మేజిక్ జరిగింది. వెంకీ కుడుముల దర్శకత్వంలో చేసిన 'ఛలో' చిత్రం ద్వారా కన్నడ బ్యూటీ రష్మికా మందన్నా తెలుగుకి పరిచయం అయ్యారు. తొలి సినిమానే హిట్. ఆ తర్వాత పెద్ద సినిమాలు చేస్తూ వచ్చిన రష్మిక మళ్లీ రెండేళ్లకు వెంకీ కుడుముల దర్శకత్వంలో 'భీష్మ' (2020) సినిమాలో మంచి పాత్ర చేశారు. ఈ సినిమా కూడా సూపర్ హిట్. ఇప్పుడు మళ్లీ వెంకీ కుడుముల దర్శకత్వంలో రష్మిక ఓ సినిమా చేస్తున్నారు. విశేషం ఏంటంటే.. 'భీష్మ'లో నటించిన నితిన్ ఇందులో హీరో. ఆ విధంగా వెంకీ-నితిన్-రష్మికలకు ఇది రెండో సినిమా. ఈ హిట్ కాంబినేషన్ చేస్తున్న ఈ సినిమా ఇటీవలే ఆరంభమైంది.

అట్లీ - నయనతార



నయనతార



అట్లీ

దర్శకుడిగా అట్లీ తొలి సినిమా 'రాజా రాణి' (2013) చేస్తున్నప్పటికి నయనతార స్టార్ హీరోయిన్. ఒక కొత్త దర్శకుడు చెప్పిన కథని నమ్మి ఆమె 'రాజా రాణి' చేశారు. ఆ చిత్రం మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. తొలి చిత్రం తర్వాత అట్లీ స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ స్టార్ డైరెక్టర్ల జాబితాలో చేరిపోయారు. ఇక మళ్లీ నయనతారను ఆయన కథానాయికగా తీసుకున్న చిత్రం 'బిగిల్' (2019). ఈ సినిమా కూడా సూపర్ హిట్. ఇప్పుడు అట్లీ దర్శకత్వంలో నయనతార ఓ సినిమా చేస్తున్నారు. అయితే ఈసారి ఈ డైరెక్టర్–హీరోయిన్ కాంబినేషన్‌లో రానున్నది హిందీ చిత్రం 'జవాన్'. షారుక్ ఖాన్ హీరోగా అట్లీ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ద్వారా నయనతార బాలీవుడ్‌కి కథానాయికగా పరిచయం అవుతున్నారు. సౌత్‌లో హిట్స్ ఇచ్చిన ఈ కాంబో నార్త్‌లోనూ ఆ ఫీట్‌ని రిపీట్ చేస్తుందని ఊహించవచ్చు.

డబుల్ ధమాకా



రామ్‌చరణ్

రామ్ చరణ్ బర్త్ డే (మార్చి 27) సందర్భంగా ఆయన నటిస్తున్న తాజా చిత్రం టైటిల్ వెల్లడి కావడంతో పాటు ఫస్ట్ లుక్ రిలీజైంది. ఆ విధంగా మెగా ఫ్యాన్స్‌కి డబుల్ ధమాకా లాంటి న్యూస్ ఇచ్చారు. రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'గేమ్ చేంజర్' టైటిల్‌ను ఖరారు చేసి, ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. "రామ్ చరణ్ పాన్ ఇండియా ఇమేజ్‌కు తగ్గ పవర్‌ఫుల్ టైటిల్‌ను శంకర్ ఖరారు చేశారు" అన్నారు 'దిల్' రాజు, శిరీష్. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాత: హర్షిత్, కెమెరా: ఎస్. తిరుణావుక్కరసు, సంగీతం: తమన్, లైన్ ప్రొడ్యూసర్స్: ఎస్.కె. జబీర్, నరసింహారావ్ .ఎన్.

దసరా కానుక



రామ్

రామ్ పోతినేని హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 20న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్. "మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది" అని చిత్రయూనిట్ ప్రకటించింది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: సంతోష్ డిటాకే.


వేసవిలో ఛత్రపతి



బెల్లంకొండ శ్రీనివాస్

బెల్లంకొండ శ్రీనివాస్ బాలీవుడ్‌లో హీరోగా ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'ఛత్రపతి'. వీవీ వినాయక్ ఈ మూవీకి దర్శకత్వం వహించారు. హీరో ప్రభాస్–డైరెక్టర్ రాజమౌళి కాంబినేషన్‌లో వచ్చిన తెలుగు 'ఛత్రపతి'కి ఇది రీమేక్. డాక్టర్ జయంతిలాల్ గడా సమర్పణలో ధవల్ జయంతిలాల్ గడా, అక్షయ్ జయంతిలాల్ గడా నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఈ చిత్రాన్ని మే 12న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. ధవల్ జయంతిలాల్ గడా, అక్షయ్ జయంతిలాల్ గడా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

ప్రేమకథ షురూ



ఉదయ్ శంకర్, శ్రీరామ్

ఉదయ్ శంకర్, మేఘా ఆకాశ్ జంటగా కొత్త సినిమాకి శ్రీకారం చుట్టారు. ఈ చిత్రంతో మన్మోహన్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. డాక్టర్ సౌజన్య ఆర్. అట్లూరి సమర్పణలో అట్లూరి నారాయణరావు నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి దినేష్ చౌదరి కెమెరా స్విచ్చాన్ చేయగా, ఉదయ్ శంకర్ తండ్రి శ్రీరామ్ క్లాప్ కొట్టారు. ఉదయ్ శంకర్ మాట్లాడుతూ–"రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉంటుంది" అన్నారు. "ఫ్యామిలీ, థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో పాటు ఒక చిన్న ప్రేమ కథ ఈ చిత్రంలో ఉంటుంది" అన్నారు మన్మోహన్. "ఏప్రిల్ మూడో వారంలో మా సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆరంభిస్తాం" అన్నారు అట్లూరి నారాయణరావు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల, కెమెరా: అనిత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: సాయి కృష్ణ, వెంకీ, కిశోర్.

సింగిల్ షెడ్యూల్‌లో...



మల్లారెడ్డి, అలీ, రమణారెడ్డి, 'ఘర్షణ' శ్రీనివాస్...

నరేంద్ర, గరిమా జంటగా రమణారెడ్డి గడ్డం దర్శకత్వంలో 'సీఐ భారతి' సినిమా షురూ అయింది. 'ఘర్షణ' శ్రీనివాస్ సమర్పణలో విశాల పసునూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర మంత్రి సి. మల్లారెడ్డి స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. తొలి సీన్‌కి నటుడు అలీ క్లాప్ కొట్టారు. "ఏప్రిల్ 10న షూటింగ్ మొదలు పెట్టి సింగిల్ షెడ్యూల్‌లో సినిమాని పూర్తి చేస్తాం" అన్నారు రమణారెడ్డి గడ్డం. "'సీఐ భారతి' వంటి మంచి చిత్రాన్ని నేను నిర్మిస్తుండటం హ్యాపీ" అన్నారు 'ఘర్షణ' శ్రీనివాస్. ఈ చిత్రానికి సహనిర్మాత: రేణుక కాసుల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వెంకటేశ్వరరావు, సంగీతం: ప్రిన్స్ హెన్రీ, కెమెరా: శ్రీనివాస రెడ్డి.

ఏంటి ఈ డ్రామా?



మనోజ్, రియా సచ్‌దేవ, మేఘాంశ్ శ్రీహరి

మేఘాంశ్ శ్రీహరి, రియా సచ్‌దేవ జంటగా జి. భవానీ శంకర్ దర్శకత్వంలో 'మిస్టర్ బ్రహ్మ.. ఏంటి ఈ డ్రామా?' చిత్రం తెరకెక్కుతోంది. సంధ్యా రాణి, స్వరూప రాణి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవానికి తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలి సన్నివేశానికి కెమెరామేన్ ఛోటా కె. నాయుడు కెమెరా స్విచాన్ చేయగా, హీరో మంచు మనోజ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ బాబీ కొల్లి గౌరవ దర్శకత్వం వహించారు. "మాతో ఇంత భారీ సినిమా నిర్మిస్తున్న నిర్మాతలకు థ్యాంక్స్" అన్నారు మేఘాంశ్. "సోషియో ఫ్యాంటసీ, మైథాలజీ, లవ్, ఎంటర్‌టైనర్ చిత్రమిది" అన్నారు భవానీ శంకర్. "మా తొలి ప్రయత్నాన్ని అందరూ ఆదరించాలి" అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: సి. రామ్ ప్రసాద్, సంగీతం: గోపీ సుందర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ముత్తినీడు గణేష్.

పరారి ఆయనకు అంకితం ఇవ్వాలి

- నక్కిన త్రినాథరావు



జీవీవీ గిరి, త్రినాథరావు, యోగేశ్వర్, మహిత్ నారాయణ్

"'పరారి' పాటలు వింటుంటే చక్రిగారి సంగీతం విన్నట్టు ఉంది. గౌతమ్ రాజుగారి ఎడిటింగ్ చాలా బాగుంది. ఈ చిత్రాన్ని ఆయనకు అంకితం ఇవ్వాలి" అని డైరెక్టర్ నక్కిన త్రినాథరావు అన్నారు. యోగేశ్వర్, అతిథి జంటగా సాయి శివాజీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పరారి'. గాలి ప్రత్యూష సమర్పణలో జీవీవీ గిరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న రిలీజ్ అవుతోంది. మహిత్ నారాయణ్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'ఎల్ల ఎల్ల..' అనే పాటని నక్కిన త్రినాథరావు రిలీజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటని దీపక్ పాడారు.

మెగా యాక్షన్



మెహర్ రమేశ్, బాబీ, శ్రీ కల్యాణ్

శ్రీ కల్యాణ్, శశి జంటగా గేదెల రవిచంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మెగా పవర్'. నిర్మాత అల్లు అరవింద్ ఆశీస్సులతో అడబాల నాగబాబు, సాయి నిర్మల, ఇల్లా అభిషేక్, సత్యమూర్తి గేదెల నిర్మిస్తున్నారు. హీరో రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా 'మెగా పవర్' ఫస్ట్ లుక్‌ని దర్శకులు మెహర్ రమేష్, కేఎస్ రవీంద్ర (బాబీ) విడుదల చేశారు. "మదర్ సెంటిమెంట్‌తో సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది" అన్నారు దర్శక-నిర్మాతలు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	127	57,654
నిఫ్టీ ▲	41	16,986

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,784	▲ 35
డోజోన్స్	32,485	▲ 15
ఎఫ్‌టీఎస్ఈ 100	7,472	▲ 66
డాక్స్	15,128	▲ 170
షాంఘై	3,251	▼ 14
నికాయ్	27,477	▲ 92

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై	
బంగారం (24 క్యారట్)	58,892
బంగారం (22 క్యారట్)	58,657
వెండి (కేజీ)	69,369

జియో కొత్త బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్ @ రూ.198

న్యూఢిల్లీ: ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ సెగ్మెంట్‌లో పోటీని మరింత వేడెక్కిస్తూ జియో కొత్తగా ఎంట్రీ లెవెల్ ప్లాన్‌ను ఆవిష్కరించింది. నెలకు రూ.198 ధరతో బ్రాడ్‌బ్యాండ్ బ్యాకప్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. దీనితో సెకనుకు 10 మెగాబిట్ వేగంతో నెట్ సర్వీసులు అందుకోవచ్చు. రూ. 21–152 వరకు చెల్లించడం ద్వారా 1–7 రోజుల పాటు ఇంటర్నెట్ వేగాన్ని 30 ఎంబీపీఎస్ లేదా 100 ఎంబీపీఎస్‌కు అప్‌గ్రేడ్ చేసుకునే వీలును కల్పిస్తున్నట్లు సంస్థ తెలిపింది. 5 నెలల పాటు యూసేజీ, ఇన్‌స్టాలేషన్ చార్జీలు కలిపి కొత్త కస్టమరు రూ.1,490 కట్టాల్సి ఉంటుంది. ఇప్పటివరకు జియో ఫైబర్ కనెక్షన్ తీసుకునేందుకు కనీస ప్లాన్ నెలకు రూ.399గా ఉంది.

దక్షిణాదిలో లాయిడ్ గ్రాండే డ్యూటీ ప్రచారం



హైదరాబాద్: విద్యుత్ ఉపకరణాల తయారీ సంస్థ హావెల్స్ ఇండియా తన ఎయిర్ కండీషనర్ శ్రేణి 'లాయిడ్ గ్రాండే డ్యూటీ' ప్రచారాన్ని దక్షిణాది రాష్ట్రాల్లో ప్రారంభించింది. 'ఖయాల్ జో ఘర్ కో బనాయే' పేరిట రూపొందించిన ఈ ప్రచార చిత్రంలో సినీ నటులు మహేశ్‌బాబు, తమన్నాలు నటించారు. ''లాయిడ్ గ్రాండే హెవీ డ్యూటీ శ్రేణిలోని ప్లాస్మా ప్రొటెక్టివ్ షీల్డ్‌తో ఆరు బయట 60 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నా.., ఇంట్లో అత్యంత అనుకూలమైన సౌకర్యవంతమైన వాతావరణాన్ని అందిస్తుంది'' అని లాయిడ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అలోక్ టిక్కూ తెలిపారు. తెలుగు తమిళ బాషల్లో ఉండే ఈ కమర్షియల్ యాడ్ అన్ని డిజిటల్ మాధ్యమాల్లో ప్రసారం అవుతుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-3-2023	
విశాఖ	450–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425–00
విజయవాడ	425–00
రిటైల్ ధర (డజను)	66.00
27-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	410–00
వరంగల్	412–00
రిటైల్ ధర	4.70

ఫస్ట్ సిటిజన్స్ చేతికి ఎస్‌వీబీ

న్యూయార్క్: సంక్షోభంతో మూతబడిన సిలికాన్ వేలీ బ్యాంక్ (ఎస్‌వీబీ) సింహభాగం కార్యకలాపాలను ఫస్ట్ సిటిజన్స్ బ్యాంక్ దక్కించుకుంది. దీంతో ఎస్‌వీబీకి చెందిన అన్ని డిపాజిట్లు, రుణాలు ఫస్ట్ సిటిజన్స్ బ్యాంక్ అండ్ ట్రస్టుకు బదిలీ అవుతాయి. ఎస్‌వీబీ కస్టమర్లు ఆటోమేటిక్‌గా ఫస్ట్ సిటిజన్స్ ఖాతాదారులుగా మారతారని ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎఫ్‌డీఐసీ) తెలిపింది. ఫస్ట్ సిటిజన్స్‌లో ఎఫ్‌డీఐసీకి 500 మిలియన్ డాలర్ల విలువ చేసే షేర్లు దక్కుతాయి. ఎస్‌వీబీకి చెందిన 167 బిలియన్ డాలర్ల అసెట్లలో 90 బిలియన్ డాలర్ల అసెట్లు ఎఫ్‌డీఐసీ వద్దే ఉంటాయి. 72 బిలియన్ డాలర్ల అసెట్లు, ఫస్ట్ సిటిజన్స్ బ్యాంక్‌కు భారీ డిస్కౌంటుపై 16.5 బిలియన్ డాలర్లకు దక్కుతాయి. ఎస్‌వీబీ వైఫల్యంతో డిపాజిట్ ఇన్సూరెన్స్ ఫండ్‌పై 20 బిలియన్ డాలర్ల మేర ప్రభావం పడనుంది. ఎస్‌వీబీ దెబ్బతో కుదేలైన ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్‌ను గట్టెక్కించేందుకు అమెరికాలోని 11 భారీ బ్యాంకులు దాదాపు 30 బిలియన్ డాలర్ల ప్యాకేజీని అందించాయి.



1898లో ఏర్పాటైన ఫస్ట్ సిటిజన్స్ బ్యాంక్ .. నార్త్ కరోలినాలోని రాలీ ప్రధాన కేంద్రంగా పని చేస్తోంది. 100 బిలియన్ డాలర్ల పైచిలుకు అసెట్లతో 21 రాష్ట్రాల్లో 500 శాఖలు ఉన్నాయి. బ్యాంకు ఆర్థిక పరిస్థితిపై అనుమానాలతో ఖాతాదారులు తమ డిపాజిట్లను భారీగా వెనక్కి తీసుకుంటూ ఉండటంతో మార్చి 10న ఎస్‌వీబీ కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత రెండు రోజులకు సిగ్నేచర్ బ్యాంక్ కూడా మూతబడింది.

ఆహా సీఈవోగా రవికాంత్ సబ్నవీస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఓటీటీ ప్లాట్‌ఫాం 'ఆహా' సీఈవోగా రవికాంత్ సబ్నవీస్ నియమితులయ్యారు. ఇప్పటిదాకా ఆ స్థానంలో ఉన్న అజిత్ ఠాకూర్ .. బోర్డ్ డైరెక్టరుగా పదోన్నతి పొందారు. సబ్నవీస్ నియామకం తక్షణం అమల్లోకి వచ్చినట్లు సంస్థ తెలిపింది. ఆయన అపార అనుభవం ఆహా వృద్ధికి తోడ్పడగలదని సంస్థ ప్రమోటర్ రాము రావు జూపల్లి తెలిపారు. కంపెనీకి ప్రత్యేక గుర్తింపు తేవడంలో అజిత్ కీలక పాత్ర పోషించారని, ఇకపైనా ఆహా స్టూడియో మొదలైన అంశాల్లో ఆయన మార్గదర్శకత్వం వహిస్తారని ఆహా ప్రమోటర్ అల్లు అరవింద్ పేర్కొన్నారు. విశిష్టమైన ప్రోగ్రామ్‌లతో వీక్షకులకు ఆహాను మరింత చేరువ చేసేందుకు ఆహా బృందం కృషి చేస్తుందని సబ్నవీస్ చెప్పారు. స్టార్ టీవీ, కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్, హెయిన్జ్ ఇండియా వంటి పలు రంగాల సంస్థల్లో వివిధ హోదాల్లో సబ్నవీస్‌కు 30 ఏళ్ల పైగా అనుభవం ఉంది.



ఊగిసలాట.. చివరికి స్వల్ప లాభాలు

- కొనసాగిన బ్యాంకింగ్ సంక్షోభ ప్రభావం
- సెన్సెక్స్ లాభం 127 పాయింట్లు
- 41 పాయింట్లు పెరిగిన నిఫ్టీ

ముంబై: అధిక వెయిటేజీ రిలయన్స్, మారుతీ సుజుకీ, ఎస్‌బీఐ షేర్లు ఒకటిన్నరశాతం రాణించడంతో స్టాక్ సూచీలు సోమవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. అంతర్జాతీయ బ్యాంకింగ్ సంక్షోభ ప్రభావం కొనసాగింది. ఫలితంగా ట్రేడింగ్‌లో సూచీలు తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 57,567 వద్ద స్వల్ప లాభంతో మొదలైంది. ఇంట్రాడేలో 605 పాయింట్ల పరిధిలో 57,415 వద్ద కనిష్టాన్ని.., 58,020 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 127 పాయింట్లు పెరిగి 57,654 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 39 పాయింట్లు లాభంతో 16,984 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. రోజంతా 16,919 – 17,091 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 41 పాయింట్లు బలపడి 16,986 వద్ద నిలిచింది. ఫార్మా, ప్రభుత్వరంగ బ్యాంక్స్, ఎఫ్‌ఎంసీజీ షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆటో, ఫైనాన్స్, మీడియా, రియల్టీ, కన్జూమర్, ఇంధన రంగాలకు చెందిన మధ్య, చిన్న తరహా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దీంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు వరుసగా 1.50%, ఒకశాతం చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.891 కోట్ల షేర్లను అమ్మేయగా.., సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1809 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ మూడు పైసలు బలపడి 82.37 స్థాయి వద్ద స్థిరపడింది. సిలికాన్ వ్యాలీ బ్యాంక్ ని ఫస్ట్ సిటిజన్స్ బ్యాంక్ టేకోవర్ చేయడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సెంటిమెంట్ బలపడింది.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- రిలయన్స్ షేరు రాణించి సూచీల పతనాన్ని అడ్డుకుంది. బీఎస్ఈలో ఈ షేరు ఒకటిన్నర శాతం లాభపడి రూ.2,238 వద్ద ముగిసింది.
- లుపిన్ కంపెనీ షేరు మూడుశాతం లాభపడి రూ.659 వద్ద స్థిరపడింది. వాల్బెనజైన్ క్యాప్సుల్‌ను అమెరికా మార్కెట్లో విక్రయించేందుకు యూఎస్ఎఫ్‌డీఏ నుంచి తాత్కాలిక అనుమతి పొందడంతో ఈ షేరుకు డిమాండ్ లభించింది.
- రిఫ్రాక్టరీ యూనిట్ ను ప్రమోటర్ కంపెనీకి విక్రయిస్తున్నట్లు ప్రకటించడంతో దాల్మియా భారత్ షేరు 2% లాభపడి రూ.1,872 వద్ద స్థిరపడింది.

భారత్ వృద్ధి రేటు.. 6 శాతం!

- 2023–24పై ఎస్అండ్‌పీ అంచనా
- 2022–23లో 7 శాతంగా ఉద్ఘాటన
- రెపో రేటు మరింత పెంచే అవకాశం

న్యూఢిల్లీ: భారత్ ఆర్థిక వృద్ధి ఏప్రిల్ 1 నుండి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరంలో (2023–24) 6 శాతంగా ఉంటుందన్న తన అంచనాల్లో ఎటువంటి మార్పూ లేదని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ తాజా నివేదికలో పేర్కొంది. 2024–25లో ఈ రేటు తిరిగి 6.9 శాతానికి చేరుతుందని అంచనా వేసిన రేటింగ్ దిగ్గజ సంస్థ- మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2022–23) ఎకానమీ వేగాన్ని 7 శాతంగా ఉద్ఘాటించింది. కాగా, ద్రవ్యోల్బణం కట్టడే ధ్యేయంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు–రెపోను (ప్రస్తుతం 6.5 శాతం) మరింత పెంచే అవకాశం ఉందని కూడా రేటింగ్ దిగ్గజం అంచనా వేసింది. ఆసియా–పసిఫిక్ ప్రాంతానికి సంబంధించి ఎస్అండ్‌పీ త్రైమాసిక ఎకనమిక్ అప్‌డేట్‌లో కొన్ని ముఖ్యాంశాలు పరిశీలిస్తే..

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 6.8 శాతంకాగా, 2023–24లో ఈ రేటు 5 శాతానికి తగ్గనుంది.



- 2024–2026 మధ్య భారత్ ఎకానమీ వృద్ధి తీరు సగటున 7 శాతం.
- 2024–25, 2025–26 ఆర్థిక సంవత్సరంలలో భారత్ జీడీపీ వృద్ధి తీరు 6.9 శాతంగా ఉండనుంది. 2026–27లో 7.1%కి పెరుగుతుందని అంచనా.
- భారత్ ఎకానమీకి సాంప్రదాయకంగా 'దేశీయ డిమాండ్' చోదక శక్తిగా ఉంది. అయితే ఇటీవలి కాలంలో అంతర్జాతీయ ప్రతికూల ప్రభావం కొంత ఎకానమీపై కనబడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాల్లో (ఏప్రిల్–సెప్టెంబర్) జీడీపీ వృద్ధి రేట్లు వరుసగా 13.5 శాతం, 6.3 శాతాలుగా నమోదయ్యాయి. డిసెంబర్ త్రైమాసికంలో ఈ రేటు 4.4%కి నెమ్మదించడం గమనార్హం.
- ఆర్‌బీఐ రేటు పెంపునకు ప్రాతిపదిక అయిన వినియోగ ద్రవ్యోల్బణం 2023–24 ఆర్థిక సంవత్సరంలో 5 శాతానికి తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, వాతావరణ సవాళ్లుసహా పలు అడ్డంకులూ ఉన్నాయి.

అంతర్జాతీయంగా చూస్తే..

ఆసియా–పసిఫిక్ ప్రాంతానికి సంబంధించి ఎస్అండ్‌పీ ఆశావాద దృక్పథాన్నే వెలువరించింది. ఈ సంవత్సరం చైనా ఆర్థిక వ్యవస్థ పుంజుకునే అవకాశం ఉందని తెలిపింది. 2023 చైనా వృద్ధికి సంబంధించి నవంబర్‌లో వేసిన 4.8 శాతం అంచనాలను 5.5 శాతానికి పెంచింది. మార్చిలో జరిగిన నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ ప్రకటించిన 5 శాతం అంచనాలకన్నా ఇది అధికం కావడం గమనార్హం. వినియోగం, సేవల రంగాలు ఎకానమీ పురోగతికి దోహదపడతాయని అభిప్రాయపడింది. అమెరికా, యూరోజోన్‌లో ఎకానమీలో 2023లో భారీగా మందగించవచ్చని రేటింగ్ దిగ్గజం పేర్కొంది. ఈ ఏడాది అమెరికా 0.7 శాతం, యూరోజోన్ 0.3 శాతం వృద్ధి సాధిస్తాయన్నది తమ అంచనాగా తెలిపింది. చైనా కోలుకోవడం ఆసియా–పసిఫిక్ ప్రాంతంపై అమెరికా, యూరప్‌లోని మందగమన ప్రభావాన్ని పూర్తిగా భర్తీ చేయబోదని పేర్కొన్న ఎస్అండ్‌పీ, ఇది కొంత ఉపశమనాన్ని మాత్రం కలిగిస్తుందని అంచనావేసింది.

రుణ గ్రహీతల వాదన కూడా వినండి

'మోసపు ఖాతా'గా ప్రకటించే విషయంలో బ్యాంకింగ్‌కు సుప్రీం సూచన

న్యూఢిల్లీ: ఒక అకౌంట్‌ను మోసపూరితమైనదిగా ప్రకటించేముందు సంబంధిత రుణ గ్రహీత తన వాదనను వినిపించుకునేందుకూ తగిన అవకాశం కల్పించాలని బ్యాంకింగ్‌కు అత్యున్నత న్యాయస్థానం సూచించింది. ఈ మేరకు 2020లో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ హిమా కోహ్లీలతో కూడిన ధర్మాసనం సమర్థించింది. ఒక ఖాతాను మోసపూరితంగా వర్గీకరించడం వల్ల ఆ నేర విచారణను దర్యాప్తు సంస్థలు చేపట్టడమే కాకుండా, అది ఇతర క్రిమినల్, సివిల్ చర్యలకూ దారితీస్తుందన్న విషయాన్ని అత్యున్నత న్యాయస్థానం ప్రస్తావించింది. ఖాతాను మోసపూరితమైనదిగా వర్గీకరించే చర్య.. రుణగ్రహీత వ్యాపారం, సద్భావనపై (గుడ్‌విల్) మాత్రమే కాకుండా కీర్తి ప్రతిష్టలను కూడా ప్రభావితం చేస్తుందని పేర్కొంది. సహజ న్యాయ సూత్రాల ప్రకారం రుణగ్రహీతలకు తప్పనిసరిగా నోటీసు అందించాలని, 'మోసపూరితమైనదిగా ప్రకటించడానికి దారితీస్తున్న పరిస్థితులకు సంబంధించి ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికలోని తీర్మానాలను వివరించడానికి అవకాశం ఇవ్వాలని సుప్రీంకోర్టు సూచించింది. ''తన అకౌంట్‌ను నేరపూరితమైనదిగా ప్రకటించడం కూడదని రుణగ్రహీత విజ్ఞప్తిచేస్తే, ఆ అభ్యంతరాలను తోసిపుచ్చాల్సిన పరిస్థితుల్లో... అందుకు సంబంధించి సహేతుకమైన ఉత్తర్వు జారీ చేయవలసి ఉంటుంది' అని బెంచ్ స్పష్టం చేసింది. 2016లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (వాణిజ్య బ్యాంకులు, నిర్దిష్ట ఆర్థిక సంస్థలు మోసాల వర్గీకరణ రిపోర్టింగ్) ఇచ్చిన ఆదేశాలకు సంబంధించిన అభ్యర్థనలపై సుప్రీం తాజా తీర్పు వెలువరించింది.



విద్య, ఉద్యోగ సమాచారం

ఈపీఎఫ్‌వో, న్యూఢిల్లీలో 2674 ఎస్ఎస్ఏ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌వో).. దేశవ్యాప్తంగా రెగ్యులర్ ప్రాతిపదికన ఈపీఎఫ్‌వో-రీజియన్ల వారీగా సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్(ఎస్ఎస్ఏ)పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 2674 (ఆంధ్రప్రదేశ్ రీజియన్‌లో 39, తెలంగాణ రీజియన్‌లో 116 ఖాళీలు).
» **అర్హత:** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు నిమిషానికి 35 ఇంగ్లిష్ పదాలు లేదా నిమిషానికి 30 హిందీ పదాలు కంప్యూటర్‌లో టైపింగ్ చేయగల నైపుణ్యం కలిగి ఉండాలి.
» **వయసు:** దరఖాస్తు చివరి తేదీ నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 10–15 ఏళ్లు, ఎక్స్–సర్వీస్‌మెన్‌లకు 3 నుంచి 8 ఏళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.29,200 నుంచి రూ.92,300 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, కంప్యూటర్ టైపింగ్ టెస్ట్,డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ విధానంలో 150 ప్రశ్నలకు 600 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు. జనరల్ ఆప్టిట్యూడ్(30 ప్రశ్నలు), జనరల్ నాలెడ్జ్/జనరల్ అవేర్‌నెస్(30 ప్రశ్నలు), క్వాంటిటేటివ్ ఎబిలిటీ(30 ప్రశ్నలు), జనరల్ ఇంగ్లిష్(50 ప్రశ్నలు), కంప్యూటర్ లిటరసీ(10 ప్రశ్నలు) అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు 4 మార్కులు ఉంటాయి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు/రిజిస్ట్రేషన్ తేదీలు:** 27.03.2023 నుంచి 26.04.2023 వరకు
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 27.04.2023 నుంచి 28.04.2023 వరకు.
» **వెబ్‌సైట్:** www.epfindia.gov.in

ఏపీ ఎడ్‌సెట్-2023

ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీఈడీ, బీఈడీ(స్పెషల్) కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎడ్‌సెట్)–2023 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది పరీక్షను విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్శిటీ నిర్వహిస్తోంది.

» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి. బీటెక్, బీసీఏ, బీబీఎం విద్యార్థులు అర్హులే. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు డిగ్రీ స్థాయిలో చదివిన సబ్జెక్ట్‌లనే ఎడ్‌సెట్‌లో మెథడాలజీ సబ్జెక్ట్‌లుగా ఎంచుకోవాల్సి ఉంటుంది.
» **పరీక్ష విధానం:** పరీక్షలో మూడు విభాగాలలో 150 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**23.04.2023.
» **ఆలస్య రుసుము రూ.1000తో దరఖాస్తులకు చివరితేది:** 02.05.2023.
» **ఆలస్య రుసుము రూ.2000తో దరఖాస్తుకు చివరితేది:** 10.05.2023.
» **హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడ్ తేది:** 12.05.2023.
» **ప్రవేశ పరీక్ష తేది:** 20.05.2023.
» **వెబ్‌సైట్:** www.cets.apsche.ap.gov.in

ఏపీ లాసెట్-2023

ఏపీ ఉన్నత విద్యా మండలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడు, ఐదేళ్ల ఏపీ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీ లాసెట్–2023), ఏపీ పీజీ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీ పీజీఎల్‌సెట్–2023)నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షను గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహిస్తోంది.

» **కోర్సులు:** మూడు, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులు, రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సు.
» **అర్హత:** మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుకు ఏదైనా గ్రాడ్యుయేట్ డిగ్రీ, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుకు ఇంటర్మీడియట్, ఎల్ఎల్ఎం కోర్సుకు ఎల్ఎల్‌బీ లేదా బీఎల్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **పరీక్ష మాధ్యమం:**లాసెట్ ఇంగ్లిష్/తెలుగు, పీజీఎల్‌సెట్ ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది (ఆలస్య రుసుం లేకుండా):** 22.04.2023.
» **హాల్‌టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:**15.05.2023
» **పరీక్ష తేదీ:** 20.05.2023.
» **వెబ్‌సైట్:**https://cets.apsche.ap.gov.in

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 37 ఫార్మాసిస్ట్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఆఫీస్ ఆఫ్ జాయింట్ డైరెక్టర్(మెడికల్) ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఈఎస్ఐ డిస్పెన్సరీలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఫార్మాసిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 37
» **పోస్టుల వివరాలు:** సివిల్ అసిస్టెంట్ సర్జన్–16, ల్యాబ్ టెక్నీషియన్–05, ఫార్మాసిస్ట్–16.
» **అర్హత:** ఎంబీబీఎస్, ల్యాబ్ టెక్నీషియన్ సర్టిఫికేట్, డీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు సీఏఎస్‌కు రూ.58,850, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్‌కు రూ.31,040.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జాయింట్ డైరెక్టర్(మెడికల్), ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, ఐదో అంతస్తు, హాస్టల్ బిల్డింగ్, ఈఎస్ఐ హాస్పిటల్, సనత్‌నగర్, నాచారం, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 29.03.2023.
» **వెబ్‌సైట్:** medchal-malkajgiri.telangana.gov.in

నాగర్ కర్నూలు, జీజీహెచ్‌లో వివిధ పోస్టులు

నాగర్ కర్నూలులోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06
» **పోస్టుల వివరాలు:** పాథాలజిస్ట్–01, బయోకెమిస్ట్–01, మైక్రో బయాలజిస్ట్–01, రేడియాలజిస్ట్–01, ల్యాబ్‌మేనేజర్–01, రేడియోగ్రాఫర్(మేల్)–01.
» **అర్హత:** ఎండీ, ఎంఎస్సీ, డిప్లొమా, బీఎస్సీ, డీఎంఐటీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు ల్యాబ్ మేనేజర్/రేడియోగ్రాఫర్ కోసం రూ.30,000, ఇతర పోస్టులకు రూ.1,00,000.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సూపరింటెండెంట్ కార్యాలయం, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, నాగర్ కర్నూలు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 29.03.2023.
» **వెబ్‌సైట్:** www.nagarkurnool.telangana.gov.in

ఏపీ పీజీఈసెట్-2023

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ.. 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏపీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ పీజీఈసెట్) నోటిఫికేషన్ విడుదలచేసింది.

» **పీజీ కోర్సులు:** ఎంటెక్, ఎంఫార్మసీ, ఫార్మ్ డీ.
» **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీటెక్/బీఫార్మసీ ఉత్తీర్ణత పొందిన/చివరి ఏడాది పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
» గేట్/జీప్యాట్ అర్హత సాధించిన అభ్యర్థులకు విడిగా నోటిఫికేషన్ విడుదలచేస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.04.2023
» **రూ.5000 ఆలస్య రుసుముతో చివరితేది:** 14.05.2023.
» **ఏపీపీజీఈసెట్ 2023 పరీక్ష తేది:** 28.05.2023 నుంచి 30.05.2023.
» **వెబ్‌సైట్:** www.cets.apsche.ap.gov.in

బయోటెక్నాలజీలో పీజీ చేస్తారా

» జీఏటీ–బీ/బీఈటీ ద్వారా బయోటెక్నాలజీ పీజీ, పీహెచ్‌డీల్లో ప్రవేశం
» దేశవ్యాప్తంగా 63 యూనివర్సిటీలు/ఇన్‌స్టిట్యూట్స్‌లో అడ్మిషన్
» ఎంపికైన విద్యార్థులకు డీబీటీ స్టయిపెండ్, ఫెలోషిప్‌లు

బయోటెక్నాలజీ, అనుబంధ విభాగాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు వీలు కల్పించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ(జీఏటీ-బీ), అలాగే బయోటెక్నాలజీలో డాక్టోరల్ కోర్సుల్లో అడ్మిషన్స్ కోసం నిర్వహించే బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్(బీఈటీ)-2023 ప్రకటన విడుదలైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)..జీఏటీబీ/బీఈటీ-2023 నిర్వహించనుంది. జాతీయ స్థాయిలో జరిగే ఈ ప్రవేశ పరీక్షల ద్వారా దేశవ్యాప్తంగా 63 ఇన్‌స్టిట్యూట్‌లు, విశ్వవిద్యాలయాల్లో బయోటెక్నాలజీ పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టోరల్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు పొందవచ్చు. ఈ పరీక్షల వివరాలు..



జీఏటీ–బీ, బీఈటీ 2023

జీఏటీ-బీ కోర్సులు

జీఏటీ–బీలో అర్హత ద్వారా డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ(డీబీటీ) గుర్తింపున్న పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్.. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ అండ్ అలైడ్ ఏరియాస్; ఎంటెక్ బయోటెక్నాలజీ అండ్ అలైడ్ ఏరియాస్; ఎమ్మెస్సీ అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ, ఎంవీఎస్సీ యానిమల్ బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు.

అర్హత

జీఏటీ–బీ 2023కు హాజరయ్యే విద్యార్థులు కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ప్రవేశ పరీక్షకు హాజరుకావచ్చు. అయితే సంబంధిత విద్యాసంస్థ జారీచేసిన అండర్ టేకింగ్/అటెస్టేషన్ ఫామ్‌ను సమర్పించాలి.

స్టయిఫండ్

- జీఏటీ–బీ 2023లో అర్హత సాధించి, బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశం పొందిన వారికి ప్రతి నెల స్టయిఫండ్ అందుతుంది.
- ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, సంబంధిత కోర్సుల్లో ప్రవేశాలు పొందినవారికి నెలకు రూ.5000 స్టయిఫండ్ లభిస్తుంది.
- ఎమ్మెస్సీ అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ అభ్యర్థులకు నెలకు రూ.7500 స్టయిఫండ్ చెలిస్తారు.
- ఎంటెక్/ఎంవీఎస్సీ కోర్సుల్లో ప్రవేశం పొందిన వారు నెలకు రూ.12000 స్టయిఫండ్ పొందొచ్చు.
- కోర్సు మొదటి ఏడాదిలో విద్యార్థి చూపిన ప్రతిభ ఆధారంగానే రెండో ఏడాది స్టయిఫండ్ కొనసాగిస్తారు.

పరీక్ష విధానం

- జీఏటీ–బీ ప్రశ్నపత్రం బహుళైచ్ఛిక విధానంలో ఉంటుంది. కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) విధానంలో మొత్తం 240 మార్కులకు జరుగుతుంది. ప్రశ్నపత్రం ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది. సెక్షన్–ఎలో 60 ప్రశ్నలుంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు చొప్పున 60 మార్కులుంటాయి. ఈ ప్రశ్నలన్నీ కూడా 12 తరగతి(10+2) స్థాయిలోని ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్, బయాలజీల నుంచి ఉంటాయి.
- సెక్షన్–బిలో 100 ప్రశ్నలుంటాయి. ఇందులో 60 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు 3 మార్కుల చొప్పున 180 మార్కులుంటాయి. పరీక్ష సమయం 3గంటలు.

బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్ (బీఈటీ)

డాక్టోరల్ రీసెర్చ్ ఫెలోషిప్స్ కోసం దేశవ్యాప్తంగా జరిగే అర్హత పరీక్ష ఇది. సీబీటీ విధానంలో నిర్వహించే ఈ పరీక్షకు కూడా ప్రకటన వెలువడింది. అభ్యర్థులు బీఈటీలో చూపిన ప్రతిభ ఆధారంగా కేటగిరి–1, కేటగిరి–2 అనే రెండు రకాల మెరిట్ లిస్ట్‌లను తయారు చేస్తారు. రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగా తుది జాబితాను రూపొందిస్తారు. కేటగిరి–1లో స్థానం సంపాదించినవారు దేశంలో గుర్తింపు పొందిన ఏ విద్యాసంస్థలోనైనా పీహెచ్‌డీలో ప్రవేశం పొంది ఫెలోషిప్ అందుకోవచ్చు. కేటగిరీ–2 మెరిట్ జాబితాలో ఉన్న అభ్యర్థులు.. డీబీటీ స్పాన్సర్ చేసే ప్రాజెక్టుల్లో చేరి ఫెలోషిప్ పొందొచ్చు. వీరికి ఆయా ఇన్‌స్టిట్యూట్‌ల ఎంపిక విధానాన్ని అనుసరించి పీహెచ్‌డీలో చేరే అవకాశం లభిస్తుంది.

అర్హత

బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్(బీఈటీ) రాసే అభ్యర్థులు కనీసం 60శాతం మార్కులతో బ్యాచిలర్స్ (బీఈ/ బీటెక్/ ఎంబీబీఎస్) అండ్ మాస్టర్స్ (ఎంఎస్సీ/ ఎంటెక్/ ఎంవీఎస్సీ/ ఎం.ఫార్మ్/ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ/ఎంటెక్), బయోమెడికల్, బయోఇన్ఫర్‌మేటిక్స్, బయోకెమిస్ట్రీ, బయోఫిజిక్స్, బోటనీ, కెమిస్ట్రీ, కంప్యూటేషన్, బయాలజీ, జెనిటిక్స్, మైక్రోబయాలజీ, జువాలజీ లేదా బయాలజీ/లైఫ్–సైన్సెస్‌కు చెందిన అనుబంధ కోర్సు ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఫైనల్ సెమిస్టర్‌కు హాజరవుతున్న వారు, ఫైనల్ సెమిస్టర్ ఫలితాల కోసం ఎదురుచూస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు

జనరల్ అభ్యర్థుల వయసు 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/ మహిళలకు 5 ఏళ్ల వయోసడలింపు లభిస్తుంది. ఓబీసీ అభ్యర్థులకు(నాన్–క్రీమి లేయర్)3 ఏళ్ల సడలింపు ఉంటుంది.

పరీక్ష విధానం

- ఈ ప్రశ్నపత్రంలో రెండు సెక్షన్లుంటాయి. సెక్షన్–ఎలో 50 ప్రశ్నలు, ఒక్కో ప్రశ్నకు 3 మార్కుల చొప్పున 150 మార్కులుంటాయి. దీంట్లో జనరల్‌సైన్స్, మ్యాథమేటిక్స్, కెమిస్ట్రీ, జనరల్ ఆప్టిట్యూడ్ అనలిటికల్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ జనరల్ బయోటెక్నాలజీ ఉంటాయి.
- సెక్షన్–బిలో సిలబస్ ప్రకారం-బయోటెక్నాలజీకి సంబంధించిన 150 ప్రశ్నలుంటాయి. వాటిలో 50 ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటుంది.

ఒక్కో ప్రశ్నకు 3 మార్కుల చొప్పున 150 మార్కులకు పరీక్ష ఉంటుంది.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 31.03.2023
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 03.04.2023 నుంచి 04.04.2023
- **జీఏటీ–బీ పరీక్ష తేదీ:** 23.04.2023 ఉదయం 9–12 గంటల వరకు
- **బీఈటీ పరీక్ష తేదీ:** 23.04.2023 మధ్యాహ్నం 3–6 గంటల వరకు
- **పరీక్ష కేంద్రాలు:** ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరు, గుంటూరు, విశాఖపట్నం. తెలంగాణలో హైదరాబాద్/సికింద్రాబాద్.
- **వెబ్‌సైట్:** http://dbt.nta.ac.in

క్లుప్తంగా...

కరోనాపై ప్రభుత్వం అప్రమత్తం

● ఏప్రిల్ 11, 12 తేదీల్లో ఆసుపత్రుల్లో మాక్ డ్రిల్

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా కరోనా కేసులు క్రమంగా పెరుగుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కేసులు వ్యాప్తి చెందుతున్న రాష్ట్రాల్లోని పరిస్థితిపై కేంద్రం ఆరా తీసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖతో ప్రభుత్వం సోమవారం సమీక్ష నిర్వహించింది. కాగా, రాష్ట్రంలో కోవిడ్‌తీవ్రత లేదని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని వైద్య, ఆరోగ్య శాఖ ప్రభుత్వానికి వివరించింది. ఇక ఇదే అంశంపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కూడా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. కరోనా కేసులు పెరుగుతున్నందున పరీక్షలు, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అన్ని రాష్ట్రాలకు సూచించింది. కాగా, వారం తర్వాత కేసుల తీరును పరిశీలించి ఏప్రిల్ 11, 12 తేదీల్లో ఆసుపత్రుల్లో మాక్‌డ్రిల్‌నిర్వహించాలని సర్కార్ ఆలోచిస్తోంది. ఇప్పటికిప్పుడు మన రాష్ట్రంపై కరోనా ప్రభావం ఉండే అవకాశం లేదని వైద్యాధికారులు స్పష్టం చేస్తున్నారు.

గద్వాల-కర్నూలు రైలు మార్గంలో విద్యుద్దీకరణ పూర్తి



సాక్షి, హైదరాబాద్: గద్వాల-కర్నూలు సిటీ రైల్వే లైన్ విద్యుద్దీకరణ పూర్తికావటంతో ఆ మార్గంలో ఎలక్ట్రిక్ లోకోమోటివ్ రైళ్లను దక్షిణమధ్య రైల్వే ప్రారంభించింది. ఈ రెండు ప్రాంతాల మధ్య 54 కి.మీ. దూరం వరకు జరిగిన విద్యుద్దీకరణతో సికింద్రాబాద్-ధర్మవరం మధ్య పూర్తిస్థాయిలో విద్యుద్దీకరణ పూర్తయినట్టయింది. ఈ ప్రాజెక్ట్ 2018-19 సంవత్సరంలో రూ.916.07 కోట్ల అంచనా వ్యయంతో మొదలైంది. దక్షిణమధ్య రైల్వే పరిధిలోని డోన్- గుత్తి- ధర్మవరం, నైరుతి రైల్వే పరిధిలోని ధర్మవరం- బెంగళూరు సిటీ సెక్షన్ల మధ్య విద్యుద్దీకరణ మొత్తం పూర్తయింది.

'మనూ' యూజీ అడ్మిషన్ల దరఖాస్తుకు గడువు మార్చి 30

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలో యూజీ అడ్మిషన్లు, సీయూఈటీ ఆన్‌లైన్ దరఖాస్తుకు మార్చి 30.. చివరి తేదీ అని ఉర్దూ విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ సోమవారం తెలిపారు. కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ)-2023 ద్వారా వివిధ అండర్ గ్రాడ్యుయేట్ రెగ్యులర్ మోడ్ కోర్సుల్లోకి ఆన్‌లైన్ అడ్మిషన్లను అందిస్తోందన్నారు. దరఖాస్తు ఫారమ్‌ను ఆన్‌లైన్‌లోనే సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో ప్రస్తుత విద్యాసంవత్సరం 2023-24 నుంచి ఎన్‌ఈపీ-2020 ప్రకారం మల్టీ డిసిప్లినరీ మోడ్‌లో నాలుగేళ్ల యూజీ ఆనర్స్/రీసెర్చ్ (బీఏ,బీకామ్, బీఎస్సీ) కోర్సులను ప్రారంభిస్తోందని వనజ వెల్లడించారు. రెగ్యులర్ పీజీ, బీటెక్, బీఈడీ, డిప్లొమో ఇన్ ఇంజనీరింగ్, డీఎల్‌ఈడీ, అన్ని సర్టిఫికెట్లు, రీసెర్చ్ కోర్సులలో అడ్మిషన్లు విడివిడిగా నోటిఫై చేయబడతాయని తెలిపారు.



మన సమాచారాన్ని మనమే లీక్ చేసుకుంటున్నాం

గిఫ్ట్ కూపన్లు, రివార్డు పాయింట్లకు ఆశపడి అపరిచితులకు అందిస్తున్నాం

ఈ వివరాలనే కన్సల్టెన్సీలకు అమ్ముకుంటున్న కొందరు కేటుగాళ్లు

అవసరం లేనిచోట సమాచారం ఇవ్వరాదంటున్న సైబర్ నిపుణులు

కేస్ - 01

'గుడ్‌మార్నింగ్ సార్. యాదాద్రి దగ్గరలో కొత్త వెంచర్ ప్రారంభం కాబోతోంది. తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభాలు. మీ సొంత ప్రాంతానికి వెళ్లే దారిలోనే వెంచర్ ఉంది. తీసుకోండి...' అంటూ టెలికాలర్ ఫోన్ చేసి తన పేరు, పూర్తి చిరునామా చెప్పడంతో ఓ ప్రభుత్వ ఉద్యోగి అవాక్కయ్యాడు.

కేస్ - 02

'సార్.. మీరు వాడుతున్న ప్యూరిఫయర్‌తో పోలిస్తే మా ప్రొడక్ట్ అన్ని విధాలా ఉత్తమమైనది. మీరు సరే అంటే మా ఏజెంట్‌ను మీ ఇంటికి డెమోకు పంపుతాం. మీ చిరునామా ఇదే కదా..' అంటూ తన ఇంటి అడ్రస్‌ను ఓ ఉత్పత్తుల సంస్థ ఉద్యోగి ఫోన్లో చెబుతుంటే ఓ ప్రైవేటు ఉద్యోగి నోరెళ్లబెట్టాడు.

అప్పనంగా డేటా ఇచ్చేస్తున్నాం!

రియల్ ఎస్టేట్ అమ్మకాలని, క్రెడిట్ కార్డులని, ఇన్‌స్టంట్ లోన్లని, మార్కెట్‌లోకి కొత్త ప్రొడక్ట్స్ వచ్చాయని, కొత్త రెస్టారెంట్లు, షాపింగ్స్ మాల్స్ ప్రారంభోత్సవాలకు విచ్చేయాలంటూ దాదాపు నిత్యం మనకు అపరిచితుల నుంచి ఫోన్‌కాల్స్ రావడం పరిపాటిగా మారింది. అయితే వారందరికీ మన పేర్లు, ఫోన్ నంబర్లు, ఇంటి అడ్రస్‌లు, ఈ-మెయిల్స్ ఎలా తెలుస్తున్నాయి. మన వివరాలు మరెవరో కాదు... అప్పనంగా మనమే ఇచ్చేస్తున్నాం!

సాక్షి, హైదరాబాద్

ప్రస్తుత సాంకేతికత యుగంలో మన పేరు, ఫోన్ నంబర్, ఇంటి చిరునామా, పాన్, ఆధార్, ఈ-మెయిల్ అడ్రస్, పాస్‌వర్డ్‌లు కేవలం సమాచారం మాత్రమే కావు. మన జీవితాలను నిర్దేశించే అంశాలు. ఇవి సైబర్ నేరగాళ్ల చేతికి వెళితే బ్యాంకు ఖాతాలో ఉన్న మన కష్టార్జితం క్షణాల్లో హాంఫట్ అవ్వొచ్చు. మన పేరిట లోన్లు తీసుకొని ఎగ్గొట్టొచ్చు. కోట్ల మంది డేటాను కొల్లగొట్టిన ముఠా గుట్టును సైబరాబాద్ పోలీసులు ఇటీవలే రట్టు చేశారు. మన డేటా లీక్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపైనా ఉందని, వ్యక్తిగత సమాచారం ఎక్కడ ఇవ్వాలో, ఎక్కడ ఇవ్వకూడదో తప్పనిసరిగా అవగాహన ఏర్పరుచుకోవాలని సైబర్ భద్రతా నిపుణులు సూచిస్తున్నారు.

లాటరీలు, కూపన్ల పేరుతో డేటా సేకరణ...

మనం షాపింగ్ మాల్స్‌కు వెళ్లినప్పుడు లాటరీల కోసమనో లేదా గిఫ్ట్ కూపన్లు ఇచ్చేందుకనో మన వ్యక్తిగత వివరాలు అడుగుతున్నారు. అలా అడిగిందే తడవుగా రివార్డు పాయింట్ల కోసం, డిస్కౌంట్ల కోసం, గిఫ్ట్ కూపన్ల కోసం ఆశపడి మన వ్యక్తిగత వివరాలు ఇతరులకు ఇచ్చేస్తున్నాం. ఇలా పోగేసిన డేటాను కొందరు కేటుగాళ్లు కన్సల్టెన్సీలకు 5 పైసలకు ఒక కాంటాక్ట్ చొప్పున అమ్మకానికి పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఆయా కన్సల్టెన్సీలు కొన్ని వేల రూపాయల ఖర్చుతోనే కోట్ల మంది సమాచారాన్ని సేకరిస్తున్నాయి. ఈ తరహా సంస్థల నుంచి సైబర్ నేరస్తులు గంపగుత్తగా డేటాను కొని ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారు. అలాగే సోషల్ మీడియా ఖాతాల్లో ఉండే వ్యక్తిగత వివరాలను కొన్ని ఆన్‌లైన్ సంస్థలు డేటా ఎనలిటిక్స్ టెక్నిక్‌లతో సేకరించి వివిధ కంపెనీలకు వాణిజ్య ప్రకటనలు ఇచ్చేందుకు అమ్ముకుంటున్నాయి.

తప్పక డిలీట్ చేయించాలి..

వివిధ అవసరాలు, ప్రభుత్వ పథకాల నిమిత్తం ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, పాస్‌బుక్ మొదటి పేజీ, వివిధ సర్టిఫికెట్ల వంటి వాటిని ఫొటోకాపీ తీయించుకోవడం అనివార్యమవుతోంది. అయితే అలాంటప్పుడు మనం వాట్సాప్ లేదా ఈ-మెయిల్ ద్వారా పంపిన వివరాలను ప్రింట్ అవుట్ తీసుకున్న తర్వాత ఆ జిరాక్స్ సెంటర్ లేదా నెట్ సెంటర్ నుంచి డిలీట్ చేయించాలని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

డేటా ప్రైవసీలో యూరోపియన్ చట్టాలు ఎంతో కఠినం..

యురోపియన్ దేశాల్లో వ్యక్తిగత సమాచారం. వివరాలకు, వ్యక్తిగత గోప్యతకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. మన వివరాలను అను మతి లేకుండా ఎవరు తీసుకున్నా... వినియోగించినా వెంటనే వారిపై జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ చట్టం కింద భారీ జరిమానాలతోపాటు జైలుశిక్షలు విధించే అవకాశం ఉంది. ఆ తరహా చట్టాలు మన దేశంలోనూ వస్తేనే వ్యక్తిగత వివరాల గోప్యతకు రక్షణ ఉంటుందని సైబర్ నిపుణులు చెబుతున్నారు.

వీలైనంత వరకు ఇవ్వొద్దు...

వీలైనంత వరకు మీ ఫోన్ నంబర్, చిరునామా, ఈ-మెయిల్ ఐడీ, ఆధార్, పాన్ వంటి వివరాలను ఇతరులకు ఇవ్వొద్దు. ఇలా ఇవ్వడం వల్ల మన డేటాను ఆధారంగా చేసుకొని సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడే ప్రమాదం ఉంటుందని గ్రహించాలి.

– పాటిబండ్ల ప్రసాద్, సైబర్ సెక్యూరిటీ నిపుణుడు, ఢిల్లీ



ఆ లోన్ యాప్‌లను నమ్మొద్దు

ఫేక్ లోన్‌యాప్‌లను వెల్లడించిన కేంద్ర హోంశాఖ

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్‌లో రుణాల పేరుతో ఇన్‌స్టంట్ లోన్‌యాప్‌ల మోసాలు పెరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని అమాయకులను మోసగిస్తున్న పలు ఆన్‌లైన్ కంపెనీలపై కేసులు నమోదు అవుతున్నాయి. ఆన్‌లైన్‌లో ఇన్‌స్టంట్ లోన్ల పేరుతో మోసాలకు పాల్పడుతున్న పలు యాప్‌లపైనా కేంద్ర హోంశాఖ వర్గాలు దృష్టి పెట్టాయి. ఈ తరహాలో రెండు యాప్‌లను గుర్తించినట్లు కేంద్ర హోంశాఖ అధికారులు వెల్లడించారు. 'స్మార్ట్ క్రెడిట్-ఆన్‌లైన్ యాప్', 'ఏఏ క్రెడిట్-ఇన్‌స్టంట్ లోన్‌యాప్ పవన్ ఫిన్వెస్ట్ ప్రైవేటు లిమిటెడ్'లు నకిలీ యాప్‌లు అని వీటి నుంచి లోన్ పేరుతో వచ్చే ఎస్‌ఎంఎస్‌లు, వాట్సాప్ మెసేజ్‌లు, ఈ-మెయిల్స్ నమ్మొద్దని అధికారులు సూచించారు.

● మందు తాగే మేక



ఆత్మకూరు(ఎం):యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం మోదుగకుంటకు చెందిన రైతు సోలిపురం రవీందర్ రెడ్డి పెంచుకుంటున్న ఓ మేకకు ఒకరోజు మద్యాన్ని పట్టించాడు. అప్పటినుంచీ ప్రతిరోజూ సాయంత్రం పూట రవీందర్ రెడ్డి మద్యాన్ని తాగినప్పుడల్లా మేక కూడా వచ్చి యజమాని వద్ద నిలబడుతుంది. దీంతో ప్రతిరోజూ మేకకు మద్యం తాగిస్తుండటంతో దానికి అలవాటుగా మారిపోయింది. మేక మద్యం తాగుతుండటాన్ని పలువురు ఆసక్తిగా గమనిస్తున్నారు.

మెట్రో రెండో దశ.. దూరమే!

బీహెచ్ఈఎల్ - లక్డీకాపూల్, నాగోల్ - ఎల్‌బీనగర్

- పొడిగింపు అంశాలపై సీఎస్‌ను వివరణ కోరిన కేంద్రం
- తదుపరి కార్యాచరణ లేదని కేంద్ర కార్యదర్శి స్పష్టీకరణ
- ఆర్‌టీఐ సామాజిక కార్యకర్తకు బదులిచ్చిన కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి



సాక్షి, హైదరాబాద్: మెట్రోరైలు విస్తరణ పనులు మరింత ఆలస్యమయ్యే పరిస్థితులే కనిపిస్తున్నాయి. హైదరాబాద్ మెట్రోరైలు రెండో దశ కింద చేపట్టాలని భావించిన మూడు ప్రాజెక్టుల్లో ఒకటైన రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు కేరిడార్‌ను రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు శంకుస్థాపన కూడా చేసింది. మిగతా రెండు ప్రాజెక్టులైన బీహెచ్ఈఎల్ నుంచి లక్డీకాపూల్, నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ వరకు పొడిగింపు ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వంతో కలిసి జాయింట్ వెంచర్‌గా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ... ఆ దిశగా అడుగులు అంత వేగంగా పడడం లేదు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి సామాజిక కార్యకర్త ఇనుగంటి రవికుమార్ ఆర్‌టీఐ ద్వారా కేంద్రాన్ని కోరగా, కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి వికాష్ కుమార్ ఈ మేరకు సమాధానమిచ్చారు. హైదరాబాద్ మెట్రో రెండో దశకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రాసిన లేఖలకు తాము స్పందించామని, తదుపరి కార్యాచరణ లేదని స్పష్టం చేశారు. మెట్రో రెండో దశ ప్రాజెక్టులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ రాసిన లేఖకు కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సమాధానమిస్తూ మెట్రో మంజూరుకు కీలకమైన డీపీఆర్‌లో మార్పులతో పాటు సాధ్యాసాధ్యాలపై పలు సందేహాలు వ్యక్తం చేశారు.

వివరణ పంపని రాష్ట్రం

డీపీఆర్‌ను ప్రస్తుత ధరలకు అనుగుణంగా మార్చాలని సూచించడంతో పాటు 14 అంశాలపై వివరణ కోరారు. తాము కోరిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివరణలు వస్తే పరిశీలిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు అర్వింద్‌కుమార్‌కు గత డిసెంబర్ 1న లేఖ రాసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి వివరణ పంపలేదు. కేంద్రం అడిగిన కేబినెట్ తీర్మానం కాపీ, స్పెషల్ పర్పస్ వెహికిల్, నిధులు సమకూర్చే సంస్థను ఎంపిక చేయడం, రోడ్‌మ్యాప్ మొదలైనవాటిని ఫైనలైజ్ చేసి పంపాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం ఏమీ పంపలేదని ఆర్‌టీఐ ద్వారా అడిగిన ప్రశ్నలకు కేంద్రం సమాధానమిచ్చింది. ఈ నేపథ్యంలో రెండోదశ మెట్రో పనులపై అనుమానాలు వ్యక్త మవుతున్నాయి.

విస్నూరు గుట్టకు పగుళ్లు

చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి వెల్లడి



గుట్ట ఉపరితలంలో కర్ర పుచ్చినట్లు కనిపిస్తున్న మార్పులు



పాలకుర్తి టౌన్: జనగామ జిల్లా పాలకుర్తి మండల పరిధి విస్నూరు గుట్టకు పగుళ్లు వచ్చాయని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం గుట్టను సందర్శించిన ఆయన పలు ఆసక్తికర విషయాలు తెలిపారు. విస్నూరు గుట్టకు చెక్కిన సీతారామచంద్ర స్వామి శిల్పం పక్కన ప్రధాన శిలలో ఈ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయని చెప్పారు. గుట్టపై అనేక చిన్న చిన్న గుంటలున్నాయని, గుట్టపై భాగం నుంచి గతంలో పగుళ్లతో ఊడిపడిన శిలల పైనుంచే దారి ఏర్పరచినట్లు రత్నాకర్‌రెడ్డి వెల్లడించారు. చిక్కటి అగ్ని ద్రావణంలో కలిసిపోకుండా ఉన్న ఆక్సైడ్ ఖనిజాలు కాలక్రమంలో ప్రధాన శిల నుంచి వేరు పడి అనేక రంధ్రాలు, పగుళ్లు ఏర్పడినట్లు తెలిపారు. భూగర్భ శాస్త్రనిపుణులు అధ్యయనం చేస్తే పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.